www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

'పాలమూరు-రంగారెడ్డి' జాతీయ హోదాకు కృషి



ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి

తెలంగాణభవన్‌లో పదవీ బాధ్యతల స్వీకరణ

కేసీఆర్ దోపిడీలో మోదీకి భాగం: యాష్కీ

కులగణనతోనే బీసీల సమగ్రాభివృద్ధి: వీహెచ్

ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లు రవి

13

సోమవారం | 29-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 301 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చవితి పూర్తి; నక్షత్రం: పుబ్బ రా. 6.58 తదుపరి ఉత్తర; వర్జ్యం: తె.3.06-4.55; దుర్ముహూర్తం: మ.12.51-1.36, మ.3.06-3.51; అమృతఘడియలు: ఉ.11.44-1.33; రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.52, సూర్యాస్తమయం: 6.05 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తహసీల్దార్ల సంఘం డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గ్రామానికో రెవెన్యూ ఉద్యోగి

మళ్లీ వీఆర్వో, వీఆర్ఏలు..!

బీఆర్ఎస్ హయాంలో రద్దు.. ఇతర శాఖల్లోకి సర్దుబాటు

గతంలో ప్రభుత్వం, ప్రజల మధ్య వారధులుగా సేవలు

వందల ఏళ్లు భూములు కాపాడిన రెవెన్యూ ఉద్యోగులు

పునరుద్ధరిస్తామని ఇప్పటికే స్పష్టం చేసిన ప్రభుత్వం

పెద్దల తప్పులు బయటపడతాయనే రెవెన్యూ విచ్ఛిన్నం

సంస్కరణల పేరుతో తెచ్చిన ధరణి ఓ తప్పులతడక

పోర్టల్‌లోని లొసుగులతో సర్కారు భూములు మాయం

బీఆర్ఎస్ తొత్తులకు కట్టబెట్టిన వాటిని పేదలకు ఇస్తాం

ప్రతి ఉద్యోగికి 5వ తేదీ లోపే జీతం పడేలా చర్యలు

రెవెన్యూ మంత్రి పొంగులేటిశ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలు

డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్ల సంఘం డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించిన మంత్రి

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ రానుందా? గతంలో ప్రకటించిన మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మేరకు చర్యలు చేపట్టనుందా? బీఆర్ఎస్ సర్కారు హయాంలో తొలగించిన వ్యవస్థను పునరుద్ధరించనుందా? గ్రామ స్థాయిలో రెవెన్యూ శాఖను పటిష్ఠం చేసేందుకు నడుంబిగించనుందా? రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలను బట్టి చూస్తే ఈ ప్రశ్నలన్నిటికీ ఔననే సమాధానం వస్తోంది. ఆదివారం హైదరాబాద్‌లో డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దారుల సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రెవెన్యూ వ్యవస్థకు సంబంధించిన ఒక వ్యక్తి ఉండేలా చూడడమే లక్ష్యంగా పేర్కొన్నారు. ఇందిరమ్మ

మిగతా 13వ పేజీలో...

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు

పీహెచ్‌సీలు, పల్లె/బస్తీ దవాఖానాలు, అర్బన్ హెల్త్‌సెంటర్ల పేరు మార్చిన కేంద్ర ప్రభుత్వం

ఉపశీర్షికగా 'ఆరోగ్యం పరమం ధనం'

వెంటనే బ్రాండింగ్ చేయాలంటూ ఆదేశాలు

రాష్ట్రంలో 4,636 కేంద్రాల పేరు మార్పు

13

అ'క్రమబద్ధీకరణ'పై కొరడా!



జీవో 59 భూముల క్రమబద్ధీకరణ ఫైళ్ల రీవెరిఫికేషన్

అక్రమాల నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం.. రిజిస్ట్రేషన్లు పూర్తయిన స్థలాలకూ మళ్లీ పరిశీలన

వీటిలో నిర్మాణాలకు అనుమతులూ ఇవ్వొద్దని ఆదేశం.. ఫీజులు చెల్లించిన వాటికి కన్వేయన్స్ డీడ్‌ల నిలిపివేత

సుమారు వెయ్యి ఫైళ్ల రిజిస్ట్రేషన్‌కు బ్రేక్?.. సీఎం రేవంత్ ఆదేశాలతో రంగంలోకి దిగిన రెవెన్యూ శాఖ

నిర్మాణాలు లేకున్నా, ఉన్నట్లు చూపడమే ప్రధాన అక్రమం.. శాటిలైట్ మ్యాప్‌ల సాయంతో పరిశీలించి చర్యలు

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ పేరుతో చోటు చేసుకున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. జీవో 59 ఆధారంగా జరిగిన అక్రమ బద్ధీకరణలపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఈ జీవో కింద క్రమబద్ధీకరణ జరిగిన ప్రతి ఫైలునూ మళ్లీ పరిశీలించాలని నిర్ణయించింది. దీని కింద క్రమబద్ధీకరించిన అన్ని ఫైళ్లనూ రీవెరిఫికేషన్ చేయాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. దీంతో రెవెన్యూ శాఖ సర్క్యులర్ జారీ చేసింది. జీవో 59 కింద క్రమబద్ధీకరించిన దరఖాస్తులను, ఫైళ్లను మళ్లీ పరిశీలించాలని ఇందులో పేర్కొంది. ప్రభుత్వ భూముల్లో దశాబ్దాల నుంచి ఇళ్లు కట్టుకుని ఉంటున్నవారికి ఆ స్థలాలను క్రమబద్ధీకరణ చేసేందుకు గత ప్రభుత్వం జీవో 59ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆయా భూముల్లో నివాసముంటున్న వారినుంచి కొంత క్రమబద్ధీకరణ ఫీజు వసూలు చేసి.. ఆ స్థలాన్ని వారి పేరు మీదే రిజిస్ట్రేషన్ చేసే వెసులుబాటును ఈ జీవో ద్వారా కల్పించారు. అయితే ఇందులో అనేక అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఎలాంటి నిర్మాణాలు లేని ప్రభుత్వ భూముల్లోనూ ఎప్పటినుంచో నిర్మాణాలున్నట్లు చూపించి.. ఎకరాల కొద్దీ భూమిని ధారాదత్తం చేశారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ అక్రమాలపై కీలక నిర్ణయం తీసుకుంది. పూర్తిగా పరిష్కారమైన, క్రమబద్ధీకరించి రిజిస్ట్రేషన్లు కూడా చేసేసిన ఫైళ్లను మళ్లీ పరిశీలించాలని నిర్ణయించింది. అంతేకాకుండా ఫీజులు చెల్లించి ఇంకా రిజిస్ట్రేషన్ కాని దరఖాస్తులుంటే.. వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేయాలని నిర్దేశించింది. కాగా, జీవో 59 కింద వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటికి

మిగతా 12వ పేజీలో...

ఏ'ఛీ'పీలు..!



భూ దందాల్లో బాగా బిజీ

పోలీసు అధికారుల సెటిల్‌మెంట్లు

హైదరాబాద్ శివార్లలో ఇద్దరు ఏసీపీల వ్యవహారంపై జోరుగా చర్చ

12

సర్కారు మారినా వారిదే 'హవా'

మితిమీరుతున్న కొందరు అధికారులు

అప్పటి కీలక మంత్రి ఆశీస్సులతో పోస్టింగ్

వారిని ఇంకా కాపాడుతున్నదెవరు?

కేసీఆర్ కాలిగోటికీ రేవంత్ సరిపోడు



తీస్‌మార్‌ఖాన్లతోనే ఏమీకాలేదు

బుడ్డర్‌ఖాన్‌తో ఏమవుతుంది?

50 కోట్లు ఇచ్చి పదవి తెచ్చుకున్నాడు

విపక్షంలోనే కేసీఆర్ డేంజర్

బీజేపీని ఆపే సత్తా కాంగ్రెస్‌కు లేదు

సిరిసిల్లను వదిలి వెళ్లను..

వదంతులను నమ్మొద్దు: కేటీఆర్

సిరిసిల్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'కేసీఆర్‌ను తొక్కుతాం.. బొంద పెడతాం.. గులాబీ జెండాను కనబడకుండా చేస్తాం అంటూ మాట్లాడిన పెద్ద పెద్ద తీస్‌మార్ ఖాన్లతోనే ఏమీ కాలేదు. రేవంత్‌రెడ్డి లాంటి బుడ్డర్‌ఖాన్‌లతో ఏమవుతుంది?. పిచ్చిమాటలు, ప్రగల్భాలు పలుకుతున్నాడు. ఆయన గురువు కూడా గతంలో ఇలాగే మాట్లాడాడు. బీఆర్ఎస్‌ను వంద మీటర్లు తొక్కి వేయాలని.. మూడు ఫీట్లు లేని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడు. ఎన్నటికీ కేసీఆర్ కాలి గోటికి కూడా రేవంత్‌రెడ్డి సరిపోడు. కేసీఆర్ అనే నాయకుడు లేకపోతే తెలంగాణ వచ్చేదా? తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పదువులు వచ్చేవా?" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. సిరిసిల్లలో ఆదివారం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి లాంటి

మిగతా 14వ పేజీలో...



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్. చిత్రంలో వేం నరేందర్

సీఎంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ భేటీ

లోక్‌సభ ఎన్నికల వేళ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

ఆయన కాంగ్రెస్‌లో చేరారంటూ జోరుగా ప్రచారం

ఇటీవల నలుగురు ఎమ్మెల్యేలు కలవడంపైనా ఊహాగానాలు

హైదరాబాద్/రాజేంద్రనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ప్రతిపక్ష (బీఆర్ఎస్) ఎమ్మెల్యేలు కొందరు వరుసబెట్టి.. సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తున్నారు. మొన్న ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆయన్ను కలవగా.. తాజాగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సీఎంను కలవడంతో ఏదో జరుగుతోందని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఆదివారం సీఎంను కలిసిన

మిగతా 13వ పేజీలో...

నియోజకవర్గ సమస్యలపైనే కలిశా: ప్రకాశ్ గౌడ్

బడ్జెట్ సమావేశాల్లోనే కులగణన తీర్మానం

ఫిబ్రవరి 2వ వారంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న మంత్రి పొన్నం

వీలైనంత త్వరగా ఈ ప్రక్రియ చేపట్టి, పూర్తిచేసే యోచనలో సర్కారు

అధ్యయనానికి బృందాలు.. కర్ణాటక, బిహార్, ఆంధ్రప్రదేశ్‌లో పర్యటన

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కులగణనపై రేవంత్ సర్కారు మరింత వేగంగా అడుగులు వేస్తోంది. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను మొదలుపెట్టి, పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో ఉంది. ఈమేరకు.. ఫిబ్రవరి రెండోవారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించి, ఆ సమయంలోనే తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రక్రియ మొత్తాన్ని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పగించారు. బిల్లు ముసాయిదా తయారీ బాధ్యతలను ఆయన నిర్వర్తించనున్నారు. బడ్జెట్ సెషన్స్‌లో ఆయనే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్టు సమాచారం. ఎన్నికల ప్రచారంలో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అనంతరం మాదిగ, మాల, ఇతర ఎస్సీ ఉపకులాలకు కొత్తగా మూడు కార్పొరేషన్ల ఏర్పాటు అంశాలను కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా ప్రస్తావించింది. తన మేనిఫెస్టోలోనూ వాటిని ప్రముఖంగా పొందుపరచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే.. సీఎం రేవంత్ ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. దేశంలో కులాలవారీ లెక్కలకు సంబంధించిన సర్వే

మిగతా 13వ పేజీలో...

న్యాయం దిశగా తొలి అడుగు

రాష్ట్రంలో కులగణనకు ఏర్పాట్లపై రేవంత్‌రెడ్డికి రాహుల్ అభినందన

13



ప్రేమ్ కుమార్ (ఫైల్)

సీఐకి బేడీలు

బోధన్ మాజీ ఎమ్మెల్యే కుమారుడి కేసులో అరెస్ట్

ఎమ్మెల్యే అనుచరుడు కూడా..

ప్రజాభవన్ వద్ద కారు బీభత్సం కేసులో పురోగతి

నిందితుడు పారిపోయేందుకు సహకరించిన ప్రేమ్‌కుమార్

త్వరలో మరో సీఐ కూడా అరెస్ట్?

3



నితీశ్.. తొమ్మిదోసారి!

బిహార్ సీఎంగా మరోసారి ప్రమాణం

బీజేపీకి 2 డిప్యూటీ సీఎం పదవులు.. ప్రమాణ స్వీకారానికి హాజరైన నడ్డా



బిహార్ సీఎంగా ప్రమాణం చేస్తున్న నితీశ్

అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ

పాత మిత్రులం మళ్లీ కలిశాం.. ఇక విడిపోం

'ఇండియా'లో సరిగా లేకనే బయటకు: నితీశ్

కూటమి సారథ్యం లాక్కోడానికి కాంగ్రెస్ కుట్ర

అందుకే ప్రధాని అభ్యర్థిగా ఖర్గే పేరు ప్రస్తావన

సీట్ల పంపకాలపైనా జాప్యం, దీనివల్లే విడిపోయాం.. జేడీయూ నేత కేసీ త్యాగి

2

పదవీకాలంలో 11వ స్థానం

ప్రమాణాల్లో నంబర్ 1

9 సార్లు ప్రమాణం చేసిన ఏకైక సీఎం నితీశ్‌కుమార్

ఒక్కదెబ్బకు 3 పిట్టలు!

నితీశ్‌తో బీజేపీ దోస్తీ మర్మమిదే!

ఆయన నిష్క్రమణతో 'ఇండియా' కూటమి కకావికలు

బెంగాల్లో కాంగ్రెస్‌తో పొత్తు లేదని ఇప్పటికే తేల్చిన మమత

పంజాబ్, ఢిల్లీల్లో ఆప్ అదేబాట

ఇప్పుడు జేడీయూనీ బయటకు రప్పించిన మోదీ-షా

పిల్లిమొగ్గల నితీశ్

ప్రతిపక్ష పార్టీల ధ్వజం

ఆయనొక ఊసరవెల్లి: కాంగ్రెస్

2



పంచాయతీల్లో ప్రత్యేక పాలన!

12,769 గ్రామాలకు అధికారుల నియామకం.. నేడో, రేపో ఆదేశాలు

సెలవుల్లో ఉన్న సిబ్బంది అందరూ తక్షణమే విధులకు హాజరవ్వాలి

జడ్పీ సీఈవోలు, డీపీవోలకు సంకేతాలిచ్చిన రాష్ట్ర ఉన్నతాధికారి

పెండింగ్ బిల్లులపై సర్పంచుల్లో ఆందోళన

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది. సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1న ముగియనుండడంతో.. ఇకపై పాలనా బాధ్యతలను అధికారులు చేపట్టనున్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాధ్యపడని కారణంగా.. 12,769 గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాల వారీగా

మిగతా 14వ పేజీలో...

సర్పంచుల పదవీ కాలాన్ని

పొడిగించాలి

పెండింగ్ బిల్లుల్ని 2లోగా ఇవ్వాలి

లేనిపక్షంలో పంచాయతీలకు తాళం వేసి నిరాహార దీక్షలు

బిల్లులు ఇస్తే కాంగ్రెస్‌కు మద్దతు

తెలంగాణ సర్పంచుల సంఘం

14

6,956 మంది స్టాఫ్‌నర్సులు


తుది ఫలితాలు విడుదల చేసిన మెడికల్ బోర్డు

7,094 పోస్టులకు నియామక ప్రక్రియ

అర్హులైన అభ్యర్థుల్లేక మిగిలిన 138 పోస్టులు

ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలక్షన్ జాబితా వెల్లడి

రేవంత్ చేతులమీదుగా నియామక పత్రాలు?



హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్టాఫ్ నర్స్ పోస్టుల తుది ఫలితాలు వెల్లడయ్యాయి. ఫైనల్ మెరిట్ లిస్టుతోపాటు సెలక్షన్ జాబితాను మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యదర్శి గోపికాంత్‌రెడ్డి ఆదివారం విడుదల చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో వివిధ విభాగాధిపతుల పరిధిలోని 7,094 స్టాఫ్‌నర్స్ పోస్టులకుగాను 6,956 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఆయా కేటగిరీల్లో

మిగతా 3వ పేజీలో...



ఇండియా కూటమిలో ఉన్నప్పుడు ఖర్గే, రాహుల్ తదితరులతో నితీశ్

నితీశ్ ఓ ఊసరవెల్లి!

» జేడీయూ అధినేతపై కాంగ్రెస్ ధ్వజం

» లోక్‌సభ ఎన్నికల్లో జేడీయూ కనుమరుగే: తేజస్వీ

» ఈ బంధం మనుగడ ఏడాదే: ప్రశాంత్ కిశోర్

న్యూఢిల్లీ, పట్నా, కోల్‌కతా, చెన్నై, జనవరి 28: నితీశ్ కుమార్‌కు తరచుగా రాజకీయ పిల్లిమొగ్గలు వేయడం అలవాటేనని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శించాయి. ఆయనొక ఊసరవెల్లి అని కాంగ్రెస్ పేర్కొనగా, రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనే జేడీయూ అంతమవుతుందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ జోస్యం చెప్పారు. కాగా, చెత్త.. డస్ట్‌బిన్‌లోకే వెళ్లిందని లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య జేడీయూను ఉద్దేశించి విమర్శించారు. నితీశ్ పూర్తిగా విశ్వసనీయతను కోల్పోయారని డీఎంకే విమర్శించగా, నితీశ్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ హెచ్చరించింది. నితీశ్ కూటమిని వీడనున్న విషయం తనకు ముందే తెలుసని, అయితే, ఇండియా కూటమిని సఖ్యంగా ఉంచేందుకే తాను ఇప్పటివరకు ఆ ప్రస్తావన తేలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చెప్పారు. 'ఆయా రామ్-గయా రామ్ లాంటి వారు దేశంలో ఎంతోమంది ఉన్నారు. మొదట్లో ఆయన నేను కలిసి పోరాడాం. లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్‌లతో నేను మాట్లాడినప్పుడు నితీశ్ వెళ్లిపోతున్నాడని చెప్పారు' అని ఖర్గే వెల్లడించారు. నితీశ్ వెళ్లినంత మాత్రాన బీజేపీపై ఇండియా కూటమి పోరాటం ఆగదన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీ, నితీశ్ ఈ రాజకీయ డ్రామాకు తెరతీశారని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ఆరోపించారు. కాగా, నితీశ్-బీజేపీ బంధం ఎంతోకాలం మనలేదని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. బిహార్‌లో కొత్త ప్రభుత్వం మనుగడ ఏడాది లేదా అంతకంటే తక్కువే ఉంటుందని, 2025 అసెంబ్లీ ఎన్నికలకు ముందే వీరి బంధం తెగిపోనుందని జోస్యం చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆరు నెలలకే మార్పు ఏర్పడుతుందని, కావాలంటే రాసిస్తానని పీకే తెలిపారు.

నితీశ్‌కుమార్ పచ్చి అవకాశవాది: అసదుద్దీన్

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కూటములు మారుతున్న జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ బిహార్ ప్రజలకు తక్షణం క్షమాపణలు చెప్పాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ఇక నుంచి బిహార్‌లో పేరుకు మాత్రమే నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి అని.. పరిపాలనంతా ఇక ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీ కనుసన్నల్లోనే జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు మజ్లిస్ బీజేపీ బీ టీం అంటూ విమర్శించిన నితీశ్‌కుమార్ ఇప్పుడు ఏ సమాధానం చెబుతారంటూ ఒవైసీ ఎద్దేవా చేశారు. నితీశ్‌ను పచ్చి రాజకీయ అవకాశవాదిగా అభివర్ణించారు.

రాజకీయ అవకాశవాదానికి ముగింపు పలకాలి

కోల్‌కతా, డిసెంబరు 28: రాజకీయ అవకాశవాదానికి తప్పకుండా ముగింపు ఉండాలని పశ్చిమబెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీ దిలీప్ ఘోష్ వ్యాఖ్యానించారు. 'ఎవరైనా రాజకీయ నేత ఐదేళ్ల కాలంలో ఒక్కసారే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. కానీ ఐదేళ్లలో కనీసం రెండుమూడు సార్లు ప్రమాణ స్వీకారాలు చేసే రాజకీయ నాయకుడు నితీశ్ కుమార్. అది కూడా విభిన్న కూటముల నుంచి. ఇలాంటి రాజకీయ అవకాశవాదానికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది' అన్నారు.

నితీశ్.. తొమ్మిదోసారి!

బిహార్ సీఎంగా మరోసారి ప్రమాణం.. బీజేపీకి రెండు డిప్యూటీ సీఎం పదవులు.. హాజరైన నడ్డా

» మిత్రులం మళ్లీ కలిశాం.. ఇక విడిపోం

» ఇండియా కూటమిలో సరిగా లేదు.. అందుకే బయటకు: నితీశ్

పట్నా, జనవరి 28: గత కొన్ని రోజులుగా నడుస్తున్న నాటకీయ పరిణామాల మధ్య జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ తొమ్మిదోసారి బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఆదివారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ నితీశ్‌తో ప్రమాణం చేయించారు. బీజేపీ నుంచి ముగ్గురు, జేడీయూ నుంచి ముగ్గురు, మాజీ సీఎం జితన్‌రాం మాంఝీ పార్టీ హిందుస్థాన్ అవామ్ మోర్చాకు చెందిన ఒకరు, ఓ స్వతంత్ర ఎమ్మెల్యే మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు హాజరయ్యారు. జేడీయూ తాజా మాజీ మిత్రపక్షం ఆర్జేడీ ఈ కార్యక్రమాన్ని బహిష్కరించగా, కాంగ్రెస్ నుంచి ఎవరూ హాజరు కాలేదు. కొత్త ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందనలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటానికి, రాష్ట్ర అభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తుందన్నారు. సీఎంగా ప్రమాణం అనంతరం నితీశ్ విలేకర్లతో మాట్లాడారు. 'గతంలో వారితోనే (ఎన్‌డీఏతో) కలిసి ఉన్నా. ఆ తర్వాత దారులు వేరయ్యాయి. మళ్లీ ఒక్కటయ్యాం. ఇక ఎక్కడికీ వెళ్లే ప్రశ్నే ఉత్పన్నం కాదు' అని పేర్కొన్నారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా డిప్యూటీ సీఎంలుగా బాధ్యతలు చేపడతారని, మరికొన్ని రోజుల్లో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని చెప్పారు.





ఆదివారం మధ్యాహ్నం గవర్నర్‌కు రాజీనామా సమర్పిస్తున్న నితీశ్, సాయంత్రం బీజేపీ మద్దతుతో మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

అందరి అభిప్రాయాలతోనే నిర్ణయం

అంతకుముందు ఉదయం జేడీయూ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. పొత్తులపై నిర్ణయాధికారాన్ని సీఎం నితీశ్‌కు అప్పగిస్తూ తీర్మానం చేశారు. మరోవైపు, రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు సమావేశమై, జేడీయూకి మద్దతివ్వాలన్న తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. సామ్రాట్ చౌదరిని పార్టీ శాసనసభాపక్ష నేతగా, మాజీ స్పీకర్ విజయ్ కుమార్ సిన్హాను ఉప నేతగా ఎన్నుకున్నారు. దీనిపై నేతలిద్దరూ పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఆర్జేడీ సృష్టించిన జంగిల్‌రాజ్ నుంచి బిహార్‌ను కాపాడటానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. వీరిద్దరితో కలిసి నితీశ్‌కుమార్ మధ్యాహ్నం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు రాజీనామా లేఖను సమర్పించారు. బీజేపీ మద్దతుతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి అవకాశం ఇవ్వాలని కోరారు. రాజీనామా సమర్పించిన తర్వాత రాజ్‌భవన్ బయట విలేకర్లతో నితీశ్ మాట్లాడుతూ, మహాఘట్‌బంధన్ (ఆర్జేడీ-జేడీయూ) కూటమితోపాటు, ఇండియా కూటమిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మహాఘట్‌బంధన్ గురించి మీకు అందరికీ తెలుసు. ఇండియా కూటమి కోసం నేను చేసిన ప్రయత్నాలూ తెలుసు. అయితే, కొంతకాలంగా వ్యవహారాలు సరిగా నడవటం లేదు. దీనిపై మా పార్టీలో కూడా అసంతృప్తి నెలకొంది. అందరి అభిప్రాయాలు తీసుకున్నా' అని తెలిపారు.

లోకం తీరు



కాంగ్రెసే కారణం: జేడీయూ

ఇండియా కూటమి సారథ్య బాధ్యతలను లాక్కోవాలని కాంగ్రెస్ చూసిందని, అందువల్లే తాము బయటకు వచ్చామని జేడీయూ సీనియర్ నేత కేసీ త్యాగి చెప్పారు. 'డిసెంబరు 19న జరిగిన ఇండియా కూటమి సమావేశంలో ప్రధాని అభ్యర్థిగా ఖర్గే పేరును కుట్రపూరితంగా ముందుకు తీసుకొచ్చారు. అంతకుముందు ముంబైలో జరిగిన భేటీలో ప్రధాని అభ్యర్థిని ప్రకటించవద్దని నిర్ణయం జరిగింది. దీనికి భిన్నంగా ఖర్గే పేరును మమతతో ప్రతిపాదింపజేశారు. అంతేగాక, సీట్ల పంపకాలపై కాంగ్రెస్ జాప్యం చేస్తూ వస్తోంది. బీజేపీని ఎదుర్కొనే ప్రణాళికలు ఆ కూటమి వద్ద లేవు' అని పేర్కొన్నారు.

ఒక్క దెబ్బకు మూడు పిట్టలు!

న్యూఢిల్లీ/పట్నా, జనవరి 28: బిహార్ రాజకీయం రక్తికడుతోంది. గత పదేళ్లలో ఆరు సార్లు మిత్రులను మార్చేసిన బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌ను ఇక ఎన్‌డీఏలో చేర్చుకునేది లేదని కొద్ది నెలల కిందట బీజేపీ అగ్ర నేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. కానీ లోక్‌సభ ఎన్నికల ముంగిట ఆయన్ను సాదరంగా స్వాగతించారు. బీజేపీపై ప్రతిపక్షాలన్నీ ఒకే అభ్యర్థిని నిలిపితే ఆ పార్టీ ఓటమి ఖాయమంటూ 'ఇండియా' కూటమికి బీజం వేసిన నితీశ్.. ఆ కూటమిని వదిలేసి తిరిగి ఎన్‌డీఏ గూటికి చేరడం విచిత్రమే. ఆయన్ను తిరిగి తమ వైపు లాక్కోవడం ద్వారా ప్రధాని మోదీ-షా.. ఒకే దెబ్బకు మూడు పిట్టలను కొట్టారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇందులో ప్రధానమైనది.. విపక్ష ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేయడం. నిజానికి ఈ కూటమి ఏర్పాటులో నితీశ్‌దే కీలక పాత్ర. 2022 ఆగస్టు 8న బీజేపీకి కటీఫ్ చెప్పి.. తన చిరకాల ప్రత్యర్థి ఆర్జేడీ లాలూప్రసాద్ యాదవ్ గూటికి చేరి.. ఇంకోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన ఆయన.. ప్రతిపక్షాలన్నీ బీజేపీపై ఒకే అభ్యర్థిని నిలిపితే.. వ్యతిరేక ఓటు చీలకుండా ఉంటుందని.. ఈ దిశగా అవి ఏకం కావాలని పిలుపిచ్చారు. కాంగ్రెస్ పొడగిట్టని బెంగాల్, ఢిల్లీ సీఎంలు మమతా బెనర్జీ (టీఎంసీ), అరవింద్ కేజ్రీవాల్ (ఆప్), సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను, ఇతర విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చారు. 'ఇండియా' కూటమికి జాతీయ కన్వీనర్ కావాలనుకున్నారు. అయితే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత కాంగ్రెస్ నితీశ్, మమతను దూరం పెట్టడం మొదలుపెట్టింది. తర్వాత జరిగిన ఐదు రాష్ట్రాల.. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే ఇక తనకు తిరుగుండదని.. కూటమికి తానే నాయకత్వం వహించవచ్చని భావించింది. తెలంగాణలో తప్ప మిగతా రాష్ట్రాల్లో ఘోరంగా ఓడిపోయినా.. ఆ పార్టీ వెనక్కి తగ్గలేదు. కూటమి చైర్మన్‌గా ఖర్గే నియామకం తర్వాత నితీశ్‌కు పరిస్థితి అర్థమైంది. ఇదే సమయంలో మమత, కాంగ్రెస్ నడుమ చిచ్చు మొదలైంది. తమను సంప్రదించకుండా.. మాటమాత్రమైనా చెప్పకుండా రాహుల్‌గాంధీ స్వలాభం కోసం 'భారత్ జోడో న్యాయ యాత్ర'ను ప్రారంభించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. బెంగాల్లోని 42 లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీకి రెండే ఇస్తానని ప్రతిపాదించారు. ఇందుకు కాంగ్రెస్ అంగీకరించకపోవడంతో బెంగాల్లో ఆ పార్టీతో పొత్తు ఉండదని ఆమె ప్రకటించారు. యాత్రలో పాల్గొనడానికీ నిరాకరించారు. అటు పంజాబ్(13), ఢిల్లీ(7)ల్లో ఆప్ ఒంటరిగా పోటీచేస్తుందని..హరియాణా (10),గోవా(2),గుజరాత్‌లో (26) సీట్ల సర్దుబాటు చేసుకుందామని కేజ్రీవాల్ మెలిక పెట్టారు. అటు మహారాష్ట్ర(48)లో తాము గత ఎన్నికల్లో పోటీచేసిన 23 స్థానాల్లో ఒక్కటి కూడా వదులుకోబోమని ఉద్ధవ్ శివసేన ప్రకటించింది. దీంతో కూటమికి బీటలు పడినట్లయింది. ఇప్పుడు 40 ఎంపీ స్థానాల బిహార్‌లో నితీశ్‌ను తమ వైపు తిప్పుకొంటే.. ఆర్జేడీ-కాంగ్రెస్-లెఫ్ట్ కూటమిని ఓడించవచ్చని మోదీ-షా ఆలోచించారు. కుర్మీ వర్గానికి చెందిన నితీశ్ తమ వైపు ఉంటే.. బిహార్లో 16 లోక్‌సభ స్థానాల్లో గెలుపు అవకాశాలు ఉంటాయని.. యూపీలోనూ సీట్లు పెంచుకోవడానికి ఇది ఉపకరిస్తుందన్నది మోదీ-షా ఆలోచనగా భావిస్తున్నారు.



ప్రమాణస్వీకారం తర్వాత విందులో బీజేపీ అధ్యక్షుడు నడ్డా, బిహార్ గవర్నర్ అర్లేకర్, నితీశ్, డిప్యూటీ సీఎం సామ్రాట్

తగ్గుతున్న నితీశ్ ప్రభ..

2005 నుంచి మధ్యలో (2014-15) 9 నెలలు తప్ప బిహార్ సీఎంగా కొనసాగుతున్న నితీశ్ ప్రభ కొన్నేళ్లుగా మసకబారుతోంది. 2010లో ఆయన పార్టీ జేడీయూ 115 స్థానాలు గెలిచింది. 2015లో అది 71కి తగ్గింది. 2020 ఎన్నికల్లో ఏకంగా 43కి పడిపోయింది. ఈ ఎన్నికల్లో బీజేపీ 78 స్థానాలతో అతి పెద్ద పార్టీగా అవతరించింది. ఆర్జేడీ 75 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. 2022లో బీజేపీతో తెగతెంపులు చేసుకుని.. లాలూతో జట్టుకట్టిన తర్వాత.. ప్రభుత్వంలో ఆర్జేడీదే పైచేయి. ఇప్పుడు ఎన్‌డీఏలోకి తిరిగొచ్చి.. మళ్లీ సీఎం పీఠాన్ని దక్కించుకున్నా.. నితీశ్ కుమార్ బీజేపీ నియంత్రణలోనే పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

'పల్టూరామ్' తొమ్మిది ప్రమాణస్వీకారాల కథ!

2000	బిహార్ సీఎంగా తొలిసారి ప్రమాణ స్వీకారం. కానీ ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సినంతమంది ఎమ్మెల్యేలు లేకపోవడంతో రాజీనామా. తొలిసారి ఆయన సీఎం పదవిలో ఉన్నది కేవలం ఏడు రోజులే.
2005	బీజేపీతో కలిసి పోటీ చేసి ప్రభుత్వ ఏర్పాటు. రెండోసారి ప్రమాణ స్వీకారం
2010	బంపర్ మెజారిటీతో మళ్లీ అధికారంలోకి. మూడోసారి ప్రమాణ స్వీకారం
2013	ఎన్డీయే ప్రధాని అభ్యర్థిగా మోదీని ప్రకటించడంతో.. 17 ఏళ్లుగా బీజేపీతో ఉన్న బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్, సీపీఐ తదితర పార్టీలు బయటి నుంచి ఇచ్చిన మద్దతుతో ప్రభుత్వాన్ని నడిపారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీకి దిగితే జేడీయూకి రెండు సీట్లే వచ్చాయి. దీంతో సీఎం పదవికి రాజీనామా చేసి జితన్‌రామ్ మాంఝీని సీఎం చేశారు.
2015 ఫిబ్రవరి	జితన్‌రామ్ మాంఝీ రాజీనామా. సీఎంగా నితీశ్ నాలుగోసారి ప్రమాణ స్వీకారం.
2015 నవంబర్	ఆర్జేడీ, కాంగ్రెస్, జేడీయూతో కూడిన మహాకూటమి విజయం. సీఎంగా నితీశ్ ఐదో సారి ప్రమాణస్వీకారం.
2017 జూలై	సీఎం పదవికి రాజీనామా చేసి మహాకూటమి నుంచి బయటకు. కొన్నిగంటల వ్యవధిలోనే ఎన్డీయేతో చేతులు కలిపి ఆరోసారి ప్రమాణ స్వీకారం.
2020	బీజేపీతో కలిసి ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా ఏడోసారి ప్రమాణ స్వీకారం.
2022 ఆగస్టు	ఎన్డీయే నుంచి బయటకు. సీఎం పదవికి రాజీనామా. మహాకూటమితో కలిసి మళ్లీ ప్రభుత్వ ఏర్పాటు. 8వ సారి ప్రమాణం.
2024 జనవరి	మహా కూటమి నుంచి బయటకు. సీఎం పదవికి రాజీనామా. బీజేపీతో కలిసి మళ్లీ ప్రభుత్వ ఏర్పాటు. 9వ సారి ప్రమాణం.



పదవీకాలంలో 11వ స్థానం..

ప్రమాణాల్లో నెంబర్ వన్!

» అత్యధికకాలం సీఎంలుగా ఉన్న నేతలు ప్రమాణం చేసింది ఐదుసార్లే

దేశంలో సుదీర్ఘకాలం పాటు ముఖ్యమంత్రి పదవిలో ఉన్న నేతలతో నితీశ్ పోటీ పడుతున్నారు. 17 ఏళ్ల 158 రోజుల పాలనతో ఆయన 11వ స్థానంలో ఉన్నారు. విచిత్రమేమిటంటే, పదవీకాలం పరంగా 10 మంది తర్వాత ఉన్నప్పటికీ.. సీఎంగా ప్రమాణాల పరంగా మాత్రం నితీశ్‌దే రికార్డు. ముఖ్యమంత్రిగా 9 సార్లు ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి ఆయన తప్ప దేశంలో మరెవరూ లేరు. నితీశ్ కుమార్ కన్నా ఎక్కువ కాలంపాటు ముఖ్యమంత్రులుగా పని చేసిన 10 మందిలో 9 మంది ఐదుసార్లు సీఎంగా ప్రమాణం చేయగా, మాణిక్ సర్కార్ నాలుగు సార్లే ప్రమాణం చేశారు. వీరందరి కన్నా వెనక ఉన్న నితీశ్ మాత్రం 9 సార్లు ఆ పని చేసి 'రికార్డు' నెలకొల్పారు.

పేరు	రాష్ట్రం	పదవీకాలం	సీఎంగా ప్రమాణం
1. పవన్ చామ్లింగ్	సిక్కిం	24 ఏళ్ల 164 రోజులు	5 సార్లు
2. నవీన్ పట్నాయక్	ఒడిశా	23 ఏళ్ల 327 రోజులు	5 సార్లు
3. జ్యోతిబసు	పశ్చిమ బెంగాల్	23 ఏళ్ల 137 రోజులు	5 సార్లు
4. గెగాంగ్ అపాంగ్	అరుణాచల్ ప్రదేశ్	22 ఏళ్ల 250 రోజులు	5 సార్లు
5. లాల్ తన్హాలా	మిజోరం	22 ఏళ్ల 60 రోజులు	5 సార్లు
6. వీరభద్రసింగ్	హిమాచల్ ప్రదేశ్	21 ఏళ్ల 13 రోజులు	5 సార్లు
7. మాణిక్ సర్కార్	త్రిపుర	19 ఏళ్ల 363 రోజులు	4 సార్లు
8. ఎం.కరుణానిధి	తమిళనాడు	18 ఏళ్ల 362 రోజులు	5 సార్లు
9. ప్రకాశ్‌సింగ్ బాదల్	పంజాబ్	18 ఏళ్ల 350 రోజులు	5 సార్లు
10. యశ్వంత్ పర్మార్	హిమాచల్ ప్రదేశ్	18 ఏళ్ల 83 రోజులు	5 సార్లు
11. నితీశ్‌కుమార్	బిహార్	17 ఏళ్ల 158 రోజులు	9 సార్లు

నేటి చట్టాలు రేపటి కోసం

ప్రస్తుత కాలానికి అనుగుణంగా చట్టాలను ఆధునికీకరిస్తున్నాం

» సుప్రీంకోర్టు వజ్రోత్సవ వేడుకల్లో మోదీ



న్యూఢిల్లీ, జనవరి 28: "ప్రస్తుత కాలానికి అనుగుణంగా చట్టాలను ఆధునికీకరిస్తున్నాం. నేడు మారుతున్న ఈ చట్టాలు రేపటి భారత దేశాన్ని మరింత బలోపేతం చేస్తాయి" అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన సుప్రీంకోర్టు వజ్రోత్సవ(75వ వార్షికోత్సవం) వేడుకలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అదేవిధంగా డిజిటల్ సుప్రీంకోర్టు రిపోర్ట్(డీజీ ఎస్సీఆర్), డిజిటల్ కోర్ట్స్ 2.0, సుప్రీంకోర్టు నూతన వెబ్‌సైట్‌లను ప్రధాని ప్రారంభించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. ఇటీవల తీసుకువచ్చిన మూడు కొత్త నేర న్యాయ చట్టాలతో దేశ న్యాయ, పోలీసింగ్, విచారణ వ్యవస్థలు సరికొత్త యుగంలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. వందల ఏళ్లనాటి చట్టాల నుంచి కొత్త చట్టాలకు మారుతున్న క్రమంలో ఈ ప్రక్రియ సజావుగా ఉండేలా చూసుకోవడం అత్యంత ముఖ్యమని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు సామర్థ్యం పెంపుదల, చట్టాలపై అవగాహనకు సంబంధించిన శిక్షణను ప్రారంభించినట్టు చెప్పారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు కూడా ముందుకు రావాలని, న్యాయవ్యవస్థలోని అన్ని విభాగాల సామర్థ్యాలను పెంచేందుకు సహకరించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. విశ్వసనీయమైన న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూ అనేక నిర్ణయాలు తీసుకుంటోందని వెల్లడించారు. 'జన్ విశ్వాస్' బిల్లు ఈ రూపంలో వచ్చిందేనని, దీనివల్ల న్యాయవ్యవస్థపై పడుతున్న అనవసరపు భారాన్ని తగ్గిపోతుందని చెప్పారు. "మధ్యవర్తిత్వ చట్టంతో న్యాయస్థానాలపై భారం తగ్గుతుంది. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాన్ని మెరుగుపరుస్తుంది" అని ప్రధాని తెలిపారు. సుప్రీంకోర్టు భవనాల విస్తరణ, మౌలిక సదుపాయాలకు సంబంధించి రూ.800 కోట్ల పనులకు గత వారమే ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. అయితే, కొత్త పార్లమెంటు భవనంపై పిటిషన్లు వేసినట్టుగా.. సుప్రీంకోర్టు మౌలిక సదుపాయాల కల్పనను సవాల్ చేస్తూ ఎవరూ పిటిషన్ వేయరని భావిస్తున్నట్టు వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు నిర్ణయాలు డిజిటల్ రూపంలో అందుబాటులోకి రావడం, తీర్పులు స్థానిక భాషల్లో అనువదించే ఏర్పాటు చేయడం పట్ల ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. ఈ తరహా ఏర్పాట్లు దేశవ్యాప్తంగా ఇతర కోర్టుల్లోనూ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, ఇతర న్యాయమూర్తులు, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సుప్రీంకోర్టు
సీజేఐ

సుప్రీంకోర్టు తీర్పులు ఇక నుంచి డిజిటల్ నివేదికల రూపంలో ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి రానున్నాయని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. సుప్రీంకోర్టు వజ్రోత్సవ వేడుకల్లో మాట్లాడుతూ.. "ఇదొక మహత్తరమైన రోజు. రాజ్యాంగం ద్వారా ప్రజలు వారికి వారే ఏర్పాటు చేసుకున్న కోర్టు ఇది. పౌరుల పరస్పర గౌరవానికి రాజ్యాంగం పెద్దపీట వేసింది" అని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. భవిష్యత్తు గురించి చెబుతూ.. దేశం మొత్తానికి సంబంధించిన రియల్ టైమ్ జ్యుడీషియల్ డేటాను పర్యవేక్షించేందుకు వీలుగా సాంకేతికతతో కూడిన 'వార్ రూమ్'ను ప్రారంభించనున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ కీలకమైన పదవుల్లో మహిళలను నియమించినట్టు తెలిపారు.

రాజ్యాంగ నిర్మాతలకు స్ఫూర్తి

రాముడి పాలనే

ఈ ఏడాది తొలి 'మన్ కీ బాత్'లో మోదీ

న్యూఢిల్లీ, జనవరి 28: అయోధ్యలోని రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమం కోట్లాది మందిని ఏకతాటిపైకి తెచ్చిందని, ఆ సమయంలో దేశ సమష్టి శక్తి కనిపించిందని ప్రధాని మోదీ అన్నారు. ఈ ఏడాది నిర్వహించిన తొలి మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. రాముడి పాలన రాజ్యాంగ నిర్మాతలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్యానించారు. అందరి భావాలు, భక్తి ఒకటేనని.. అందరి మాటల్లో, అందరి హృదయాల్లో రాముడు ఉన్నాడని అన్నారు. ఈ నెల 22న చాలామంది రామ భజనలు పాడి వాటిని శ్రీరాముడికి అంకితం చేశారని, ఆ రోజు సాయంత్రం దేశమంతా రామ జ్యోతిని వెలిగించి దీపావళి జరుపుకొందని అన్నారు. ఈ సమష్టి శక్తి దేశాన్ని ప్రగతి పథంలో సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పద్మ అవార్డుల గురించి కూడా మోదీ మాట్లాడారు. ఇటీవల అవార్డులు అందుకున్న వారిలో చాలామంది క్షేత్రస్థాయిలో వెలుగులోకి రానప్పటికీ.. సమాజంలో పెను మార్పులకు కారణమైన వారేనని చెప్పారు. భారతీయ సంస్కృతిని, వారసత్వాన్ని దేశవిదేశాల్లో కొత్త పుంతలు తొక్కిస్తున్న విదేశీయుల్లో కూడా కొందరిని పద్మ అవార్డులతో సత్కరించామని వెల్లడించారు.

మహిళా శక్తి భేష్..

గణతంత్ర వేడుకల్లో మహిళా శక్తిని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న 20 బృందాల్లో 11 మహిళా బృందాలేనని కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ సుమారు 1,500 మంది ఆడపడుచులు పాల్గొన్నారని ప్రధాని గుర్తుచేశారు. ఈ ఏడాది 13 మంది మహిళా క్రీడాకారులను అర్జున అవార్డుతో సత్కరించామని చెప్పారు. అవయవ దాతలను కూడా మోదీ ఈ సందర్భంగా కీర్తించారు.

కూలి చేసైనా భార్యకు భరణం ఇవ్వండి

» ఆదాయం లేదని ఎగవేత తగదు.. అలహాబాద్ హైకోర్టు ఆదేశం

లఖ్‌నవూ, జనవరి 28: ఉద్యోగం, ఆదాయం లేనందున విడాకులిచ్చిన భార్యకు మనోవర్తి చెల్లించలేనంటూ భర్త చెప్పడం తగదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. భార్యకు భరణం చెల్లించడం భర్త విధి అని తెలిపింది. కూలిపనులు చేసైనా సరే మనోవర్తి ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్‌కు చెందిన న్యాయమూర్తి జస్టిస్ రేణు అగర్వాల్ ఆదేశాలు ఇచ్చారు. ఆరోగ్యంగా ఉన్నందున కూలిపనులైనా చేసి రోజుకు రూ.300-400 సంపాదించవచ్చని, అందులో నెలకు రూ.2,000 భార్యకు ఇవ్వాలని ఆదేశించింది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఓ జంటకు 2015లో వివాహం జరిగింది. భర్త, అత్తమామలు వరకట్నం కోసం వేధిస్తున్నారని పేర్కొంటూ ఆమె మరుసటి సంవత్సరమే పుట్టినింటికి వెళ్లిపోయింది. విడాకుల కోసం ఆమె ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేయగా ఆ న్యాయస్థానం అనుకూలంగా స్పందించింది. ప్రతి నెలా మనోవర్తి ఇవ్వాలని ఆదేశించింది. మనోవర్తి చెల్లించకపోవడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఆయన వాదనలు వినిపిస్తూ తనకు కొద్ది పాటి భూమే ఉందని, కూలి పనులు చేసుకొని బతుకుతున్నానని తెలిపాడు. తనకు ఆరోగ్యం బాగులేదని, తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్ల బాధ్యతలను చూసుకోవాల్సి ఉందని వివరించాడు. తాను అద్దె ఇంట్లో ఉంటున్నానని, ఆమె ప్రయివేటు స్కూలులో పనిచేస్తూ నెలకు రూ.10 వేలు సంపాదిస్తోందని చెప్పాడు. అయితే ఈ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించలేదు. ఆమె టీచరుగా పనిచేస్తోందనడానికి ఎలాంటి ఆధారాలు చూపలేదని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్నందున రోజువారీ కూలి పనులైనా చేసి సంపాదించవచ్చని, దాని నుంచి భరణం చెల్లించాలని సూచించారు.

రిజర్వ్‌డ్ పోస్టుల డీరిజర్వ్ కుదరదు

యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలపై కేంద్ర విద్యాశాఖ వివరణ

న్యూఢిల్లీ, జనవరి 28: ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వు చేసిన పోస్టులకు తగిన అభ్యర్థులు దొరకని పక్షంలో వాటిని అన్ రిజర్వుడుగా ప్రకటించే ప్రతిపాదనతో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన ముసాయిదా మార్గదర్శకాలపై తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో కేంద్ర విద్యాశాఖ ఆదివారం దానిపై వివరణ ఇచ్చింది. రిజర్వుడు పోస్టులను డీ-రిజర్వ్ చేయడం కుదరదని స్పష్టం చేసింది. "ద గైడ్‌లైన్స్ ఫర్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద రిజర్వేషన్ పాలసీ ఆఫ్ ద గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్' పేరుతో యూజీసీ ఇటీవలే ముసాయిదా మార్గదర్శకాలు రూపొందించింది. దానిపై భాగస్వాముల స్పందన కోరుతూ ఆ గైడ్‌లైన్స్‌ను తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్‌ను తొలగించేందుకే కేంద్రం ఈ కుట్రకు తెరతీసిందంటూ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు సంబంధించిన సమస్యలపై మోదీ సర్కారు ప్రతీకాత్మక రాజకీయాలు చేస్తోందని మండిపడింది. కొన్నాళ్ల కిందే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్ల సమీక్షపై మాట్లాడారని.. ఆయన అన్నట్లుగానే ఇప్పుడు ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను ఎత్తేసేందుకు కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ ఆరోపించారు. 'మోహన్ భగవత్ ఉద్దేశాలకు అనుగుణంగానే యూజీసీ ప్రతిపాదనలున్నాయి. ఇది దళిత, గిరిజన, వెనకబడిన వర్గాలకు అన్యాయం చేయడమే అవుతుంది. దీనిపై పోరాడుతాం' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో.. కేంద్ర విద్యా సంస్థల (రిజర్వేషన్ ఇన్ టీచర్స్ కేడర్) చట్టం, 2019 ప్రకారం రిజర్వుడు పోస్టులను డీ-రిజర్వ్ చేసే అవకాశం లేదని.. పోస్టులన్నింటినీ ఆ చట్టం ప్రకారమే భర్తీ చేయాల్సిందిగా అన్ని కేంద్ర విద్యాసంస్థలకూ కఠిన ఆదేశాలు జారీ చేశామని కేంద్ర విద్యాశాఖ ట్విటర్‌ద్వారా వివరణ ఇచ్చింది. యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. గతంలోనూ అలా డీ-రిజర్వ్ చేయలేదని.. ఇకముందూ అలా జరగదని తేల్చిచెప్పారు.

ప్రమాణానికి రాలేదంటే

నా అభియోగం నిజమే

- డీకే అరుణపై వంశీచంద్‌రెడ్డి వ్యాఖ్యలు

మహబూబ్‌నగర్, జనవరి 28 : మాజీ మంత్రి డీకే అరుణ తన సవాల్‌ను స్వీకరించినా, రామాలయంలో ప్రమాణం చేసేందుకు రాలేదంటే తాను చేసిన అభియోగం నిజమేనని స్పష్టమవుతోందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి అన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయాలంటే రూ.15 కోట్లు ఇవ్వాలని పీసీసీ సమావేశంలో డీకే అరుణ అడిగారని ఇటీవల వంశీచంద్ ఆరోపించారు. అందుకు స్పందించి ఆమె అప్పటి సమావేశంలో ఉన్న నాయకులందరినీ జిల్లాలో ఏ రామాలయం వద్దకు తీసుకొస్తారో రావాలని, తానూ వస్తానని సవాల్ విసిరారు. దీంతో వంశీచంద్ ఆదివారం మహబూబ్‌నగర్ లోని రామాలయానికి ఎమ్మెల్యేలు యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరితో కలిసి వచ్చారు. వారక్కడ గంట పాటు వేచి ఉన్నా, ఆమె రాకపోవడంతో ఆలయంలో పూజలు చేసి మీడియాతో మాట్లాడారు. అరుణ రాలేదంటే ఆమె డబ్బులు అడిగిన మాట వాస్తవమేనని తెలుస్తోందన్నారు. తన వ్యాఖ్యలకు తాను ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని రాములవారిపై ప్రమాణం చేసి చెప్తానని స్పష్టంచేశారు. కాంగ్రెస్ శ్రేణులు రామాలయానికి పెద్దఎత్తున తరలి రావడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ చేతికి

ఖమ్మం డీసీసీబీ, డీసీఎంఎస్!

- రెండు చైర్మన్ పదవుల 'హస్త'గతానికి వ్యూహాత్మకంగా తుమ్మల అడుగులు

ఖమ్మం, జనవరి 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సొంత జిల్లా ఖమ్మంలో డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవులు 'హస్త'గతం కాబోతున్నాయి. ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌పై ఉన్న అసంతృప్తిని, గత డీసీఎంఎస్ చైర్మన్ కారు రుణం చెల్లించకపోవడతో డిఫాల్టర్‌గా ఉండడాన్ని గమనించి... తుమ్మల మంత్రి పదవి చేపట్టగానే వ్యూహాత్మకంగా సహకార రంగానికి చెందిన ఈ రెండు పదవులను కాంగ్రెస్ పరం చేసేందుకు నిబంధనలకు అనుగుణంగా వ్యూహం రచించారు. బీఆర్‌ఎస్ నేత రాయల శేషగిరిరావు కారు రుణ బకాయి చెల్లించకుండా డిఫాల్టర్‌గా ఉండడంతో ఆయనపై ఫిర్యాదులు వచ్చి విచారణ జరిగింది. ఆయన తల్లాడ మండలం గంగదేవిపాడు సొసైటీ డైరెక్టర్, చైర్మన్ పదవులతో పాటు డీసీఎంఎస్ చైర్మన్ పదవి కూడా కోల్పోయారు. ఆయన స్థానంలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్‌గా ఉన్న కొత్వాల శ్రీనివాసరావును నియమించారు. గతంలో బీఆర్‌ఎస్‌లో ఉన్న కొత్వాల అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఇప్పుడు ఆయనకు కాలం కలిసివచ్చింది. నోటిఫికేషన్ ద్వారా పూర్తిస్థాయి చైర్మన్‌గా కూడా ఆయనను ఎన్నుకునే అవకాశం ఉంది. ఇక బీఆర్‌ఎస్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు అనుచరుడిగా ఉన్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య విషయంలోనూ వ్యూహాత్మకంగా అవిశ్వాస అస్త్రం ప్రయోగించారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం సొసైటీలో కూరాకులపై డైరెక్టర్లలో తీవ్ర వ్యతిరేకత ఉండడం అవిశ్వాసానికి దారి తీసింది. మొత్తం 13 మంది డైరెక్టర్లలో 11 మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేశారు. అయితే కూరాకుల హైకోర్టుకు వెళ్లడం, కోర్టు ఆదేశాలతో ఓటింగ్ ఫలితాన్ని ఈ నెల 30 వరకు ప్రకటించకుండా ఆపారు. ఓటింగ్ వివరాలను కోర్టుకు నివేదించారు. అవిశ్వాసానికి అనుకూలంగా 11 మంది డైరెక్టర్లు ఓటు వేయడంతో కూరాకుల పదవి కోల్పోయే అవకాశం ఉంది. దీంతో డీసీసీబీ చైర్మన్ పదవి కూడా త్వరలో కాంగ్రెస్ పరం కాబోతోంది. వైస్‌చైర్మన్‌గా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావుకు తాత్కాలికంగా బాధ్యతలు ఇచ్చినా ఆ తర్వాత నోటిఫికేషన్ ఇచ్చి కాంగ్రెస్‌కు చెందిన డైరెక్టర్లలో ఒకర్ని ఎన్నిక చేసే అవకాశం ఉంది.

భారీ భూకంపానికీ చెక్కుచెదరదు

- అయోధ్య మందిరంపై శాస్త్రవేత్తల అధ్యయనం
- శాస్త్రీయ పరీక్షల అనంతరమే నిర్మాణం



న్యూఢిల్లీ, జనవరి 28: అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరం చాలా పటిష్ఠంగా ఉందని శాస్త్రవేత్తలు ధ్రువపరిచారు. 2,500 ఏళ్లకు ఒకసారి వచ్చే భారీ భూంకపాలను సయితం తట్టుకొని నిలిచేలా దీన్ని డిజైన్ చేశారని నిర్ధరించారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీబీఆర్ఐ)కు చెందిన నిపుణులు సంయుక్తంగా జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడయింది. జియో ఫిజికల్, జియో టెక్నికల్ సాంకేతిక విధానాలు, పునాది డిజైన్, 3డీ స్ట్రక్చరల్ అనాలసిస్ ద్వారా అధ్యయనం చేశారు. దీనిపై సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్త దేబదత్త ఘోష్ మాట్లాడుతూ 2,500 ఏళ్లకు ఒకసారి తీవ్రమైన 'మ్యాగ్నిమం కన్సిడర్డ్ ఎర్త్ క్వేక్' భూకంపాలు వస్తుంటాయని, అలాంటి సందర్భంలోనూ ఈ కట్టడం సురక్షితంగా ఉంటుందా అన్నదానిపై శాస్త్రీయ పరిశోధన జరిపినట్టు తెలిపారు. ఆయన సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ పరిధిలో వారసత్వ కట్టడాలను పరిరక్షించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ హెరిటేజ్ స్ట్రక్చర్‌కు సమన్వయకర్తగా ఉన్నారు. మరో సమన్వయకర్త మనోజ్ సామంతతో కలిసి ఆయన ఈ అధ్యయనం చేశారు. ముఖ్యంగా పునాది డిజైన్‌ను, నిర్మాణం తీరుపై అధ్యయనం చేశారు. ఈ విషయంలో వారికి సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ రమణచర్ల, పూర్వ డైరెక్టర్ ఎస్.గోపాలకృష్ణన్‌లు మార్గదర్శనం చేశారు. 50కిపైగా కంప్యూటర్ మోడల్స్‌ను తయారు చేసిన తరువాత మందిరం ఆకృతిని ఖరారు చేయడంతో వాటిపైనా విశ్లేషణ జరిపారు.

సూర్యాపేటలో కౌన్సిలర్ల ఫైటింగ్

నడి రోడ్డుపై ప్రజా ప్రతినిధుల తన్నులాట.. అవిశ్వాసానికి మద్దతిచ్చి వెనక్కి తగ్గిన నేత

- ఆమె ఇంటి వద్ద అసమ్మతి కౌన్సిలర్ల రచ్చ
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య ఘర్షణ
- బీఆర్‌ఎస్ మహిళా కౌన్సిలర్‌కు గాయం
- సుమారు 2 గంటల పాటు తీవ్ర ఉద్రిక్తత



సూర్యాపేటలో ఘర్షణ పడుతున్న కౌన్సిలర్లు

సూర్యాపేట టౌన్, జనవరి 28: మునిసిపల్ చైర్‌పర్సన్‌ను దించేసేందుకు సూర్యాపేట బల్దియాలో ప్రయోగించిన అవిశ్వాస తీర్మాన అస్త్రం అగ్గి రాజేసింది. తీర్మానంపై సంతకం చేసిన ఓ కౌన్సిలర్.. తీరా సమయానికి వెనక్కి తగ్గడంతో.. అసమ్మతి కౌన్సిలర్లలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆవేశంతో వారంతా ఆమె ఇంటి ముందు ఆందోళనకు దిగడం.. ఆమెకు మద్దతుగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు రావడంతో.. ఇరు వర్గాల మధ్య రెండు గంటల పాటు ఘర్షణ జరిగింది. సూర్యాపేట మునిసిపాలిటీలో చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్ బీఆర్‌ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిధుల కేటాయింపులో వివక్ష, వార్డుల్లో అభివృద్ధి జరగడం లేదని ఆరోపిస్తూ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని 32 మంది కౌన్సిలర్లు ఈ నెల 10న నోటీసులు అందజేశారు. దీంతో ఈ నెల 27న అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని మూడు నెలల క్రితం బీఆర్‌ఎస్ నుంచి బీఎస్పీలోకి చేరారు. ఆమె కూడా అవిశ్వాసానికి మద్దతు ప్రకటిస్తూ 15 రోజుల పాటు క్యాంపులో పాల్గొన్నారు. తర్వాత వెనక్కి తగ్గి ఆమె క్యాంపు నుంచి వచ్చారు. అవిశ్వాసానికి సరిగ్గా 32 మంది మద్దతు కావాలి. పావని వెనక్కి తగ్గడంతో అవిశ్వాసం వీగిపోతుందని గ్రహించి.. అసమ్మతి కౌన్సిలర్లలో ఒక్కరు కూడా అవిశ్వాస సమావేశానికి హాజరుకాలేదు. దీంతో అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించారు.

కౌన్సిలర్ తలకు గాయం..

పావని ఇంటి ఎదుట అసమ్మతి కౌన్సిలర్లు ఆదివారం ఆందోళన చేశారు. ఇంట్లోకి కోడి గుడ్లు విసిరి మట్టిని చల్లారు. ఇంట్లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా.. పోలీసులు వారిని అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు అక్కడికి చేరుకుని అసమ్మతి కౌన్సిలర్లతో వాగ్వాదానికి దిగారు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన చైర్‌పర్సన్ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్‌కు.. అసమ్మతి కౌన్సిలర్లకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కొండపల్లి నిఖిల తలకు గాయమై రక్తస్రావమవుతున్నందున అక్కడే కూర్చుండిపోయారు. ఆమెతో పాటు అసమ్మతి కౌన్సిలర్లు ఆందోళన కొనసాగించారు. సుమారు రెండు గంటల పాటు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు ఒక వర్గం.. కాంగ్రెస్ కౌన్సిలర్లు, తిరుగుబాటు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మరో వర్గంగా ఏర్పడి దాడులు చేసుకున్నారు. కాగా, బహుజనులకు రాజ్యాధికారం కోసమే అవిశ్వాసంపై వెనక్కి తగ్గానని కౌన్సిలర్ పావని అన్నారు. బహుజనులకు రాజ్యాధికారం కోసం ఇటీవల బీఎస్పీలో చేరానని, త్వరలో బీఆర్‌ఎస్‌లో చేరతానని తెలిపారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆమె ఇంటికి వెళ్లి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

భద్రాద్రి రామాలయ ప్రత్యేక పోస్టల్ కవర్ ఆవిష్కరణ

- రాష్ట్రంలో 6,266 పోస్టాఫీసులతో 4 కోట్ల మందికి సేవలు
- కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామాలయ ప్రత్యేక పోస్టల్ కవర్‌ను డాక్ సదన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో సైతం దేశ వ్యాప్తంగా పల్లె, పట్టణాల్లో సేవలు అందించిన ఏకైక సంస్థ తపాలా శాఖ అని గుర్తుచేశారు. తెలంగాణలో 6,266 పోస్టాఫీసుల ద్వారా 4.01 కోట్ల మంది ప్రజలకు సేవలు అందిస్తున్నట్టు వివరించారు. దేశ వ్యాప్తంగా 66 వేల పోస్టాఫీసులున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్. రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సురేఖ, హైదరాబాద్ రీజియన్ పీఎంజీ శ్రీతల, డీపీఎస్ దేవరాజ్, ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి జొన్నలగడ్డ స్నేహజ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్. చిత్రంలో చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్. రెడ్డి తదితరులు

బోధన్ మాజీ ఎమ్మెల్యే కుమారుడి కేసు..

ఇన్‌స్పెక్టర్‌కు బేడీలు

- బోధన్ మాజీ సీఐ, మరో వ్యక్తి అరెస్టు

బోధన్ రూరల్/పంజాగుట్ట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పంజాగుట్ట ఠాణా పరిధిలోని ప్రజాభవన్ వద్ద గత నెల 23న కారుతో బీభత్సం సృష్టించిన కేసులో నిందితుడిని తప్పించిన మరో ఇన్‌స్పెక్టర్ అరెస్టయ్యారు. ఈ కేసులో నిజామాబాద్ జిల్లా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ నిందితుడు. అతను దుబాయ్‌కి పారిపోయేందుకు అప్పట్లో బోధన్ సీఐగా పనిచేసిన ప్రేమ్‌కుమార్ సహకరించారు. దర్యాప్తు తొలినాళ్లలోనే ఈ విషయం తేలడంతో అధికారులు ప్రేమ్‌కుమార్‌ను సీపీఎ‌కు అటాచ్ చేశారు. ప్రమాదం జరగ్గానే పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడిన కాల్‌డేటాను దర్యాప్తు అధికారులు సేకరించారు. ప్రేమ్‌కుమార్ పాత్రపై పక్కా ఆధారాలు సేకరించారు. దీంతో.. ఆదివారం ఉదయం ప్రేమ్‌కుమార్‌ను, షకీల్ అనుచరుడు అబ్దుల్ వాసేను పంజాగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ తర్వాత ప్రేమ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. అయితే.. ఈ కేసును తారుమారు చేసేందుకు తొలుత యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు సస్పెండ్ అయిన విషయం తెలిసిందే.! ప్రేమ్‌కుమార్ అరెస్టు నేపథ్యంలో.. ఇప్పుడు దుర్గారావు కూడా కటకటాలు లెక్కించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఈ కేసులో అనుమానితుల ఫోన్ డేటాను పోలీసులు విశ్లేషిస్తున్నారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు. ఇక దుబాయ్‌లో ఉన్న ప్రధాన నిందితుడు సాహిల్‌ను భారత్‌కు రప్పించేందుకు పోలీసులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

జైళ్లశాఖలోని అధికారులకు పదోన్నతి

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జైళ్ల శాఖలోని ముగ్గురు అధికారులకు పదోన్నతి కల్పించారు. అసిస్టెంట్ డిప్యూటీ జైలర్లుగా పనిచేస్తున్న వారికి డిప్యూటీ జైలర్లుగా పదోన్నతితో పోస్టింగులు కేటాయిస్తూ.. హైదరాబాద్ రేంజ్ డీఐజీ డి.శ్రీనివాస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జైలులోని అసిస్టెంట్ డిప్యూటీ జైలర్లు పి.రాజేంద్ర బాబును సంగారెడ్డి సెంట్రల్ జైలుకు, ఎం.సుధాకర్‌రెడ్డిని కల్వకుర్తి సబ్-జైలుతోపాటు కరీంనగర్ జిల్లా జైలుకు అటాచ్ చేస్తూ బదిలీ చేశారు. అదే విధంగా చర్లపల్లి సెంట్రల్ జైలులోని వై.వెంకటరెడ్డికి మిర్యాలగూడ సబ్-జైలుకు పోస్టింగ్ ఇవ్వడంతో పాటూ నల్లగొండ జిల్లా జైలుకు అటాచ్ చేసినట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు.

కొయినా నీళ్ల కోసం అంతర్గత కమిటీ

కొయినా డ్యామ్ నుంచి నీళ్ల కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపేందుకు రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది. కృష్ణా బేసిన్‌లో నీటికొరత దృష్ట్యా ఎగువన మహారాష్ట్రలోని కోయినా డ్యామ్ నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సముద్రంలోకి విడుదల చేస్తున్న జలాలను దిగువకు విడుదల చేయాలని తెలంగాణ సర్కారు ప్రతిపాదిస్తున్న విషయం తెలిసిందే. ఈ కమిటీలో శ్రీధర్‌రావుదేశ్‌పాండే, సల్లా విజయ్‌కుమార్, పి.విజయ్‌కుమార్ ఉన్నారు.

6,956 మంది స్టాఫ్‌నర్సులు

(మొదటిపేజీ తరువాయి)

అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో మరో 138 పోస్టులు మిగిలిపోయినట్లు పేర్కొన్నారు. కాగా, ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అందించేందుకు వైద్య ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. ఎల్బీ స్టేడియంలో దీన్ని ఒక కార్యక్రమంలా నిర్వహించాలని భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇదే మొదటిది కానుండడంతో దీనిని ఒక పెద్ద కార్యక్రమంగా నిర్వహించనున్నారు. ఈ నెల 31న ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. అయితే ముఖ్యమంత్రి కార్యక్రమాలను బట్టి చివరి నిమిషంలో తేదీ మారే అవకాశాలు కూడా లేకపోలేదని పేర్కొన్నాయి. ఎంపికైన వారికి కొద్దిరోజుల్లో కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగులు ఇవ్వనున్నట్లు వెల్లడించాయి. నిజానికి 2022 డిసెంబరు 30వ తేదీన 5,204 స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి మెడికల్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది. గతేడాది ఆగస్టు 2న రాత పరీక్ష నిర్వహించారు. మొత్తం 40,936 మంది దరఖాస్తు చేసుకోగా.. పరీక్షకు 38,674 మంది హాజరయ్యారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌ను మూడు షిఫ్టుల్లో నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం మారిన తర్వాత గత డిసెంబరు 15న కాంగ్రెస్ సర్కారు మరో 1890 పోస్టుల భర్తీకి అనుమతినిచ్చింది. దాంతో మొత్తం స్టాఫ్‌నర్స్ పోస్టుల సంఖ్య 7,094కు చేరింది. ఇందులో ఒక్క డీఎంఈ, డీహెచ్ పరిధిలోనే 5,650 పోస్టులు ఉండగా, తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలో 757, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి, గురుకులాల్లో కలిపి మిగిలిన అన్ని పోస్టులు ఉన్నాయి. ఒకేసారి ఇంతమంది నర్సులు అందుబాటులోకి వస్తే.. మెడికల్ కాలేజీలు, జిల్లా, ఏరియా ఆస్పత్రులతోపాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత తగ్గనుంది. మెరుగైన వైద్య సేవలు కూడా అందుబాటులోకి వస్తాయని వైద్య వర్గాలు పేర్కొన్నాయి.



వివిధ

బొమ్మలు: అక్బర్



ఖండిత శిరస్ స్త్రీలు

చిగురుటాకుల ఎర్రటి అధరాలు లేవు
వాటి కొసన వెలిగే చిరునగవులు లేవు

సోగకళ్ళ చీకటి కాటుక నేత్రాలు లేవు
నక్షత్రాల్లా వెలిగే చూపులు లేవు

సంపెంగ కొసల నాసికలు లేవు
ఆ కొసన సూర్య కిరణమై మెరిసే పుడక లేదు

చెవులకు వేలాడే లోలాకులు లేవు
అలల రెక్కల తుమ్మెద కురులు లేవు

మాటని, శ్వాసని, జ్ఞానాన్ని,
సకల భావోద్వేగాలని, నవనాడులను
నియంత్రించి, దేహాన్ని నడిపే
కోట్లను కోట్ల న్యూరాన్ల సంగమ కూడలి
మానవ పురా రహస్య పేటికలో దాగి

ఇంకా పూర్తిగా కనుగొనని
మెలితిరిగి, ముడతలు పడిన
మెదడు అసలే లేదు
మనసు, హృదయాల ఊసన్నది
లేదు గాక లేదు

ఖండిత శిరస్ స్త్రీలకి దేహం ఉంది
రెండు చేతులున్నాయి
వాటి మధ్య రెండు రొమ్ములున్నాయి
ఆ కింద రెండు కాళ్లు, వాటి మధ్య
ఓహో! మహాద్భుత మర్మావయము ఉంది

ఏమి చేతులవి
సమస్త చాకిరీనీ ప్రతిఫలం అడగకనే
నిరంతరం చేస్తాయి

ఏమి రొమ్ములు అవి
మెత్తటి దూది తలగడల సుఖ నిద్రని
పురుషుడికి ఇస్తాయి
శిశువులకు పాలిస్తాయి
మర్మావయం అపరిమిత ఆనందాన్ని,
వాడికి సంతానాన్ని ఇస్తుంది

అనాదిగా స్త్రీల అపజయాలను
మగవాడి గెలుపు ధ్వజస్థంబాలను నాటే
పవిత్ర బలిస్థలం అది

మొండేలు, మొండేలుగా నడిచే స్త్రీలు
వట్టి దేహమై నడిచే స్త్రీలే లోకమంతటా

పని చేసేందుకు, పడుకునేందుకు
పిల్లల్ని కనేందుకు
స్త్రీలకు తలలు ఎందుకు?
మొండేలు చాలు
వారసుల్ని, సుఖాలను ఇవ్వగల అవయవాలు,
మాంసపు ముద్దలు
వట్టి శరీరాలు గల తెగిన
శిరస్సుల స్త్రీలు చాలు

ఒక తల తెగనరికిన స్త్రీని
ఇప్పుడే సమాధి చేసి వస్తున్నాను
దుఃఖ, దుఃఖంగా ఉంది లోన

నా తల నా చేతుల మధ్య నిలిచి
అడుగుతోంది నన్ను ఇప్పుడు

నువ్వు శిరస్సు తెగిన దేహానివా
లేక శిరస్సు ఇంకా దేహానికి
మిగిలి వున్న మనిషివా
లేక ప్రశ్నించగల శిరస్సువా అని

వాడు దేహాలు మాత్రమే గల స్త్రీలు జన్మనిచ్చిన కొడుకైనా
వాడు దేహాలు పరిచిన స్త్రీల సఖుడైనా
వాడు అనేకమార్లు
తల్లి తల తెగనరికిన
పరశురాముడి వారసుడిగా చివరి తేలుతాడు

తెగిన స్త్రీల శిరస్సులు నేలలో నాటిన
విత్తనాలై మొలకెత్తుతాయి
తెగిన స్త్రీల శిరస్సులు మాట్లాడతాయి
తమ బాధాకర, చిత్రహింసల జ్ఞాపకాల గురించే కాదు
నరికిన వాడి చేతులకంటిన నెత్తుటి గురించి
దేహం పై శిరస్సులు ఇంకా మిగిలిన వాళ్ల
మౌన అంగీకారాల గురించి
అవి నిలదీస్తాయి

పరశురామా!
నీ గొడ్డలి ఈ స్త్రీల చేతులకి అందితే అప్పుడేమవుతుంది?
ఆ ముగింపు కోరకనే కదా యుగాలుగా
స్త్రీలు ఖండిత శిరస్సులైంది?

నా వలే, నీ వలే
దేహాలు మాత్రమే మిగిలిన స్త్రీలు తమ
శిరస్సులు వెతుక్కుంటూ బయలుదేరారు

పరశురామా!
ఈ కథకు ఇక ముగింపు తప్పక పలుకుతారు వాళ్ళు

(హైదరాబాద్ నగరంలో 16.1.2024న ఇద్దరు పిల్లల తల్లి పుష్పలతను ఆమె భర్త తల తెగ నరికి చంపాడు. అంకురం పిల్లల హోంలో చదువుకున్న పుష్పను, ఆమె పాపని ఈ ఘటన జరగడానికి కన్నా కొన్ని రోజుల ముందే కలిసాను. పుష్ప, అలాంటి అనేక మంది స్త్రీల జీవితాలు రేపిన నా లోపలి కల్లోలమే ఈ కవిత.)

విమల

'లోయ చివరి రహస్యం' కథా సంపుటి

భగవంతం కథల సంపుటి 'లోయ చివరి రహస్యం' ఆవిష్కరణ సభ బోధి ఫౌండేషన్ & తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 సా.6గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి & ఆవిష్కర్త- కె. శ్రీనివాస్; విశిష్ట అతిథి- కిల్లాడ సత్యనారాయణ; అధ్యక్షులు- ఎస్. రఘు; తొలి ప్రతి స్వీకర్త- వి. హర్షవర్ధన్. ఆత్మీయ వాక్యం- సిద్ధార్థ, నండూరి రాజగోపాల్, ఇండ్ల చంద్రశేఖర్.

బోధి ఫౌండేషన్

'వర్తన' ప్రారంభ సమావేశం

సాహిత్యరంగంలో నవీన ధోరణులను పాదుకొల్పే లక్ష్యంతో ఏర్పాటయిన 'వర్తన' సాహిత్య సంస్థ ప్రారంభ సమావేశం ఫిబ్రవరి 4 ఉ.10.30గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. 'కవిత్వం - శిల్పం' అంశంపై విమర్శకులు ఎం. నారాయణ శర్మ ప్రసంగిస్తారు. సమావేశానికి అధ్యక్షత- గుడిపాటి, సమన్వయకర్త- ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

'కొన్ని మబ్బులు' కవిత్వ సంపుటి

విలాసాగరం రవీందర్ కవితల సంపుటి 'కొన్ని మబ్బులు' ఆవిష్కరణ సభ తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4 ఉ.10గంటలకు కరీంనగర్ ఫిలిమ్ భవన్‌లో జరుగుతుంది. అతిథులుగా పొన్నం రవిచంద్ర, గంద్ర లక్ష్మణరావు, బూర్ల వేంకటేశ్వర్లు, దామరకుంట శంకరయ్య పాల్గొంటారు.

సి.వి. కుమార్

'పుణ్యభూమి నాదేశం నమో నమామి' శతాధిక కవి సమ్మేళనం

సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా 'పుణ్యభూమి నాదేశం నమో నమామి' శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నాం. మల్లెతీగ, నవభారత నిర్మాణ సంఘం, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11న రోజంతా విజయవాడలో జరిగే ఈ కవి సమ్మేళనంలో దేశభక్తి, తెలుగుభాష, పర్యావరణం, ప్రపంచశాంతి అంశాలపై కవితలు చదవాలి. పది ఉత్తమ కవితల్ని ఎంపిక చేసి ఆ రోజు సాయంత్రం ఒక్కొక్క కవితకు రూ.1116నగదు బహుమతితో పాటు ప్రసంశాపత్రం, మంచి పుస్తకం, సత్కారం అందజేస్తాం. ఆసక్తి గల కవులు 83329 03156 నెంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలి.

కలిమిశ్రీ

'లోపలి ముసురు' ఆవిష్కరణ

అరుణ నారదభట్ల కవిత్వ సంపుటి 'లోపలి ముసురు' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 4 సాయంత్రం రవీంద్రభారతి మినీహాలులో జరుగుతుంది. ముఖ్య అతిథి- ఎన్. గోపి, అధ్యక్షత- ఏనుగు నరసింహ రెడ్డి. ఆత్మీయ అతిథులు- ఎస్. రఘు, మామిడి హరికృష్ణ, యాకూబ్, మెర్సీ మార్గరేట్.

నారాయణ శర్మ

ఉగాది కథల పోటీ

తెలుగు భాషోద్యమ సమితి, తిరుపతి నిర్వహించే ఉగాది కథల పోటీకి ఐదు పేజీల నిడివి మించని కథలకు ఆహ్వానం. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3 వేలు. వెయ్యి రూపాయలకు పది ప్రోత్సాహక బహుమతులు. కథలను ఐఎస్‌బిఎన్ నంబరుతో కథా సంకలనంగా ముద్రిస్తాం. అను 7.0 ఫాంట్, పేజ్‌మేకర్ ఫైల్ ద్వారా, హామీపత్రం జతచేసిన కథలను ఫిబ్రవరి 15 లోగా telugubhashodyamasamiti@gmail.com కు ఈమెయిల్ పంపాలి. వివరాలకు: 7981872655

ఆకుల మల్లేశ్వర రావు

కవిగారి జాడ



ఊరు భాషలో ఊరు యాసలో
ఊరు గురించి కవిత్వం రాసే
ఓ కవి
తన కవిత్వం వినిపించడానికి
మహానగరానికి వెళ్ళాడు

ఆ కవి తిరిగి ఊరికి
ఎప్పుడొస్తాడో తెలీదు

ఇక్కడ ఊర్లో
పరాయితనం
ముళ్ళకంపలా బ్రహ్మజెముడులా
మొలిచి విస్తరిస్తోంది
రంగులు హంగులు పొంగులు
పొర్లీ పొర్లీ
చెట్లూ చెరువూ చెలిమి
చెల్లా చెదురవుతున్నాయి

పాపం కవి
ఈ దారెంటే వెళ్ళాడు
ఎప్పుడు ఎట్లా తిరిగొస్తాడో

ఇంతలో
ఊర్లో నుంచి కవితొకటి
కవిగారి జాడలో నగరం
దారి వెతుక్కుంటూ వెళ్లింది

వారాల ఆనంద్

కథా సంపుటాలకు ఆహ్వానం

తపన సాహిత్య వేదిక 'సడ్లపల్లె కథాపురస్కారం' కోసం కథల సంపుటాలను ఆహ్వానిస్తున్నది. ఉత్తమ కథా సంపుటానికి రూ.10వేల బహుమతి. జనవరి 2022 నుంచి డిసెంబరు 2023 మధ్యలో ప్రచురించిన కథా సంపుటాలు నాలుగు ప్రతులను మార్చి 31 లోపు చిరునామా: సడ్లపల్లె చిదంబర రెడ్డి, 21-6-139, టీచర్స్ కాలనీ, హిందూపురం- 515 211కు పంపగలరు. ఫోన్: 94400 73636.

తపన సాహిత్య వేదిక

ఫేస్‌బుక్ గూటికి చేరిన తెలుగు సాహిత్యం

"మూడు పువ్వులు ఆరు కాయలన్నట్లుగా" మూడు సన్మాన సభలతోనూ, ఆరు ఆవిష్కరణ సభలతోనూ విరాజిల్లుతున్న సాహితీ కార్యక్రమాలు కరోనా విషశ్వాస తగిలి ఆర్చుకుపోయాయి. ఇంట్లోనో, పార్కులోనో, హోటల్‌లోనో, స్కూల్ కాలేజ్ ప్రాంగణాల్లోనో సాహిత్యాభిమానులు అంతా కలిసి సమూహంగా ఏర్పడి ఓ పుస్తకం గురించో, ఓ కవి, రచయిత గురించో, ఓ ట్రెండ్ గురించో, ఏదైనా ఒక సమకాలీన సమస్య గురించో ఆలోచనల్ని ఒకరికొకరు పంచుకొని మాట్లాడుకునే రోజులు కరోనా కాలంలో దూరమయ్యాయి. ఆ విషమ పరిస్థితుల్లో చాలా వరకు సామాజిక మాధ్యమాలే సాహిత్యానికి వేదికలయ్యాయి. లాక్డౌన్ వల్ల ఇళ్లకే పరిమితమైన సాహిత్యాభిమానులంతా ఇంటర్నెట్ వేదికగా అనేక కార్యక్రమాల్ని నిర్వహించారు. అలా అలవాటుపడ్డాక కరోనా తర్వాత కూడా చాలా సమావేశాల్ని కార్యక్రమాల్ని నేడు ఇంటర్నెట్ వేదికగానే నిర్వహిస్తున్నారు.

కరోనా ఎన్నో విలువైనవాటిని మన నుంచి తీసుకుపోతూ మరికొన్నింటిని మనకి పరిచయం చేసింది. వాటిల్లో అంతర్జాల సదస్సులు (ఇంటర్నెట్ కాన్ఫరెన్సులు) ముఖ్యంగా చెప్పుకోదగినవి. వాట్సాప్, ఈమెయిల్, ఫేస్బుక్, టెలిగ్రామ్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ (నేటి 'ఎక్స్')... ఇలా ఎన్నో సామాజిక మాధ్యమాల్లో రకరకాల సాహిత్య విషయాల చర్చలు, సమావేశాలు, కార్యశాలలు ముమ్మరంగా సాగుతున్నాయి. గూగుల్ మీట్, జూమ్, యూట్యూబ్, మైక్రోసాఫ్ట్ టీమ్స్ వంటి వేదికలలో నిరంతరాయంగా సదస్సుల, కార్యశాలల రూపంలో విజ్ఞానస్రవంతి సాగుతూనే ఉంది. ఈ మాధ్యమాల్లో వెల్లివిరిసే విజ్ఞానంలో భాగస్వాములు కావడానికి ప్రత్యేక అర్హతలేమీ అవసరం లేదు. సాహిత్యాసక్తి కలిగివుంటే చాలు. ఆయా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, సాహితీ సంస్థలు, వ్యక్తిగత కార్యక్రమాల నిర్వాహకులు ఇచ్చిన లింకు మీద ఒక్క మీట నొక్కడంతో నేరుగా ఆ కార్యక్రమంలోకి చేరి వీక్షించవచ్చు.

అప్పటివరకూ దిన, పక్ష, మాస పత్రికలలో వచ్చే సాహిత్య పుటల్ని, ఆదివారపు అనుబంధ సంచికలోని కథలను, వ్యాసాలను చదువుతూ ఉన్న పాఠకులు కరోనా మహమ్మారి వల్ల కొంతకాలం పత్రికలు స్తంభించిపోయినప్పుడు వెబ్-పత్రికలు చదవడం మొదలు పెట్టారు. కాలంతోపాటు వచ్చిన మార్పును గ్రహించి పత్రికా యాజమాన్యాలు కూడా పత్రికలను క్రమంగా ఇంటర్నెట్ ద్వారా ప్రజలకి చేరువ చేశాయి.

దిన, పక్ష, మాస పత్రికల్లో ప్రచురితమైతేనే గౌరవంగా భావించే కాలం నుంచి తన స్వీయ బ్లాగ్‌లోనో, ఫేస్‌బుక్‌లోనో, లేక వెబ్ మేగజైన్స్ లోనో రాసుకునే వెసులుబాటు రావడంవల్ల రచయితల సంఖ్య గణనీయంగా పెరిగింది. తద్వారా చర్చలు, సదస్సులు, ఆవిష్కరణలు కూడా ఎక్కువయ్యాయి. ముఖ్యంగా ఎక్కువమంది కవులకు, రచయితలకు చేరువగా ఉన్న మాధ్యమం ఫేస్‌బుక్. ఈమధ్య కాలంలో, ముఖ్యంగా తెలుగులో, మిగిలిన సాంకేతిక మాధ్యమాల కన్నా ఫేస్‌బుక్ మాధ్యమం ద్వారా చర్చలు, సమీక్షలు, విశ్లేషణలు, విమర్శలు విరివిగా జరుగుతున్నాయి.

ఇదివరకు కవులు, రచయితలు తమ భావాలను, ఆలోచనలను, సిద్ధాంతాలను, సూత్రాలను పుస్తక రూపంలో ముద్రించి తీసుకు రావడానికి సంవత్సరాలపాటు సమయం పట్టేది. సాంకేతిక మాధ్యమాల వాడకం నేడు విస్తృతం అవ్వడం వల్ల కవి, రచయిత తన ఆలోచనని వెంటనే ఫేస్‌బుక్, వాట్సప్ మొదలైన మాధ్యమాల ద్వారా పాఠకలోకంతో వెంటనే పంచుకునే సౌలభ్యాన్ని ఈ మాధ్యమాలు రచయితలకి కల్పించాయి. ఎక్కడెక్కడో తెలుగు భాష కాని ప్రాంతాల్లో ఉండే తెలుగు పాఠకులు సైతం ఫేస్‌బుక్ ద్వారా తెలుగు రచనలు ప్రచురితమైన వెంటనే చదవగలుగుతున్నారు.

గతంలో ఏదైనా పుస్తకావిష్కరణ పెట్టుకొని పుస్తక సమీక్ష చేసే సదస్సుల్లో ముప్పై నుండి యాభైమంది పాల్గొనడం చాలా కష్టంగా ఉండేది. ఫేస్‌బుక్ మాధ్యమం ద్వారా ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది. ఫేస్‌బుక్ లైవ్ కార్యక్రమంలో వంద నుండి రెండు వందల వరకు పాఠకులు చేరుతున్నారు. దానికి కారణం వ్యక్తులు భౌతికంగా ఎక్కడ ఉన్నాసరే తమ దగ్గర ఉన్న సెల్‌ఫోన్, ఐపాడ్, ల్యాప్‌టాప్, కంప్యూటర్ మొదలైన ఉపకరణాలతో కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉండటం.

> **గతంలో ఏదైనా పుస్తకావిష్కరణ పెట్టుకొని పుస్తక సమీక్ష చేసే సదస్సుల్లో ముప్పై నుండి యాభైమంది పాల్గొనడం చాలా కష్టంగా ఉండేది. ఫేస్‌బుక్ మాధ్యమం ద్వారా ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది.**



అలాగే కొందరు సాహితీవేత్తలు నిర్వాహకులు వారంవారం ఒక ప్రముఖ కవి గురించో, రచయిత గురించో, కథల గురించో, విమర్శ గురించో లేదా ఒక వాద సాహిత్యం గురించో ఆయా రంగాల్లో కృషి చేసిన నిష్ణాతులైన వక్తల చేత ఫేస్‌బుక్‌లో ఉపన్యాసాలను ఇప్పిస్తున్నారు. అలాంటి పనిని చేబూనిన నిర్వహణ కమిటీలు కొన్ని ఉదాహరణకు: బహుజన కథా ఊట (పసునూరి రవీందర్, సంగిశెట్టి శ్రీనివాస్, చందు తులసి, జి. వెంకటకృష్ణ, మల్లిపురం జగదీశ్), సంతకం కవిత్వ పరామర్శ (ఎం.ఎం. వినోదిని), తెలంగాణ స్త్రీవాద సర్కిల్ (పసునూరి రవీందర్), హర్యాలీ ముస్లిం వాద సాహిత్యం (స్కైబాబా, షాజహానా), హృదయగానం (కవి సమ్మేళనం), సాహితీ సౌరభం (మంచికంటి, శ్రీరామ్ పుప్పాల, శ్రీనివాసగౌడ్), రాయలసీమ సాహిత్య సభ (రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, బండి నారాయణస్వామి, జి. వెంకటకృష్ణ, దాదాహయాత్, చిలుకూరి దీవెన, సడ్లపల్లి చిదంబరరెడ్డి), రాయలసీమ సామాజిక - సాంస్కృతిక ఉపన్యాసాలు (అప్పిరెడ్డి హరినాథరెడ్డి), కథా మానసీయం (మానస ఎండ్లూరి) మొదలైనవి పేర్కొనవచ్చు. ఈ కార్యక్రమాల్ని వీక్షించే శ్రోతలు మూడు రకాలుగా కనిపిస్తారు. ఆసక్తితో విని కొత్త విషయాలను తెలుసుకోవాలనే శ్రోతలు మొదటి రకంవారు. అదేవిధంగా నిర్వాహకుల దృష్టిలో తాను కూడా కార్యక్రమంలో పాలుపంచుకున్నాను అని తెలియడంకోసం కార్యక్రమానికి హాజరయ్యే వ్యక్తులు రెండవ కోవకు చెందినవారు. మాట్లాడే వక్తను బట్టి కార్యక్రమానికి వచ్చే శ్రోతలు కూడా లేకపోలేదు. వీరు మూడవ విభాగానికి చెందినవారు. ఇలా ఫేస్‌బుక్ సాహిత్య విజ్ఞానం ఆయా రీతుల్లో శ్రోతలకి చేరుతుంది.

ఫేస్‌బుక్ ఉపన్యాసాలన్నీ ఒక ఎత్తు అయితే, ఫేస్ బుక్ సాహిత్య రాతలు మరో ఎత్తు. సాహిత్యంలో వస్తున్న కొత్త పోకడలను, ధోరణులను ఎప్పటికప్పుడు రచయితలు గమనిస్తూ ఫేస్‌బుక్ వేదికగా కవితలు, కథలూ, కొందరైతే నవలలూ విస్తృతంగా రాస్తున్నారు. అంతేగాక కొన్ని సమూహాలు ప్రత్యేకంగా శీర్షికలు నిర్వహించి ఆయా సాహిత్య ప్రక్రియల్లో కృషి చేసిన వారిచేత వారం వారం వాటిని నడిపిస్తున్నాయి. ఇలాంటి విశిష్టమైన పనిని కొందరు ఎవరికివారు చేస్తున్నారు, సమూహాలుగా కూడా జరుగుతున్నాయి. సమూహాల విషయానికి వస్తే ఉదాహరణకు: కవిసంగమం, కవి సమ్మేళనం, స్నేహకళాసాహితి, తెలుగు కవులు, పుస్తక సమీక్ష, సాహిత్యం, విశ్వసాహితి సమితి, తెలంగాణ పదాలు, ప్రతిలిపి, మన తెలుగు సాహిత్యం, దేశభక్తి సాహిత్యం, తెలుగు సందేహాలు, సమీక్షా సాగరం, ప్రేమ కవితలు, మన కవిత్వం, కవి సాయంత్రం, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, కవితా కథ సాధన, ఆంధ్ర సారస్వత పరిషత్, కొలిమి, సాహితీసేవ, వసంతమేఘం, కవిసంధ్య మొదలైన సమూహాలతో పాటు వేల సంఖ్యలో కథలకి, నవలలకి, విమర్శకి, సాహితీ విషయాలకు సంబంధించిన సమూహాలు ఫేస్‌బుక్‌లో ఉన్నాయి.

శ్రోతల్లో మూడు తరగతులకి చెందినవారు ఉన్నట్లుగానే పాఠకుల్లో కూడా మూడు విభాగాలు కనిపిస్తారు. ఫేస్‌బుక్ సమూహంలో వచ్చిన పోస్ట్‌ను క్షుణ్ణంగా చదివి కొత్త విషయాలను గ్రహించాలనే ఆరాటపడే పాఠకులు ఒకరకమైతే, గ్రూప్ నిర్వాహకుల దృష్టిలో పడాలని పోస్ట్ కింద లైక్, కామెంట్, షేర్ చేసేవారు ఇంకొందరు. మరికొందరు పాఠకులు శీర్షిక రాసే రచయితను బట్టి చదువుతారు.

ఫేస్‌బుక్ వల్ల పాఠకుల, శ్రోతల సంఖ్య తప్పకుండా పెరిగిందన్నది నిర్వివాదాంశం. కానీ ఆ పాఠకులు ఏ వర్గం నుంచి పెరిగారు అని పరిశీలించి చూస్తే, ఎగువ తరగతి ప్రజలే ఎక్కువగా ఇంటర్నెట్ వాడుతున్నారు. కొంతలో కొంత మధ్య తరగతివారిలో కూడా పాఠకులు, శ్రోతలు ఇంటర్నెట్ వాడకంలో ముందడుగు వేసారు. రోజువారి సంపాదనతో జీవనం సాగించే వారు కాని, పరిమితమైన సంపద కలిగిన వర్గాలవారుకాని ఇంటర్నెట్‌లో ఇంకా పాఠకులుగా మారలేదు. కారణం వీరికి ఇంటర్నెట్ అందుబాటులో లేదు. అందువల్ల బీదవారిలో ఇంటర్నెట్ పాఠకులు ఎవరూ పెరగలేదనే చెప్పుకోవచ్చు. అలాగే కవి, రచయిత ఫేస్‌బుక్ మాధ్యమంలో పోస్ట్ చేసిన రాతల్ని, లేదా చెప్పే విషయాన్ని ఓపికగా చదివి, విని చర్చ చేసే వాతావరణం కొంతమందిలో లేకపోవడం కనిపిస్తుంది. దానివల్ల భావోద్వేగాలు రగిలి చర్చ పక్కదారిపట్టే సందర్భాలు ఎక్కువే ఉంటున్నాయి.

ఏదిఏమైనప్పటికీ ఇప్పటి వరకు తెలుగు సాహిత్య విస్తరణలో ఫేస్‌బుక్ గణనీయమైన పాత్ర వహించిందని కచ్చితంగా చెప్పుకోవాల్సిందే. ఇక మీదట కూడా ఈ మాధ్యమం ద్వారా ఇంకా సాహిత్య విస్తరణ జరగాల్సి ఉంది.

సారిపల్లి నాగరాజు
80083 70326

చీకట్లో
నిశ్శబ్దంగా
నగ్నంగా
కలసి నృత్యం చేస్తున్నాయి కన్నీళ్ళు
చీకటికి మాత్రమే వాటి దేహాల స్పర్శ తెలుసు
తనలో కలిసే అనేక నీడల తడి తెలుసు

నీడలు
జ్ఞాపకాలు మోసే నావలు
దేహసముద్రం దాటి ఎగిరి వెళ్లే నల్లటి కొంగలు



ప్రతి నీడకీ ఒక గతం ఉంది
ప్రతి నీడకి ఆ గతం తాలుకు గాయాల
రక్తస్పర్శ ఉంది

నీడలు
చీకట్లో మాత్రమే కళ్ళు తెరిచి
పాటలు పాడతాయి,
యే నీడ పాట దానికే సొంతం
అచ్చం కన్నీళ్లకు సజాతీయత లేనట్లే

ప్రతి నీడకు
చీకటి లోతెంతో తెలుసు
చీకటి నివసించే రహస్య స్థావరం తెలుసు
అమ్మ కడుపులోని చీకటే భద్రంగా ఉంటుందని
రోజుల పసిగుడ్డు ఏడుపు

నీడలు
సంకెళ్ల విప్పి
రహస్యాలను ప్రకృతికి అప్పగిస్తున్నప్పుడు
వాటినీ అసలు చూడకు
నిప్పురవ్వల్లా తమని కాల్చుకుని
కాలంపాటలో బూడిదలా కలసిపోతాయి

కొంచం చెవిపెట్టిశ్రద్ధగా విను
నీడలు పునరుత్థానం చెందేప్పుడు
ప్రసవిస్తున్న తల్లి ఏడుపులా ఉంటాయి
రహస్యాలు నేసే చేతివేళ్లలా
కొత్త కథల కోసం ఎదురుచూసే
విశాల బాహువుల్లా ఉంటాయి
నీ కంటి చూపు స్థావరంలో నల్లగా తొణికిసలాడే
కాటుక దేహపు ఛాయలా ఉంటాయి.

మెర్సీ మార్గరెట్

మట్టిముత్యాల హారం 'దండకడియం'



ఒక మనిషి మరో మనిషితో మాట్లడుతున్నట్టు, మనసులోని ఆర్తిని అలవోకమైన పదాలతో వెల్లబోసుకొని బరువు దించుకున్నట్టు ఉంటుంది గోపాల్ కవిత్వం. 'సమాజం పరిణామ శీలమైనది ఒకే కోణంలో చూడరాదు, దృష్టిని బట్టి సృష్టి గోచరిస్తుంది' అంటారు. గోపాల్ దృష్టి అనుభవపూర్వమైనది, అతను జీవితానుభవాలను సాహిత్య పేటీగా మలచుకున్నాడు. తను చూసిన అనేక అంశాలను, అనుభవాలను, వాటిలోని వైరుధ్యాలను కవిత్వ వస్తువుగా తీసుకొని మట్టి పరిమళాలను అద్ది 'దండ కడియం' చేశాడు తగుళ్ళ గోపాల్.

గోపాల్ కవిత్వపు బలం పల్లీయతనంలో ఉంది. మానవ సంబంధాల మీద ఉంది. బహుజన కవిత్వపు ఊట ఈ కవిత్వంలో ఉంది. 'నాన్న గొడ్డలి' కవితలో కట్టెలు కొట్టుకునే బహుజన తండ్రి కనిపిస్తాడు, అతని గొడ్డలి కనిపిస్తుంది:

"మా ఇంట్లోని పేదరికాన్నంతా
కొంచెం కొంచెంగా నరుక్కుంటూ వచ్చింది
బాల్యంలో నాల్గు అక్షరాలను తిన్నానంటే
మా నాయనకిది నాయనలాగ
తోడు నడవడం వల్లనే"

- పేదరికంలో వృత్తిని నమ్ముకొని శ్రమైక సౌందర్యంలో జీవితాన్ని నెట్టుకొచ్చే విధానాన్ని అక్షరబద్ధం చేశాడు కవి. గోపాల్ కవిత్వాన్ని భావుకత నిలబెడుతుంది. సరళంగా చెప్పనే చివర ముగింపులో ఆ విషయాన్ని బలంగా చెప్పడం కనిపిస్తుంది.

"చీకటిని మేస్తున్న
చుక్కల మందను కాసేటందుకు
ఎల్లిపోయినవంట"

- ఇన్ని రోజులు గొర్లను కాసే తాత చివరకు చుక్కల మందను కాసేందుకు వెళ్ళిపోవడం, చుక్కలు చీకటిని మేయడం ఎంత చక్కని ఊహ! ఒకచోట ఎంతో భావుకతతో అమ్మను పచ్చనాకుల జమ్మికొమ్మతో పోలుస్తాడు. 'దండకడియం'లోని భావుకత ఎలాంటిదో ఈ కింది వాక్యాలలో స్పష్టంగా కనిపిస్తుంది.

"పొద్దు పొద్దున్నే
తామర మొగ్గలను సిగలో ముడుచుకున్న
చెరువమ్మ ముఖం చూసినంకనే
సూరీడు ఏడు గుర్రాల బండికడుతాడు."

'లేనిచోట' అనే కవితలో నాయనమ్మ చనిపోవటమే మంచిది అంటాడు. ఎందుకు మంచిదైతది? చూడండి:

"సీరియళ్ళ సోకులో పడి
పొయ్యి మీద పొంగుతున్న పాలలాగే
నిన్ను కూడా నేల పాలు చేయకముందే
సూర్యచంద్రులకు పాలియ్యడానికి
సర్ర సర్ర నడిచి పోవడమే మంచిదైంది."

సూర్యచంద్రులకు పాలియ్యడానికి! ఎంత చక్కని ఆర్ద్రతను, ఆవేశాన్ని, నాయనమ్మ పోయిన దుఃఖపు చుక్కలను ఈ అక్షరాలలో అద్దాడు! ఎంత చక్కని ఊహాత్మకంగా ఉందో, అందులోనే ఎంత ఆవేదన ఉందో, అసలు ఎంత చక్కని పదాల పొందిక కనిపిస్తుందో చూడండి. ముసలివాళ్ళు మన బ్రతుకులకు మూలవాసాలు. వారు లేకుంటే మనం లేం. కానీ ప్రపంచీకరణ నేపథ్యంలో ఎవరికివారే యమునా తీరే. ఎవరి గురించి ఎవరికీ ఆలోచించే తీరిక లేదు. అలాంటి పరిస్థితులలో నాయనమ్మను ఎవరు పట్టించుకుంటారు.

> **"ఈ ఊపిరి తాడు/ తొందరగా తెగిపోకుండా ఉండటానికి/ ఈ నడక/ ఇలా మధ్యలోనే ఆగిపోకుండా ఉండటానికి/ కొన్ని ప్రేమలు, కొంత పరిమళం కావాలి." తగుళ్ళ గోపాల్ కవిత్వ అంతరార్థం అంత ఇదే. తను కోరుకునేది ఇదే.**



ఒక కవితలో గుండె లోతుల్లో పదిల పరుచుకున్న నాన్న జ్ఞాపకాల గంపను దించుకుంటాడు. ఎదలకు అయిన మానని గాయాన్ని తలచుకొని కంటిలోని నీళ్ళతో తన గుండెలను తడుపుకుంటాడు:

"నాన్నా...
నువ్వు గుర్తొచ్చినప్పుడల్లా....
కళ్ళు మూసుకొని
నిన్ను నా కన్నుల నిండా నింపుకుంటాను
కన్నీళ్ళొస్తున్నా ఇష్టంగా తల్చుకుంటూ
వాన వెలిసిన తరువాత
తడిసిన తంగేడు మొక్కనవుతాను."

ఇలా గాయాలకు ప్రకృతి మలాము పూసుకుంటూ తనకు తానుగా మిగిలిపోతాడు.

"పది మందిల తిరిగినప్పుడు
గొల్ల పెద్దయ్య మనువడిని అని చెప్పుకోవడమంటే
నీ దండని ముద్దాడిన దండకడియాన్ని
ముద్దుపెట్టుకున్నట్టే ఉంటది"

- ఇది బహుజనుల కవిత. నాటి సంస్కృతిని అద్దం పట్టే కవిత. తాతకు వారసుడు అంటే మనవడే కదా! నేను పెద్ద గొల్ల మనువడిని అని చెప్పుకోవడం అంటే నీ దండ కడియాన్ని ముద్దుపెట్టుకోవడమే అంటాడు. తెలంగాణతనం ప్రతిబింబించే శైలి, నిర్మాణం ఉంది ఈ కవితలో.

కవిత్వం అంటే తనివితీరా అనుభవించడం. అందుకే గోపాల్ అనుభవైక జీవన కవి. లోకానుభవమే తన కవిత్వపు పట్టుగొమ్మ. చక్కని పదచిత్రాలు వేస్తాడు. అవి కళ్ళముందు కదలాడుతున్నట్లుగా ఉంటాయి.

"కమ్మలు కుదువ బెట్టి
నా నాల్కమీద అక్షరాన్ని గీసిన
మా అమ్మ ఒక సుక్కల ముగ్గు
మట్టి పూత పూసిన గోడల మీద
నిండుగ నవ్వే సున్నపు ధార"

- నాటి స్త్రీ జీవన విధానం, బండెడు చాకిరి చేస్తూ అలసిపోని ఆనాటి స్త్రీల నిత్య దైనందిన జీవనాన్ని ఈ పంక్తుల్లో ఎంతో సున్నితంగా చూపించాడు.

"ఈ ఊపిరి తాడు
తొందరగా తెగిపోకుండా ఉండటానికి
ఈ నడక
ఇలా మధ్యలోనే ఆగిపోకుండా ఉండటానికి
కొన్ని ప్రేమలు, కొంత పరిమళం కావాలి."

గోపాల్ కవిత్వ అంతరార్థం అంత ఇదే. తను కోరుకునేది ఇదే.

గోపాల్ కవిత్వంలో గ్రామీణ జీవన సంస్కృతి, మానవ సంబంధాలు, స్త్రీల ఆచార వ్యవహారాలను అక్షరబద్ధం చేశాడు. 'దండ కడియం' అంతా గోపాల్ ఆత్మకథలా కనిపిస్తుంది. కవి తన జీవితానికి ఆసరాగా నిలచిన వారిని ఎవ్వరినీ మరచిపోలేదు. "కవిత్వం అంటే అన్నం పెట్టదు నాయనా నిజమే కాని నన్ను బ్రతికిస్తుంది. అమ్మ," అంటాడు 'ఏడంత్రాల మల్లె' కవితలో. అవును, కవిత్వం గోపాల్‌ని బ్రతికిస్తుంది. ఆ బ్రతుకు నేపథ్యం అంతా 'దండ కడియం'లో కనిపిస్తుంది.

పెద్దోజు నరేష్





పదేళ్లుగా అవస్థల పాలు

హనుమకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావం తర్వాత పదేళ్లలో ప్రాథమిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలకు ఇప్పటివరకు ఎన్నికలు జరగలేదు. పీఏసీఎస్‌లు, పీఎఫ్‌సీఎస్‌లకు క్రమం తప్ప కుండా ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తున్న ప్రభుత్వం.. పీహెచ్‌సీఎస్‌లు, పీఎంపీసీఎస్‌లను మాత్రం విస్మరించింది.

ప్రాథమిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు (పీఎంపీసీఎస్‌)లు పూర్తిగా కనుమరగయ్యాయి. ప్రస్తుతం వీటి ఊసే లేదు. దశాబ్దకాలంగా పాలకులు వీటి ఉనికినే మరిచిపోయారు. ఒకప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాల ఉత్పత్తి, సరఫరా, విక్రయంలో పీఎంపీసీఎస్‌లు కీలక భూమిక పోషించాయి. వీటి ద్వారా పాడి రైతులు ఎంతో ప్రయోజనం పొందారు. ఉమ్మడి జిల్లాలో పెద్ద మొత్తంలో పాల ఉత్పత్తి జరిగేది. తద్వారా రైతులకు వ్యవసాయంతో పాటు పాడి ద్వారా కూడా ఆదాయార్జన ఉండేది. కానీ ఆ తర్వాతకాలంలో వీటిభాగస్వామ్యం తగ్గిపోయింది. పదేళ్లుగా పీఎంపీసీఎస్‌లకు ఎన్నికలు జరగలేదు. దీనితో ఉమ్మడి జిల్లాలో పీఎంపీసీఎస్‌లు లేకుండా పోయాయి. ఫలితంగా పాడి రైతుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

- కుంటుపడిన పాల ఉత్పత్తిదారుల సంఘాలు
- ప్రత్యేక రాష్ట్రంలో పదేళ్లుగా ఎన్నికలు లేవు..
- విజయ డెయిరీలో పాడిరైతులకు భాగస్వామ్యం కరువు
- అందని ప్రోత్సహకాలు, రాయితీలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో దారుణంగా తగ్గిన పాల ఉత్పత్తి
- పెరుగుతున్న ప్రైవేటు డెయిరీల హవా
- పాల సంఘాల ఏర్పాటుకు రైతుల డిమాండ్

విజయ డెయిరీ నిర్వీర్యం

గతంలో ఉమ్మడి రాష్ట్రం అంతటికీ విజయ డెయిరీ ఒక్కటే ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత డెయిరీ విడిపోయింది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్‌లో తెలంగాణ విజయ డెయిరీ బ్రాండ్‌తోనే పాల సేకరణ, సరఫరా జరుగుతోంది. విజయ డెయిరీ సహకార రంగంలో పాడి రైతుల సహకారంతో ఏర్పాటైంది. కానీ డెయిరీ నిర్వహణలో రైతుల భాగస్వామ్యం మొదట్లో ఉన్నంత తర్వాత కాలంలో లేకుండా పోయింది. దీనితో విజయ డెయిరీ అభివృద్ధి క్రమంగా కుంటుపడింది. గ్రామీణస్థాయిలో పాడి రైతులను ప్రోత్సహించి పాల సేకరణకు తగిన చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. పాడి రైతుల భాగస్వామ్యంతో భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులాంటి మాక్స్‌యాక్టులో ఏర్పాటైన సహకార డెయిరీలు అభివృద్ధి చెందుతుండగా అతిపెద్ద డెయిరీ అయిన విజయ మాత్రం కుంటినడక నడుస్తోంది. ఫలితంగా దీని పరిధిలోని పాడి రైతుల పరిస్థితి ఎదుగూ బొదుగూ లేకుండా ఉన్నది. ప్రోత్సాహకాలు లేవు. రాయితీలు లేవు. సబ్సిడీలు అంతకన్నా కానరావు.

ప్రోత్సాహకాలు కరువు

పాల ఉత్పత్తికి ప్రోత్సాహం లేకపోవడం, ఉత్పత్తయిన పాల విక్రయంలో ఇబ్బందులు, అమ్మిన పాలకు సకాలంలో డబ్బుల చెల్లింపులు జరగకపోవడం, పాడి రైతులకు ప్రభుత్వం నుంచి రాయితీలు లేకపోవడం తదితర కారణాలవల్ల ఉమ్మడి జిల్లాలో పాల ఉత్పత్తి క్రమంగా తగ్గుతోంది. ఒక్క ముల్కనూరు డెయిరీ పరిధిలో ఉత్పత్తి అవుతున్న పాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కావడం లేదు. ముల్కనూరు మాక్స్ సొసైటీ పరిధిలోని పాడి రైతులకు డబ్బులు వెంట వెంటనే చెల్లించడమే కాకుండా ఏటా వారికి రూ.లక్షపైన బోనస్ కూడా లభిస్తోంది. వీటితో పాటు ఇతరత్రా పలు రాయితీలు కూడా పాడి రైతులు పొందుతున్నారు.


పట్టింపేది?

విజయ డెయిరీ పరిధిలో కూడా పాడి రైతుల సహకార సంఘాలతో యూనియన్ ఏర్పాటు చేసి సమాఖ్య స్ఫూర్తితో అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ దృష్ట్యా ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజయ కాకతీయ పాల సహకార యూనియన్‌ను ఏర్పాటు చేసినట్లయితే ఎంతోప్రయోజనకరంగా ఉంటుందని పాడి రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం తెలంగాణలో విజయ డెయిరీ ఆధ్వర్యంలోనే ప్రాంతాల వారీగా పాల సంఘాలతో యూనియన్లు ఏర్పాటు చేసినట్లయితే సహకార పరపతి విధానంవల్ల మూడంచెల పద్ధతిలో పాడి రైతులకు విజయ డెయిరీ నిర్వహణలో భాగస్వామ్యం కల్పించినట్లయితే ప్రైవేటు డెయిరీలను కట్టడి చేసేందుకు వలవుతుందని, తద్వారా విజయ డెయిరీ పటిష్టమవుతుందంటున్నారు. అందువల్ల వరంగల్ కేంద్రంగా విజయ కాకతీయ పాల సంఘాల సహకార యూనియన్‌ను ఏర్పాటు చేయాలని పాడి రైతులు కోరుతున్నారు. ఈ యూనియన్‌ను రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో విజయ డెయిరీ అజమాయిషీతో నిర్వహించినట్లయితే మెరుగైన ఫలితాలు పొందవచ్చునని చెబుతున్నారు.

పాడి రైతులు

జనగామ మినహా ఉమ్మడి వరంగల్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం 6,600 పాడి రైతులు ఉన్నారు. వీరిలో ఒకటి, రెండు గేదెలు ఉన్నవారే ఎక్కువగా ఉన్నారు. వీరు తమ కుటుంబ అవసరాలకుపోను మిగతా పాలను విక్రయిస్తున్నారు. పాలశీతలీకరణ కేంద్రాలకు రెగ్యులర్‌గా పాలు పోసే పాడి రైతులు రెండు వేల మంది వరకు ఉన్నారు. వీరి ద్వారా రోజు సరాసరి సుమారు 15వేల లీటర్ల పాల సేకరణ జరుగుతోంది. జనగామ మినహా మిగతా జిల్లాలో పాల శీతలీకరణ కేంద్రాలు చిన్నవి ఏడు ఉన్నాయి. పెద్ద మిల్క్ షెడ్ (డెయిరీ) ఒకటి హనుమకొండలో ఉన్నది. దీని పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ప్రభుత్వం దీనిని పట్టించుకోవడం లేదు. సాధారణంగా పాల సీజన్ ఆరు నెలలే. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో పాల దిగుబడి అధికంగా ఉంటుంది. ఆ తర్వాత కాలంలో తక్కువగా ఉంటుంది.

పాడి పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలి



- ఇరుకు దేవేందర్ రావు, అధ్యక్షుడు, విజయ కాకతీయ పాడి రైతుల సంక్షేమ సంఘం

స్థానిక పాల సహకార సంఘాలకు జిల్లా స్థాయి యూనియన్లు, రాష్ట్రస్థాయి ఫెడరేషన్‌కు పాడి రైతులతో వెంటనే పాలకవర్గం ఏర్పాటు చేయాలి. రాజకీయ నాయకులను చైర్మన్లుగా నియమించడంవల్ల వారికి ఎలాంటి అవగాహన లేక రైతులు నష్టపోవాల్సి వచ్చింది. జిల్లాలో సంఘాలు, రాష్ట్రస్థాయి ఫెడరేషన్ ఏర్పాటు చేస్తే పాడి రైతులకు అన్నిరకాల సహాయ సహకారాలు అందుతాయి. పాల ఉత్పతిదారుల సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు జరపాలి. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలు వేయాలి.



పంచముఖ ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న ఎంపీ బండి సంజయ్

కేంద్ర నిధులను దారి మళ్లించిన బీఆర్ఎస్

- కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరపాలి
- పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను వెంటనే చెల్లించాలి
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్

భీమదేవరపల్లి, జనవరి 28: రాష్ట్రంలో అభివృద్ధి పథకాలకు కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తే.. వాటిని బీఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లించిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం సాయంత్రం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఉపేందర్‌శర్మ, ఆలయ చైర్మన్ కాసం రమేష్‌గుప్తా, సర్పంచ్ గద్ద రాజమణి-సమ్మయ్యయాదవ్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలోని ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రమేష్‌గుప్తా, సర్పంచ్ రాజమణి-సమ్మయ్య యాదవ్‌లు బండి సంజయ్‌కు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

ఈ సందర్భంగా ఎంపీ బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లించిన విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరపాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు వివిధ అభివృద్ధి పనులు చేశారన్నారు. వారు బిల్లులు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్పంచ్‌ల పెండింగ్‌లో ఉన్న బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. నూతనంగా గ్రామాల్లో సర్పంచ్‌లు గ్రామపంచాయతీ భవనాలను నిర్మించారన్నారు. ఈనెల 31లోపు సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుందన్నారు. ఆలోపు నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించాలని ఆయన కోరారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ బిల్డింగ్‌లను ప్రారంభించవద్దని కొంత మంది అధికారులు సర్క్యులర్ జారీ చేశారన్నారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సర్క్యులర్ జారీ చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పదికి పైగా ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.20లక్షల నిధులు కేటాయిస్తానని ఆలయ చైర్మన్ కాసం రమేష్ గుప్తాకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా నాయకుడు దొంగల కొంరయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్‌గౌడ్, గుండెల్లి సదానందం, అంబీరు కవిత, నోముల భిక్షపతి, భైరి సదానందం పాల్గొన్నారు.





నజర్ పట్నాల కోసం సిద్ధమైన భక్తులు

మల్లన్న సన్నిధిలో భక్తుల కిటకిట

ఐనవోలు, జనవరి 28 : ఐనవోలు మల్లికార్జున స్వామి వారాంతపు జాతరలో భాగంగా 2వ ఆదివారం భక్తులు వివిధ జిల్లాల నుంచి సుమారు లక్ష మంది తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిదిచేశారు. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు, కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వీకులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెకించి కోర్కెలు తీర్చమని మల్లన్నను భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముతైదు సామగ్రిని ముట్టచెప్పారు. రథం(శావ)లో ఉత్సవ విగ్రహాలను పెట్టి ఆలయం చుట్టు భక్తులు లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జిల్లా కలెక్టర్, ఎస్పీ అధికారులతో సమావేశమైన మంత్రి సీతక్క

సమయం లేదు.. పనుల్లో వేగం పెంచండి..

- మహాజాతర ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయండి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సీతక్క
- మేడారంలో అధికారులతో సమీక్ష

8



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తజన సందోహం

- జాతరకు ముందే కోలాహలం
- కిక్కిరిసిన వనదేవతల గద్దెలు
- వనదేవతలను సందర్శించుకున్న సుమారు 4 లక్షల మంది
- మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు

మేడారం, జనవరి 28: తాడ్వాయి మండలంలోని వనదేవతల సన్నిధి మేడారం కిటకిటలాడింది. సమక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తజనం భారీగా తరలివచ్చారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనుండగా ముందస్తుగానే తల్లులలకు మొక్కులు చెల్లించుకున్నారు. వారాంత సెలవు కావడంతో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. సుమా రు 4 లక్షల మంది వనదేవతలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించా రు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాల మధ్య సమ్మక్క, సారలమ్మ నామాన్ని జపిస్తూ క్యూలైన్ల ద్వారా తల్లుల గద్దెలకు చేరుకున్నారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరె సారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కోరికలు తీర్చాలని అమ్మవార్లను వేడుకున్నారు. బలి మొక్కులు సమర్పించి మేడారం పరిసరాల్లో చెట్లకింద వంటలు చేసుకొని బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు.

తల్లులను దర్శించుకున్న ప్రముఖులు

వనదేవతలను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వర్‌రావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీ సవిత, యాదాద్రి అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సీఎం పీఆర్‌వో శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్ఈ విజయభాస్కర్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ ఈఈ హేమలత దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం తల్లుల ప్రసాదాలను పూజారులు వారికి అందజేశారు. కండువాలతో సత్కరించారు.



వనదేవతలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రేవూరి

మాట్లాడుతున్న కేయూ రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

కొత్త సర్కారులో తెలంగాణ పునర్‌నిర్మాణం జరగాలి

- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి..
- కేయూ రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

కేయూ క్యాంపస్, జనవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వంతో తెలంగాణ పునర్‌నిర్మాణం కోసం పనిచేయాలని కేయూ రిటైర్డు ప్రొఫెసర్, ప్రముఖ సామాజిక విశ్లేషకుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆకాక్షించారు. ఆదివారం కేయూ దూరవిద్య కేంద్రంలోని పూలే ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ నేతృత్వంలో 'తెలంగాణ పునర్‌నిర్మాణం దశ-దిశ' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని కూల్చివేసిందన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పునర్‌నిర్మాణం చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారికీ కేసీఆర్ పోస్టులిచ్చారని, డబ్బులిచ్చిన వారికి సచివాలయంలో అవకాశం కల్పించారని ఆరోపించారు. ఇప్పటి ప్రభుత్వం నూతన విధానాలనకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తేవాలని చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలువాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని 30వేలలో 6వేల స్కూళ్లను మూసివేశారని, అలాగే వ్యవసాయ రంగాన్ని భ్రష్టుపట్టించారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారిశ్రామికరంగాన్ని విస్తరింపచేయాలని అన్నారు.

హైదరాబాద్ ఇఫ్లూ ప్రొఫెసర్ కె.రాజారామ్ మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నాశనం చేసినందుకే ఇప్పుడు తెలంగాణను పునర్‌నిర్మాణం చేసుకోవాల్సిన అవశ్యతక ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో కంపెనీలకు భూములిచ్చిన వారి పిల్లలకు ఉద్యోగాలివ్వలేదని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు. సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్‌లో జరిగిన అభివృద్ధి వరంగల్‌లో ఎందుకు జరుగలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే టీఎస్‌పీఎస్సీతో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టాలన్నారు. ట్యాంక్‌బాండ్‌పై గద్దర్, కొండా లక్ష్మణ్‌బాపూజీల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ మాట్లాడుతూ.. వర్సిటీల్లో ఖాళీపోస్టులను భర్తీ చేయాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, విద్యారంగానికి 6.5 నుంచి 15 శాతం బడ్జెట్‌లో నిధుల కేటాయించాలని డిమాండ్ చేశారు. 317, 142 జీవోలను పునఃపరిశీలన చేయాలని సదస్సులో తీర్మానం చేశారు. ఈ సదస్సులో కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ తాడూరి శాస్త్రి, పాస్ జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, జర్నలిజం ఫ్యాకల్టీ కంజర్ల నరసింహరాములు, శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ వంగాల సుధాకర్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, పద్మ, మోటే చిరంజీవి, ఈర్ల సురేందర్, డాక్టర్ జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ధాన్యం బస్తాలు

- మచ్చాపూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో బిల్డర్ మృతి
- కారును ఢీకొన్న లారీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు



నాగరాజు (ఫైల్)

గీసుగొండ, జనవరి 28: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని మచ్చాపూర్ గ్రామ శివారు అపెక్స్ కళాశాల మూలమలుపు వద్ద వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం...

నర్సంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన జినుకల నాగరాజు(55).. భార్య లలిత, కుమారుడు శ్రీకాంత్, కోడలు సింధులతో కలిసి ఈ నెల 26న హనుమకొండలోని రామారం వద్ద గల కూమార్తె ఇంటికి వెళ్లారు. కుమార్తె కొడుకు పుట్టు వెంట్రుకలు తీసేందుకు అక్కడి నుంచి అదే రోజు వేములవాడకు బయలుదేరి వెళ్లారు. రాజరాజేశ్వర స్వామికి మొక్కులు చెల్లించిన అనంతరం కొండగట్టుకు వెళ్లి ఆంజనేయస్వామిని దర్శించుకొని శనివారం సాయంత్రం హనుమకొండలోని రామారానికి వచ్చారు. కుమార్తె, అల్లుడు, మనవడిని అక్కడ వదిలిపెట్టి స్వగ్రామం నర్సంపేట మండలంలోని రామవరం గ్రామానికి అదే రోజు రాత్రి కారులో నాగరాజు కుటుంబీకులు బయలుదేరారు.

ఈ క్రమంలో గీసుగొండ మండలంలోని మచ్చాపూర్ గ్రామ శివారు అపెక్స్ కళాశాల మూలమలుపు వద్దకు రాగానే వరిధాన్యం లోడుతో ఎదురుగా వేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి కారును ఢీకొంది. దీంతో లారీపై ఉన్న ధాన్యం బస్తాలు జారి ఒక్కసారిగా కారుపై పడిపోయాయి. కారులో ఉన్న నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న శ్రీకాంత్‌కు చేయి విరిగి, తలకు తీవ్ర గాయమైంది. కారులో ఇరుక్కుపోయిన లలిత, శ్రీకాంత్, సింధులు ఏడుస్తూ బిగ్గరగా కేకలు వేయటంతో స్థానికులు, ప్రయాణికులు ఘటనా స్థలానికి చేరుకొని కారుపై నుంచి ధాన్యం బస్తాలను తొలగించి వారిని బయటికి తీశారు. అనంతరం 108 వాహనం ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కాగా, నాగరాజు నర్సంపేటలో బిల్డర్‌గా పని చేస్తుండగా, శ్రీకాంత్ నల్గొండలో ఓ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా, సింధు గురిజాలలో ఏఈవో పనిచేస్తుంది. కాగా, మృతుడి బావమరిది శ్రీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.



నుజ్జునుజ్జు అయిన కారు





ప్రజలకు నాసిరకం బియ్యం సరఫరా


కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు వి నియోగదారుల మండలి ప్రతినిధుల ఫిర్యాదు

హనుమకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో పౌరసరఫరాల శాఖ బియ్యం సరఫరాలో పాల్పడుతున్న అవతవకలపై వినియోగదారుల మండలి ప్రతినిధులు న్యూఢిల్లీలోని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి పియూష్ గోయల్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. పౌర సరఫరాల శాఖ అధికారులు మండల లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి వివిధ చౌకడిపోఅల ద్వారా వినియోగదారులకు నాసిరకం, దొడ్డు బియ్యం సరఫరా చేస్తూ బియ్యాన్ని సేకరిస్తున్న రైస్ మిల్లర్లకు మేలు రకం బియ్యం ధర చెల్లిస్తున్నారని ఆ ఫిర్యాదులు జాతీయ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సివిల్ సప్లయిస్ గోదాములకు మిల్లర్లు ఇచ్చిన బియ్యం శాంపిళ్లను ప్రదర్శించడం లేదని, గోదాములు ఇన్‌చార్జిలు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు, నాసిరకం బియ్యం బస్తాలకు ఫోర్టిఫైడ్ బియ్యం లేబుళ్లు వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమైన తెలంగాణ ఆహార భద్రతా కమిషన్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార భద్రతా చట్టం-2013 నిబంధనలు తప్పనిసరిగా అమలు జరిగేలా చూడాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌ను కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి విచారణకు ఆదేశించారని వారు తెలిపారు.


న్యూఢిల్లీలో కృషి భవనం ముందు వినియోగదారుల మండలి ప్రతినిధులు




















సమావేశంలో మాట్లాడుతున్న జన్ను సాంబయ్య

పేదల సమస్యలపై రాజీలేని పోరాటం

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య

వడ్డెపల్లి, జనవరి 28: పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేయడమే తమ పార్టీ ఎజెండా అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ (బొజ్జా తారకం) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య అన్నారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, స్వయం ఉపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో భారత రాజ్యాంగ పీఠిక ముద్రించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జన్ను సాంబయ్య, రాష్ట్ర చైర్మన్‌గా రెడ్డిమల్ల శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా బండి మొగిలి, మైదం జైపాల్, ఉపాధ్యక్షులుగా కొప్పుల రామారావు, నక్క భిక్షపతి, నాగెల్లి కోమల, రెడ్డిమల్ల పార్వతి, ప్రధాన కార్యదర్శిగా వి.స్వర్ణలత ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా జమ్ముల నాగరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బొచ్చు సాంబయ్య, బొడ్డు సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

పులిమడుగును సందర్శించిన డీఎఫ్‌వోలు



పులిమడుగును సందర్శిస్తున్న డీఎఫ్‌వోలు రవి కిరణ్, అర్పణ

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 28 : గూడూరు అటవీశాఖ పరిధిలోని కార్లాయి సెక్షన్ పరిధిలోని పులి మడుగును మహబూబాబాద్ డీఎఫ్‌వో రవికిరణ్, వరంగల్ డీఎఫ్‌వో అర్పణ ఆదివారం సందర్శించారు. పులిమడుగులో ఇటీవల నిర్వహించిన క్యాంపెన్ క్వాటర్‌ను పరిశీలించి పులిమడుగులో బోటింగ్ చేశారు. అటవీ వనరులు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు అటవీశాఖ ఇటీవల ఈ క్వార్టర్‌ను నిర్మించిన సంగతి తెలిసిందే. కాగా, ఒకేశాఖలో ఒకేక్యాడర్‌లో పని చేస్తున్న ఈ ఇరువురు డీఎఫ్‌వోలు దంపతులు కావడం విశేషం.

10 కిలోల గంజాయి స్వాధీనం

వరంగల్‌సిటీ, జనవరి 28: ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం వరంగల్ రైల్వే స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో కోణార్క్, సింగరేణి ప్యాసింజర్, సీటీటీ రైళ్లలో తనిఖీలు చేపట్టారు. రైలు ద్వారా ఎండు గంజాయిని రవాణా చేస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన సంజయ్ నాయక్‌ను పట్టుకుని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 10 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖిలావరంగల్ ఎక్సైజ్ సీఐ బి.చంద్రమోహన్ తెలిపారు. ఈతనిఖీల్లో సీఐ నీరజ, ఖిలావరంగల్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా సేవలు పొడిగింపు

- వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు..
- ఇంటి వద్దనే శిశు ఆధార్ ఉచితం
- విదేశాలకు అందుబాటు ధరలతో పార్సెల్స్

గిర్మాజిపేట(వరంగల్), జనవరి 28: ఉత్తరాలు, పార్సెల్స్, బ్యాంకింగ్, జీవిత బీమా పథకాల సేవలను ప్రజలకు అందచేస్తున్న వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలను ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసులు రోజుకు 8 గంటలు పనిచేస్తుండగా వరంగల్‌లోని హెడ్‌పోస్టాఫీసు 12 గంటలు పనిచేస్తూ ప్రజలకు మరింత విస్తృతంగా తపాలా సేవలను అందచేస్తోంది. అంతేకాదు 5 ఏళ్ల లోపు పిల్లలకు ఇంటి వద్దనే ఉచితంగా పోస్టుమన్ ద్వారా శిశు ఆధార్ నమోదు సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న హెడ్‌పోస్టాఫీసు సేవలు ఇలా వున్నాయి.

తపాలా సేవలివే..

వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో పలురకాల తపాలా సేవలు లభిస్తున్నాయి. రెవెన్యూ, పోస్టల్ స్టాంపుల విక్రయం, దేశ, విదేశాలకు ఉత్తరాలు, పార్సెల్స్ పంపిణీ, ఇండియన్ పోస్టల్ బ్యాంకింగ్, తపాలా సేవింగ్ పథకాలు, చిన్నమొత్తాల పొదుపు పథకాలు, తపాలా బీమా పథకాలు ప్రజలు పొందుతున్నారు.

ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు..

హెడ్‌పోస్టాఫీసు పనివేళలు గతంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉండేవి. ఈ సమయంలోనే ప్రజలు తపాలా సేవలు పొందేవారు. అయితే సాయంత్రం 5.30 గంటలు దాటితే హెడ్‌పోస్టాఫీసు మూసివేసేవారు. దీంతో తపాలా సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీన్ని గుర్తించిన తపాలా శాఖ రాష్ట్రంలో సికింద్రాబాద్, వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలను ప్రస్తుతం 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పొడిగించింది. ఈ మేరకు వరంగల్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ స్వామి వెంకటలక్ష్మినరసింహరావు వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పనివేళలను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు హెడ్‌పోస్టాఫీసు పనిచేస్తున్నది.

ఇంటి వద్దనే శిశు ఆధార్ నమోదు

తపాలాశాఖ ఇంటి వద్దనే పోస్టుమన్ ద్వారా ఉచితంగా శిశువుల ఆధార్ నమోదు చేస్తోంది. ఇందుకు గాను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పరిధిలోని పోస్టుమన్‌లకు ఆధార్ నమోదుపై శిక్షణ ఇచ్చారు. 0 నుంచి 5 సంవత్సరాల శిశువుల ఆధార్ నమోదు కోసం తల్లిదండ్రులు ఆధార్ సెంటర్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. తమ ప్రాంతానికి వచ్చే పోస్టుమన్‌ను తల్లిదండ్రులు కలిసి శిశువులకు కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవచ్చు. పోస్టుమన్‌లు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్ ద్వారా తల్లిదండ్రుల సమాచారం, ఆధార్‌కార్డుల సమాచారంతో 0 నుంచి 5 సంవత్సరాల శిశువుల ఆధార్ నమోదు ఉచితంగా చేస్తారు. ఇందుకు గాను ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు.



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు

పోస్టాఫీసులో ఆధార్ సేవా కేంద్రం

వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ప్రత్యేకంగా ఆధార్ సేవా కేంద్రం పనిచేస్తోంది. ఇందులో కొత్తగా ఆధార్ నమోదు మాత్రం ఉచితంగా చేస్తారు. అయితే ప్రస్తుత ఆధార్ కార్డులో పేర్లు, ఇంటిపేర్లు, చిరునామా, పుట్టిన తేదీ, ఫొటో, వేలిముద్రలు తదితర సవరింపులను మాత్రమే ఆధార్ సంస్థ నిర్ణయించిన ఫీజుతో చేస్తారు. ప్రస్తుత ఆధార్‌లో ఇంటి పేరు, పేరు, పుట్టిన తేదీ, చిరునామా తదితర మార్పుల కోసం తప్పనిసరిగా సంబంధిత సర్టిఫికెట్ వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. పుట్టిన తేది సవరణకు విద్యాసంస్థ, మునిసిపల్ బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్టుతో చేసుకోవచ్చు. ఈ ఆధార్ సెంటర్ కూడా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేయనుంది. ఆధార్ డౌన్‌లోడ్, ప్రింట్‌కు రూ.30 చెల్లించాలి.

అందుబాటు చార్జీలతో పార్సెల్స్

విదేశాలలో ఉంటున్న తమ కుటుంబ సభ్యులకు అవసరమైన వస్తువులు, మందులు, పిండివంటలు తదితర పార్సెల్స్‌ను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లోని ప్రత్యేక పార్సెల్ కేంద్రం ద్వారా పంపవచ్చు. ప్రయివేట్ కొరియర్ సర్వీసుల కంటే తక్కువ చార్జీలు ఉన్నాయని తపాలా అధికారులు చెబుతున్నారు. నామమాత్రపు చార్జీతో అధునాతన ప్యాకింగ్



యంత్రంతో పార్సెల్స్‌ను ప్యాకింగ్ చేస్తున్నారు. ప్యాకింగ్ సైజ్ మేరకు చార్జి ఉంటుంది. ప్రతి అర కిలో(500 గ్రాములు)కు అమెరికాకు రూ.1,550, కెనడాకు రూ.1,180, ఆస్ట్రేలియాకు రూ.975, యూకేకు రూ.1,570 చార్జి ఉంటుంది. ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలకు తపాలా శాఖ విదేశీ పార్సెల్స్ సదుపాయం ఉందని అధికారులు చెబుతున్నారు.

తపాలా బీమా పథకాలు

సామాన్య, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో వివిధ జీవిత, ప్రమాద బీమా పథకాలను తపాలా శాఖ అమలు చేస్తోంది. టాటా, ఏఐజీ సహకారంతో రూ.10 లక్షలు, రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా పాలసీని అమలు చేస్తోంది. 18 నుంచి 65 సంవత్సరాల లోపు కలిగిన వారు సంవత్సరానికి రూ.520 చెల్లిస్తే రూ.10 లక్షల యాక్సిడెంటల్ బీమా, రూ.320 చెల్లిస్తే రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా వర్తిస్తుందని తపాలా అధికారులు తెలిపారు. అలాగే నీవా బుపా హెల్త్ ఇన్సురెన్స్ సంస్థతో కలిసి తపాలా శాఖ సంవత్సరానికి రూ.755 ప్రీమియంతో రూ.15లక్షల హెల్త్ ఇన్సురెన్స్ పాలసీని అమలు చేస్తోంది. ఇవే కాకుండా సేవింగ్ అకౌంట్‌లు, డిపాజిట్ పథకాలతో పిల్లలకు సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్‌లు, మహిళల కోసం ప్రత్యేక డిపాజిట్, సేవింగ్, నెలవారి ఆదాయం స్కీంలను తపాలా శాఖ అమలు చేస్తున్నది.

తపాలా సేవలు వినియోగించుకోండి

ఎస్‌వీఎల్‌ఎన్ రావు, పోస్టల్ సూపరింటెండెంట్



ప్రజలకు మరింత మెరుగైన తపాలా సేవలను అందించేందుకు గాను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలను 12 గంటలకు పెంచాం. ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలు హెడ్‌పోస్టాఫీసులో తపాలా సేవలు పొందవచ్చు. తమ ప్రాంత పోస్టుమన్‌ల ద్వారా ఉచితంగా ఇంటి వద్దనే శిశు ఆధార్ నమోదును తల్లిదండ్రులు వినియోగించుకోవాలి. అలాగే తపాలా బ్యాంకింగ్, జీవిత, ప్రమాద బీమా పథకాలు, అందుబాటు చార్జీలతో విదేశాలకు పార్సెల్స్ సదుపాయం కూడా ఉంది.



వేడుకలను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ విద్యాధర సుబుద్ధి

ఏకశిల జూనియర్ కళాశాలల సెలబ్రేషన్స్

ముఖ్య అతిథులుగా నిట్ డైరెక్టర్ విద్యాధర సుబుద్ధి, ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లావుడియా

హనుమకొండ రూరల్, జనవరి 28: ఏకశిల జూనియర్ కళాశాలల స్పార్క్‌రిల్ సెలబ్రేషన్స్ హసన్‌పర్తి పెంబర్తిలోని ఏకశిల టెక్నో స్కూల్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర సుబుద్ధి, ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లావుడియా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలం విలువ గుర్తించిన వారే విజయ సోపానాలు పొందుతారని అన్నారు. ఎవరి సమయం వారికి మంచి అవకాశాలు ఇస్తుందని, దానిని సద్వినియోగం చేసుకున్నవారే విజేతలుగా నిలుస్తారని తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఐఐటీ, నీట్ పోటీ పరీక్షలలో ఎంపికైన ఏకశిల విద్యార్థులకు రూ.10వేల నగదు పారితోషికం ప్రకటించారు. ఇంటర్ మొదటి సంవత్సరం టాపర్స్‌కి రెండో సంవత్సరంలో ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ గౌరు రాజిరెడ్డి, బేతి కొండల్ రెడ్డి, గౌరు సువిజ తిరుపతిరెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇ.తిరుపతిరెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణలో పది సీట్లు గెలుస్తాం..

- బీఆర్ఎస్ మూడోస్థానానికే పరిమితం
- కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్



అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న ఎంపీ సంజయ్

కమలాపూర్, జనవరి 28: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ తెలంగాణలో పదిసీట్లు గెలుస్తామని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామంలోని రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను ఆదివారం సాయంత్రం రైల్వే అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నిర్ణీత గడువులోగా బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. కొవిడ్-19, ఆర్వోబీ డిజైన్ మార్పు వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందన్నారు. బ్రిడ్జి నిర్మాణంపై ఇదివరకు అధికారులతో రెండు, మూడు సార్లు సమీక్ష సమావేశం నిర్వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వ పనులు ఆగవని, గత ప్రభుత్వం సహకరించకపోవడంతోనే నిర్మాణం అలస్యమైందన్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామని, రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని అన్నారు. తన తండ్రి పేరు చెప్పుకొని కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చాడని, తాను పోరాటం చేసి పైకి వచ్చానని అన్నారు. తాను హిందు ధర్మం కోసం మాట్లాడితే తనను మతం పెట్టుకొమ్మని కేటీఆర్ అంటున్నాడని ఆయన ఆరోపించారు. పదే, పదే ముస్లింల గురించి మాట్లాడుతున్న కేటీఆర్ మసీదు కట్టుకొని నమాజ్ చేయాలని, ప్రజలకు అందుబాటులో లేకుండా ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్‌కు సీఎం పదవి అవసరం లేదని బార్ కట్టుకోవాలని ఆయన విమర్శించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి పనులు చేయలేదని విమర్శించారు. కేటీఆర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌లు ఇద్దరు నాస్తికులు అని, నియోజకవర్గంలో మెజారిటీ ప్రజలు దేవుళ్లను పూజిస్తారని, దేవుడిని పూజించే ప్రజలు దేవుడిని నమ్మనివారికి ఓట్లు వేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ప్రధానిగా నరేంద్ర మోదీ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ పది స్థానాలను గెలుస్తుందని, బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికే పరిమితమవుతుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంద్ర నళిని, కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బొమ్మ శ్రీరాం చక్రవర్తి, పుప్పాల రఘు, గౌతంరెడ్డి, మాట్ల రమేష్, కట్కూరి అశోక్‌రెడ్డి, తుమ్మ శోభన్‌బాబు, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్, బండారి సుధాకర్, తోట సురేష్, చిట్టి సుందరయ్య, ర్యాకం శ్రీనివాస్, అంజయ్య, భూపతి ప్రవీన్, కార్యకర్తలు తదితతరులు పాల్గొన్నారు.

వైభవంగా గొంతెమ్మగుట్ట మహాజాతర



గొంతెమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కాటారం, జనవరి 28: మండలంలోని ప్రతాపగిరి శివారు అటవీప్రాంతంలోని గొంతెమ్మ గుట్టపై మూడు రోజుల పాటు నిర్వహించిన లక్ష్మీదేవర మహాజాతర ఆదివారంతో ముగిసింది. చివరి రోజు అంగరంగ వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకపోడ్ కులస్థులు, జాతర నిర్వాహకులు 15కి పైగా లక్ష్మీదేవరలతో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య గొంతెమ్మ, లక్ష్మీదేవర పెద్ద పట్నాలు వేసి బోనాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీదేవరల విన్యాసాలతో పట్నాలు తొక్కించే కార్యక్రమం చేపట్టారు. భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే దంపతులు, పలువురు పోలీసు అధికారులు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు రవీందర్‌రావు, మహేశ్వరి, విజయారెడ్డి, బోడ మమత, సర్పంచులు లక్ష్మి, దేవేందర్, రఘురాం, అశోక్, నరేష్, శేఖర్, రమేష్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ నేతలు జాతరలో పాల్గొని దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి కరీంగనర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని పలు ప్రాంతాలతోపాటు మహారాష్ట్రకు చెందిన భక్తులు అటవీమార్గం మీదుగా ప్రైవేటు వాహనాల్లో జాతరకు తరలివచ్చారు. గుట్టపై సొరంగంలోని గొంతెమ్మ, కృష్ణుడి పాదాలు, శివలింగానికి భక్తులు మొక్కుకున్నారు. ఇరుకైన దారి గుండా భక్తులు త్వరగా వెళ్లడానికి దూసుకురాగా పోలీసులు, నిర్వాహకులు ఒక్కోసారి కొద్దిమందిని వదులుతూ దర్శనం కల్పించారు. సీఐ రంజిత్‌రావు నేతృత్వంలో ఎస్సైలు అభినవ్, సుధాకర్, నరేష్, లక్ష్మణ్‌రావు సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీస్ బలగాలతో బందోబస్తు చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మౌనిక, గీత, సుప్రియ వైద్యసిబ్బందితో కలిసి వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గుట్టకు వెళ్లే దారి అటవీ ప్రాంతంలో ఇరుకుగా, కచ్చా రోడ్డు ఉండటంతో వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దారి గుండా ఒకే వాహనం వెళ్లే వీలుండటంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కున్నారు. పలువురు దాతల సహకారంతో జాతర కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రస్తుత జాతరకు ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించిన తాత్కాలిక ఏర్పాట్లే జరిగాయని, రాబోయే జాతరకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి శాశ్వతంగా అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. పలు పార్టీల నాయకులు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, గద్దె సమ్మిరెడ్డి, ఆంగోత్ సుగుణ, సుజాత, వంశవర్ధన్‌రావు, తిరుపతిరావు, సురేందర్‌రెడ్డి, మధుకర్, కుమార్, కొమురయ్య, రావిళ్ల కిరణ్, రత్న సౌజన్య, జోడు శ్రీనివాస్, దబ్బెట రాజేశం, శేఖర్, రాజేంద్రాచారి తదితరులు జాతరలో పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, నాయకపోడు కళాబృందాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు మేకల సంతోష్, గుంటి రాజేందర్, పోచం, పెద్ద కిష్టయ్య, చిన్నకిష్టయ్య, పోలం సంతోష్, సురేందర్, గుంటి రమేష్, గుంటి అశోక్, మధునయ్య మల్లేష్, ప్రతాప్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నకు హారతి ఇస్తున్న వీరశైవార్చకులు

కొమురవెల్లి మల్లన్నకు లష్కర్ బోనాలు

భక్తులతో పోటెత్తిన మల్లన్న ఆలయం

చేర్యాల, జనవరి 28: కొమరవెల్లి మల్లిఖార్జునస్వామి దేవాలయం లష్కర్ భక్తులతో పోటెత్తింది. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సంక్రాంతి తరువాత వచ్చిన రెండవవారమైన ఆదివారం రోజున సికిందరాబా దుకు చెందిన వేలాదిమంది భక్తులు స్వామి వారి దర్శనార్థం తరలివ చ్చారు. ఇలవేల్పు దైవాన్ని దర్శించు కుని పులకించిపోయారు. ఆలయ ప్రాంగణంలో విక్రయించే కూరగాయలను కొనుగోలు చేసి నూతన మట్టి కుండల్లో బోనం చేసి మల్లన్నకు నివేదించి పట్నాలు వేశారు. తమ కోరికలు నెరవేర్చమని ఆలయప్రాంగ ణంలోని గంగరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. ఓడుబియ్యాలు పోసి తమను సల్లంగా కాపాడమని వేడు కున్నారు. తమకు సంతానం కలగాలని వేడుకుంటూ ఒళ్లుబండ వద్ద వరంపట్టారు.

ఎల్లమ్మతల్లికి ఘనంగా బోనాలు

మల్లన్న సహోదరి ఎల్లమ్మదేవతకు బోనంచేసి డప్పుచప్పుళ్ల హోరుతో, పూనకంతో శివమెత్తారు. దేవతలనా మస్మరణతో గుట్టపైకి ఎక్కి బోనాన్ని సమర్పించారు. భక్తులరద్దీ అధికంగా ఉండడంతో ప్రత్యేక, దర్మదర్శన క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. దీంతో గంటల తరబడిగా పడిగాపులు కాయడంతో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పట్నాలు వేసిన భక్తులతో గంగిరేగుచెట్టు ప్రాంగణం కిటకిటలాడింది. మొక్కుబడిగా భక్తులు కట్టిన ము డుపులతో గంగరేగుచెట్టు నిండిపోయింది. ఈవో బాలాజీశర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



బోనాలు తీసుకువస్తున్న లష్కర్ భక్తులు

గ్యాస్ సిలిండర్‌లో నీరు



గ్యాస్ సిలిండర్‌ను పరిశీలిస్తున్న వినియోగదారుడు

వర్ధన్నపేట, జనవరి 28 : వంట గ్యాస్ వినియోగదారునికి వింత అనుభవం ఎదురైంది. సిలిండర్‌లో వంట గ్యాస్ ఇంధనానికి బదులు నీరు ఉండటంతో అవాక్కు అయ్యారు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన ఆకుల సత్యం అనే వినియోగదారుడు ఎప్పటిలాగే గ్యాస్ బుక్ చేశాడు. సంగెం మండలంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్ రాగానే స్టౌవ్‌కు పెట్టి వెలిగించాడు. ఎంత చూసిన మంట రాకపోవడంతో అనుమానం వచ్చి సిలిండర్‌ను పరిశీలించాడు. దీంతో గ్యాస్ సిలిండర్‌లో గ్యాస్ కాకుండా నీరు ఉండటాన్ని గమనించి నిర్ఘాంతపోయాడు. వెంటనే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై మండిపడుతూ వారిపై చర్యలు తీసుకొని వినియోగదారులకు నాణ్యమైన సిలిండర్ అందించాలని డిమాండ్ చేశారు

వీధి కుక్కలకు చర్మవ్యాధులు

గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగున్న వైనం ● మహబూబాబాద్ జిల్లాప్రజలకు పొంచి ఉన్న ముప్పు



మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 28 : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వీధికుక్కలు చర్మ వ్యాధుల బారిన పడి భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. ఏ గల్లీకి వెళ్లినా వ్యాధి బారిన పడిన కుక్కలే దర్శనమిస్తున్నాయి. కుక్కలకు సోకిన వ్యాధితో మానవాళి మనుగడకు సైతం భారీ ప్రమాదం వాటిల్లే అవకాశాలున్నాయి. విచ్చలవిడిగా వ్యాధుల బారిన కుక్కలచే రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. యుద్ధ ప్రతిపాదికన నివారణ చర్యలు తీసుకోవాల్సిన అధికార యం త్రాంగం నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తోంది. గ్రామ పంచాయతీల్లో అరకొరగా నిధులు ఉండటంతో సర్పంచ్‌లు సైతం చేతులెత్తేస్తున్నారు. కరోనా మహమ్మారి బారినుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలకు కుక్కల ద్వారా మరో ప్రమాదం ముంచుకొస్తుందనే ఆందోళనతో కొట్టుమిట్టాడుతున్నారు.

మరిపెడ, చిన్నగూడూరు, నర్సింహులపేట, దంతాలపల్లి, కురవి తదిరత మండలాల పరిధిలోని ఏ గ్రామంలోకి వెళ్లిన చర్మ వ్యాధుల బారిన పడిన వీధి కుక్కలు దర్శనమిస్తున్నాయని జనం వాపోతున్నారు. కుక్కలకు చర్మ వ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాల్సిన జిల్లాలోని మున్సిపాలిటీలు,



గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో వీధికుక్కల నిర్మూలనను గాలికొదిలేస్తున్నారు. కుక్కల చర్మ వ్యాధుల ద్వారా ప్రజలకు ప్రమాదం జరుగక ముందే రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో పలువురు బాధితులు

మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 461 గ్రామపంచాయతీలు ఉండగా, రెండు నెలలుగా కుక్క కాటుకు గురైన వారు అనేక మంది ఉన్నారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలోనే 12 మందిని ఒకేరోజు ఊర కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం మార్చి మాసం నుంచి డిసెంబరు వరకు 21 పీహెచ్‌సీల పరిధిలో సుమారు 4,000మందికి పైగా కుక్క కాటుతో గాయపడ్డారు. మరిపెడ మండలానికి చెందిన ఓ వ్యక్తి కుక్క కాటుకు గురియ్యై ఇటీవలనే హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

జాగ్రత్త వహించడమే ఏకైక మార్గం

రమేశ్, వెటర్నరీ డాక్టర్, ఎడ్జర్ల



చర్మ వ్యాధుల బారిన పడ్డ కుక్కల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహించడం ఒక్కటే మార్గం. వీధి కుక్కలకు సోకిన చర్మ వ్యాధుల నివారణకు ప్రభుత్వం నుంచి మందుల సరఫరా లేదు. కుక్కల సొల్లుద్వారా రేబీస్ వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. గ్రామ పంచాయతీ సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు పాటించాలి. వీటితో పాటు కుక్కలకు సోకిన చర్మవ్యాధి నివారణకు ఐవర్‌మెక్టిన్ అనే లిక్విడ్, మాత్రలను ఏదైన మాంసంలో కలిపి కుక్కలకు వారం రోజుల పాటు క్రమం తప్పకుండా అందజేసినట్లైయితే వ్యాధి ప్రబలకుండా కొంత వరకు అదుపు చేయవచ్చు.

కులగణన నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నాం..


మాట్లాడుతున్న బీసీ సంఘాల నేతలు

కాళోజీ జంక్షన్, జనవరి 28: తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంఘాల నాయకులు సోమిడి అంజన్‌రావు, డాక్టర్ శేషు తెలిపారు. ఆదివారం హరిత హోటల్‌లో బీసీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలు దశాబ్దాలుగా కులగణన చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిరాజు యాదవ్, అధ్యక్షులు పిట్టల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

చర్చిలో ఎమ్మెల్యే నాయిని ప్రార్థనలు

హనుమకొండ రూరల్, జనవరి 28: గ్రేటర్ 49వ డివిజన్ ప్రకాశ్‌రెడ్డిపేటలోని చర్చిలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శాసన సభ్యుడిగా గెలిచి అనంతరం మొదటిసారిగా చర్చికి రావడంతో చర్చి కమిటీ సభ్యుల ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే సంవతత్సరంలో చర్చి సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఉన్నందున అభివృద్ధి కోసం నిధులు సమకూర్చేందుకు తనవంత సహకారం అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, చర్చి పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న బాశెట్టి హరిప్రసాద్

వడ్డెపల్లి, జనవరి 28: మున్నూరుకాపు కులస్థులు స్వయంకృషితో ఎదిగి అన్ని రంగాల్లో రాణించాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర నేత, జఫర్‌గఢ్ డిప్యూటీ తహసీల్దార్ బాశెట్టి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం హనుమకొండ వికాస్‌నగర్‌లో నిర్వహించిన మున్నూరుకాపు సంక్షేమ సంఘం రెండవ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పి.హరికిషన్ ఆధ్వర్యంలో వికాస్‌నగర్ మున్నూరుకాపు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాశెట్టి మల్లయ్య పటేల్, ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల హరికిషన్ పటేల్, ఉపాధ్యక్షుడిగా తోట భిక్షపతి పటేల్, కోశాధికారిగా అల్లం మల్లికార్జున్‌రావు పటేల్, సహాయ కార్యదర్శిగా కల్వాల దుర్గయ్యపటేల్, ఆడిటర్‌గా గోలి రాంచందర్ పటేల్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి


పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న శంకర్‌రావు

హనుమకొండ రూరల్, జనవరి 28: ఓపెన్ స్కూల్‌ను డ్రాపౌట్స్ సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ మూరాల శంకర్‌రావు అన్నారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ అధ్యయన తరగతులను ఆయన పరిశీలించారు. అనంతరం ఓపెన్‌స్కూల్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించి మాట్లాడారు. టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందిన అభ్యర్థులు తప్పకుండా కాంటాక్టు తరగతులకు హాజరై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామారావు, జగన్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి, భిక్షపతి, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు.



సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్‌లోని ప్రముఖ సంస్థలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ (స్త్రీ/పు॥) కావలెను. జీతం : 13,000 - 16,000/-. సంప్ర॥ 9000463426
AJW-177916

WANTED
★ జేబీస్ లైఫ్ హాస్పిటల్‌లో పని చేయుటకు సూపర్ వైజర్స్, ఫార్మసిస్ట్ మరియు సిస్టర్స్ (లేడీస్) మాత్రమే కావలెను. బస్టాండ్ దగ్గర రోడ్ నెం.-1, కాకాజీ కాలనీ, HNK. Cell : 9989510003
AJW-177928

కావలెను
★ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కం.లి॥ హనుమకొండ నందు పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన సేల్ పర్సన్ అసిస్టెంట్ కావలెను. సాలరీ 10,000/-. సంప్ర॥ లక్ష్మిరెడ్డి యేందర్ రెడ్డి, సీనియర్ సేల్స్ మేనేజర్, సెల్ : 9849058917
AJW-13090

కావలెను
★ హనుమకొండలోని ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు డ్యూటీ డాక్టర్స్ MBBS, BAMS, Pharm.D. కావలెను. సంప్ర॥ 9246890146
AJW-177931

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
8341725534
వరంగల్
9985406505
9985406150
జనగామ
9866431354
మహబూబాబాద్
9849814336
భూపాలపల్లి
9985401232
తొర్రూర్
9985408003
పరకాల
9985411677
నర్సంపేట
9985418040

FLATS FOR SALE
★ 2 & 3 BHK Luxury Flats for Sale, Vikas Nagar Road No. 11. Loan Facility Available. Cont : 7382332244, 7799320832
AJW-177915

అతి తక్కువ ధరలో ప్లాట్లు...
★ 121 చ॥ గజాల ప్లాటు రూ॥ 2,40,000/- యాదగిరి గుట్ట దగ్గర @ ఆలేరు (EMI కలదు), స్పాట్ రిజిస్ట్రేషన్, 100% వాస్తు, ఫెన్సింగ్, గేటు, సెక్యూరిటీ. సంప్ర॥ 9030769178
AJW-177920

TO-LET FOR COMMERCIAL
★ WGL ఓల్డ్ రోడ్, కాజీపేటలో 500 Sft. Ground Floor 2 షట్టర్స్ & 1st ఫ్లోర్‌లో 2000 Sft. గదిని బ్యాంకులకు, షోరూమ్‌లకు ATM సెంటర్స్‌కు అనువైన కమర్షియల్ స్పేస్ కిరాయికి కలదు. సంప్ర॥ 9849676058
AJW-177871

TO-LET
★ 2600 Sft. గల 5 షట్టర్స్ కలిగిన బిల్డింగ్, 100 ఫీట్ల రోడ్ శ్యామల Non A/c. గార్డెన్ ఎదురుగా గల కమర్షియల్ కాంప్లెక్స్ బ్యాంకులకు, ఆఫీసులకు & షోరూంలకు కిరాయికి ఇవ్వబడును. # 100 Ft. Road, KUC to Kazipet. Cell : 9490451645, 9642638209
AJW-177873

TO-LET
★ హన్మకొండ కొత్త బస్ స్టేషన్ ఎదురుగా గల బిల్డింగ్ 1వ ఫ్లోర్‌లో 1000 Sft. కమర్షియల్ స్పేస్ అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 9949828290
AJW-7085

TO-LET
★ HNK, Subedari, కనకదుర్గకాలనీ H.No. 2-7-1023/1, 3BHK, 1st Floor with lift సౌకర్యం ఉన్న ఇల్లు కిరాయికి ఇవ్వబడును. సంప్ర॥ 9885457002, 9010992616
AJW-5828

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సమయం లేదు.. పనుల్లో వేగం పెంచండి..

- మహాజాతర ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయండి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సీతక్క
- మేడారంలో అధికారులతో సమీక్ష

మేడారం, జనవరి 28: మహాజాతర సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో మేడారంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. జాతరకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ.. భక్తుల రాక పెరుగుతోందని, వారికి మౌలిక సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మంత్రి సీతక్క ఆదివారం రాత్రి 9 గంటల తర్వాత పర్యటించారు. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఆయా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ప్రధానంగా అంతర్గత, లింకు రోడ్ల పనులు కొనసాగుతుండటంవల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని, భక్తులు కూడా అసౌకర్యానికి గురవుతున్నారని సీతక్క అన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా వారంలోగా రోడ్ల పనులన్నింటినీ పూర్తిచేయాలని ఆర్‌అండ్‌బీ, పీఆర్ అధికారులకు సూచించారు. జంపన్నవాగులో భక్తుల పుణ్యస్నానాల కోసం సౌకర్యాలను విస్తరించాలని, సాధ్యమైనన్ని ఎక్కువ బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ అందుబాటులోకి తేవాలని అన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం విషయంలో అలసత్వం వహించొద్దని, వీలైనన్ని ఎక్కువ ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ సమీక్షలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్, పీఆర్ ఈఈ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల విడిది షెడ్లను ప్రారంభించిన మంత్రి

గోవిందరావుపేట/తాడ్వాయి : మేడారం భక్తుల కోసం గోవిందరావుపేట మండలం చల్వాయి, తాడ్వాయి మండల కేంద్రాలలో రూ.కోటి 50లక్షల చొప్పున వ్యయంతో నిర్మించిన విడిది షెడ్లను రాష్ట్ర మంత్రి సీతక్క ఆదివారం ప్రారంభించారు. గోవిందరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవం కోసం వచ్చిన గర్భిణుల కోసం నిర్మించిన గదిని ప్రారంభించారు. అదే విధంగా దుంపెల్లిగూడెంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమాలలో ఐటీడీఏ పీవో అంకిత్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రెంగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మల్లయ్య



ఐనవోలు, జనవరి 28 : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్(ట్రెంగా) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఐనవోలు ఏఆర్‌ఐ ఎం. మల్లయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా మల్లయ్య ఎన్నికపై పలువురు రెవెన్యూ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి


ఏసీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

దామెర, జనవరి 28 : సమాజంలో రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని పరకాల ఏసీపీ ఐకిషోర్‌కుమార్ తెలిపారు. ఆదివారం పరకాల పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో దామెర మండల పరిధిలోని రౌడీ షీటర్లకు ఏసీపీ కిషోర్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేర ప్రవృత్తిని విడిచి పెట్టి సామాన్య పౌరులుగా జీవించాలని హితవు పలికారు. అంతే కాకుండా నేరాలతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే రౌడీ షీటర్ల ప్రస్తుత జీవన స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పరకాల రూరల్ సీఐ డి.మల్లేష్, దామెర ఎస్సై కొంక అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

'తాళ్ల పద్మావతి'లో కొనసాగుతున్న స్పోర్ట్స్ మీట్

కాజీపేట, జనవరి 28: కాజీపేట సోమిడి తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో హనుమకొండ డిస్ట్రిక్ట్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ (హడుప్సా) ఆధ్వర్యంలో స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ఆదివారం రెండో రోజు కొనసాగింది. ఈ పోటీలను కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.సుజాత హాజరై ప్రారంభించి, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి హడుప్సా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ప్రతీ క్రీడాకారుడు గెలుపుకోసం ప్రయత్నం చేయాలన్నారు.

కార్యక్రమంలో హడుప్సా అధ్యక్షులు వర్ధమాన్ జనార్ధన్, చీఫ్ అడ్వైజర్ షణ్ముకాచారి, తాళ్లపద్మావతి విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, బన్సాల్ క్లాసెస్ చైర్మన్ వీవీ రమణారెడ్డి, హడుప్సా అడ్వైజర్ తక్కళ్లపల్లి బుచ్చిబాబు, వేణుమాధవరావు, కోశాధికారి శంకర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ రెడ్డి, సతీష్, నితిన్, అమరేందర్ రెడ్డి, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజేతలను అభినందిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత

రాజేంద్ర రాజు సేవలు అభినందనీయం

హనుమకొండ రూరల్, జనవరి 28: తెలుగు టెలివిజన్ రచయితల సంఘం సొంత కార్యాలయం ప్రారంభోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందని, ఈ ఘనత హనుమకొండకు చెందిన కాంచనపల్లి రాజేంద్ర రాజుకే దక్కుతుందని తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఫౌండర్, ప్రెసిడెంట్ నాగబాల సురేశ్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లో రచయితలకు సొంత కార్యాలయం ఉండాలన్న ఆలోచనతో రాజేంద్ర రాజు సొంతంగా లక్ష రూపాయల విరాళం ఇవ్వడమే కాకుండా మిత్రుల ద్వారా విరాళాలు సేకరించడం అభినందనీయమన్నారు. శ్రీనిధి సహస్రధార చైర్మన్‌గా, టెలివిజన్ రచయితల సంఘం ఫౌండర్, జనరల్ సెక్రటరీగా ఆయన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని శాలువాతో సత్కరించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



రాజేంద్ర రాజును సన్మానిస్తున్న దృశ్యం

బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడికి సాయం అందజేస్తున్న రాజు

ఐనవోలు, జనవరి 28: ఐనవోలుకు చెందిన దినసరి కూలి కత్తుల వెంకటయ్య అనారోగ్యానికి గురయ్యాడు. వైద్యం కోసం దాతలు రూ.4వేల ఆర్థిక సహాయం అందించారు. 2 సంవత్సరాల కిందట కాలు ఇన్‌ఫెక్షన్ కావడతో ఆర్థిక పరమైన ఇబ్బందులతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ సందర్భంగా గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి నల్లబెట్ట చిన్నరాజు స్థానికులైన టాన్స్‌కో ఏఈ పుల్యాల రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ బొల్లేపల్లి మధు నుంచి రూ.4 వేల విరాళంను సేకరించి బాధితుడికి అందజేశారు. ప్రభుత్వం బాధితుడికి వైద్య సేవలు అందించి కుటుంబానికి అండగా నిలవాలని ఆయన కోరారు.

ఫైనాన్స్ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

ఐనవోలు, జనవరి 28: ప్రైవేటు ఫైనాన్స్ నిర్వాహకుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్‌పాషా(49).. తాను నిర్మించుకున్న ఇంటిపై 8 మాసాల కిందట ప్రైవేటు ఫైనాన్స్‌లో రూ.10లక్షల రుణం తీసుకున్నాడు. 4 మాసాలు సక్రమంగా కిస్తులు చెల్లించాడు. భార్య జరీనా అనారోగ్యానికి గురికావడంతో కిస్తులు చెల్లించలేకపోయాడు. భార్యను హైదరాబాద్ తీసుకెళ్లి వైద్యం చేయిస్తు అక్కడే ఉంటూ ప్రైవేటు పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయిఏ ఫైనాన్స్ నిర్వాహకులు కిస్తీలు చెల్లించాలని ఒత్తిడి తేవడంతోపాటు 10 రోజుల కిందట ఇంటికి తాళం వేసి తలుపులకు నోటీసులు అంటించారు. ఈ ఇల్లు హోం ఫైనాన్స్‌లో తాకట్టులో ఉంది.. దీనిపైన


గౌస్‌పాషా(ఫైల్)


ఇంటి గోడపై రాసిన రాతలు, అంటించిన నోటీసులు

ఎటువంటి లావాదేవీలు జరపరాదు.. ఈ ఇల్లు అమ్మబడును.. కావల్సిన వారు సంప్రదించాలని ఫోన్ నెంబర్ గోడపై రాశారు.

ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి భార్యతో కలిసి ఇంటికి వచ్చిన గౌస్‌పాషా ఇంటి గోడలపై రాతలతోపాటు నోటీసులు అంటించడాన్ని చూసి అవమానానికి గురయ్యాడు. భార్య ఇంటి ముందు చెత్తను తొలగించే పనిలో ఉండగా ఆయన బిల్డింగ్ పైన ఉన్న రేకులషెడ్డు రూమ్‌లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. భర్త పైకి వెళ్లి కిందికి రాలేదని ఆమె పైకి వెళ్లి చూడగా ఉరితో వేలాడుతు కనిపించడంతో ఇరుగు పొరుగు వారిని పిలిచింది. అప్పటికే అతడు మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా గౌస్‌పాషా మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఫైనాన్స్ నిర్వాహకుల వేధింపుల కారణంగానే మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యులు ఆరోపించారు.

భార్య అనారోగ్యానికి గురికావడంతోనే నాలుగు కిస్తీలు చెల్లించలేకపోయాడని, కొంత గడువు ఇవ్వండి.. చెల్లిస్తానని చెప్పినా వినకుండా ఇబ్బందులకు గురిచేసి పరువు తీయడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు వాపోయారు. ఈ సంఘటనపై కుటుంబసభ్యుల నుంచి ఇంకా ఫిర్యాదు అందలేదని, పిటిషన్ ఇచ్చాక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న యాదగిరి

ఐనవోలు, జనవరి 28: ఐనవోలు దేవస్థానం మాజీ చైర్మన్ వడిచర్ల శ్రీనివాస్ ఇటీవల మృతిచెందింది తెలిసిందే. ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్, మధ్యప్రదేశ్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జి ఉల్లెంగుల యాదగిరి ఆదివారం ఐనవోలులోని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ పులి గణేష్‌గౌడ్, యాదవసంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు సంగి వెంకన్నయాదవ్, మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి నల్లమాస రమేష్‌గౌడ్, రజక సంఘం మండల ఉపాధ్యక్షుడు అలుగూరి శ్రీను, ప్రధాన కార్యదర్శి గుడికందుల చంద్రయ్య తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ట్రస్మా జిల్లా కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

మట్టెవాడ, జనవరి 28: వరంగల్ జిల్లా తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలోని పోచమ్మమైదాన్‌లో గల పద్మావతి డిగ్రీ కళాశాలలో జరిగింది. ముఖ్య అతిథిగా నిస్సా జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పరంజ్యోతి హాజరై మాట్లాడారు. అనంతరం వరంగల్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులుగా ఆడెపు వెంకటేశ్వర్లు, సమీ ఉల్లాబేగ్, ఎన్.కిరణ్‌కుమార్, వన్నాల గోవిందరాజులు, ఆకుల శ్రీనివాస్, కూచన కవిత, ఎం.రాజు, డి.శ్రీనివాస్, ఎస్.వెంకట్రాజం, ఆర్.మాధవి, గౌరీశంకర్, ఎ.వినోద్‌కుమార్, నర్సింహమూర్తిని ఎన్నుకున్నారు. సమావేశంలో ట్రస్మా నాయకులు బిల్ల రవికుమార్, ఠాకూర్ జ్ఞానేశ్వర్‌సింగ్, అకినెపల్లి సతీశ్, కోడం శ్రీధర్, పొన్నోజు చక్రపాణి, రవీందర్, దాసి సతీశ్‌మూర్తి, కూరపాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన గ్రీన్ ఫీల్డ్ హైవే బాధితులు


కోదండరాంను సన్మానిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ బాధితులు

పరకాల, జనవరి 28 : ఎమ్మెల్సీ కోదండరాంను హుజూరాబాద్‌లో ఆదివారం పరకాల నియోజకవర్గ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే బాధితులు కలిసి తమ బాధలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం పచ్చని పంట పొలాను గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రూపంలో లాగేసుకుంటుందన్నారు. గత మూడు సంవత్సరాలుగా తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కలిసి రైతులను మోసం చేస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ గోడును వివరించి భూములు పోకుండా చూడాలని కోరారు. పరకాల నియోజకవర్గంలో రెండువేల ఎకరాల భూమి పోతుందని, ఆ భూములు రైతులకు మరోచోట దొరకవని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాంకు శాలువకప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేడు భీమదేవరపల్లికి మంత్రి పొన్నం రాక

భీమదేవరపల్లి, జనవరి 28: భీమదేవరపల్లి మం డలంలో వివిధ అభివృద్ధి పనులు శంకుస్థాపనలు చేసేందుకు సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మం త్రి పొన్నం ప్రభాకర్ రానున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు ముల్కనూర్ పల్లె దావఖానను ప్రారంభిస్తారు.

బొల్లోనిపల్లె నుంచి గట్లనర్సింగాపూర్‌కు నిర్మించే పంచాయతీరాజ్ రోడ్‌కు శంకుస్థాపన చేస్తారు. గట్లనర్సిం గాపూర్‌లో నిర్మించన గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తారు. కొత్తకొండ నుంచి చంటయ్యపల్లి రోడ్డుకు శంకుస్థాపన, రసూల్‌పల్లి, మల్లారం గ్రామాల్లో నిర్మించే గ్రామపంచాయతీల భవనాలకు శంకుస్థాపన చేస్తారని పార్టీ వర్గాలు తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించిన కేంద్రం

గిర్మాజిపేట, జనవరి 28: దేశంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభు త్వం పదేళ్ల కాలంలో కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేసిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరిగే సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాల పోస్టర్‌ను శనివారం రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్ వద్ద ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేసి ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ వర్గాలకు అప్పగించిందని ఆరోపించారు. ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని, విద్యుత్ సవరణ, మోటార్ వెహికిల్ యాక్ట్ రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను రక్షించాలని, పంటలకు గిట్టుబాటు ధర అమలు చేయాలని, ధరల నియంత్రణ, ఉపాధి హామీ పథకాలు బలోపేతం చేయాలని తదితర అంశాలను ఈ సమావేశాల్లో చర్చించి తగిన కార్యాచరణను రూపొందించనున్నట్లు చెప్పా రు. సమావేశాల తొలి రోజు 31న హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో జరిగే బహిరంగ సభలో సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.వి.రాఘవులు ప్రసంగిస్తారని భాస్కర్ తెలిపా రు. ఈ సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వి.రమ, కాసు మాధవి, జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, గున్నాల ప్రభాకర్, ఎం.ఉపేందర్, మద్దూరి రవిందర్, యాకుబ్ పాషా, మహబూబ్, మల్లేశం, మురళి, రాజ్‌కుమార్, కిరణ్, విశ్వనాథ్, గోపాల్ పాల్గొన్నారు.


వరంగల్ రైల్వేస్టేషన్ వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జాతీయ నాయకులు

కొత్తకొండ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

భీమదేవరపల్లి, జనవరి 28 : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి-రాజ్యలక్ష్మి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామికి గుమ్మడికాయలు, కోరమీసాల మొక్కులు చెల్లించారు. అనంతరం కోడె మొక్కులు చెల్లించారు. స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు రాజయ్య, మొగిలిపాలెం రాంబాబులు ప్రవీణ్‌రెడ్డి-రాజ్యలక్ష్మి దంపతులను ఆలయ జ్ఞాపిక, ప్రసాదం అందించి ఆశీర్వదించారు.



తెలుగు రాష్ట్రాల నుంచి ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన ఏకైక మహిళ **దాలిపర్తి ఉమామహేశ్వరి**. అంతేకాదు, ఆమె ఒకే ఒక్క సంస్కృత భాగవతారిణి కూడా. మన సంప్రదాయ కళారూపమైన హరికథను హార్వర్డ్ యూనివర్సిటీ వరకు తీసుకెళ్లారు. ఆమె కథాగానానికి దేశదేశాలలో అభిమానులున్నారు. ఇప్పుడు అయోధ్య రామాలయ ట్రస్ట్ నుంచి ఆహ్వానాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి 'నవ్య'తో ముచ్చటించారు.

ఏకైక సంస్కృత భాగవతారిణి

పద్మశ్రీ పురస్కారం నన్ను వరించిందనే ఆనందం కంటే హరికథా ప్రక్రియకు సముచిత గౌరవం దక్కిందనే సంతోషమే నాకు ఎక్కువగా ఉంది. నేను పుట్టి, పెరిగిందంతా కృష్ణా జిల్లా మచిలీపట్నంలో అయినా, నా పేరును పద్మ పురస్కారానికి ప్రతిపాదించింది మాత్రం తెలంగాణ ప్రభుత్వమే.! మాది సంగీత విద్వాంసుల కుటుంబం. మా చిన్నతాతయ్య దాలిపర్తి పిచ్చాహరి శాస్త్రీయ సంగీత విద్వాంసుడు. ఆయన గాన ప్రతిభకు మెచ్చిన చల్లపల్లి రాజా గండపెండేరంతో సత్కరించి, అంబారీ ఉత్సవం చేయించారు. మా నాన్న లాలాజీరావు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ఆస్థాన నాదస్వర విద్వాంసుడిగా ముప్పై ఏళ్లు సేవలందించారు. మా అమ్మ సరోజినీ కూడా సంగీతాభిమాని కావడంతో నాకు చిన్నతనం నుంచి కర్ణాటక సంగీతంలో శిక్షణ ఇప్పించారు. ఒకవైపు స్కూలుకెళుతూనే మరోవైపు సందర్భానుసారం కొన్ని వేదికల మీద పాటలు పాడుతుండేదాన్ని. అలా ఓసారి కపిలేశ్వరపురం జమీందారు ఎస్బీకే సత్యనారాయణ సతీమణి రాజరాజేశ్వరీదేవి మచిలీపట్నంలోని తన పుట్టింటికి వచ్చినప్పుడు నా గాత్రం విన్నారు. మరుసటి రోజు నన్ను ఇంటికి పిలిపించి 'చక్కగా పాడుతున్నావు. హరికథ నేర్చుకో! ఏడాది కిందట కపిలేశ్వరపురంలో మా మామగారిపేరుతో హరికథా పాఠశాల ప్రారంభించాం. ఆడపిల్లలకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నాం. మంచి అవకాశం, కాదనకు' అన్నారు. అమ్మానాన్నను వదిలి వెళ్లడం ఇష్టంలేక మౌనంగా ఉన్నాను. కొద్దిరోజులకు రాణీగారి నుంచి మళ్లీ కబురు రావడంతో... చదువుకన్నా సంగీతంపట్ల నాకున్న శ్రద్ధను గమనించిన మా నాన్న నన్ను కపిలేశ్వరపురం తీసుకెళ్లి సర్వారాయ హరికథా పాఠశాలలో చేర్పించారు. అలా నా 14వ ఏట అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు సంప్రదాయంలో విద్వాంసుల బోధనలతో హరికథ నేర్చుకోవడం ప్రారంభించాను.

విశ్వవిద్యాలయాల్లో ప్రదర్శనలు

ఉజ్జయినిలోని మహాకవి కాళిదాసు అకాడమీ సంగీత, సాహిత్య, కళా ప్రదర్శనకు కపిలేశ్వరపురం రాజా ఎస్బీకే సత్యనారాయణ మా పాఠశాల నుంచి నన్ను ఎంపిక చేశారు. అదీ నటరాజ రామకృష్ణ సలహా మేరకు. తెలుగు కన్నా సంస్కృతంలో హరికథాగానం ద్వారా మరింత ఎక్కువ మందికి ఈ కళ చేరువవుతుందని రాజాగారు సూచించారు. ఆయన విజ్ఞాపన మేరకు నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు 'కుమార సంభవం' సంస్కృత కావ్యాన్ని హరికథా ప్రక్రియలోకి మార్చారు. అది సాధన చేస్తున్న సమయంలోనే హైదరాబాద్‌లోని ప్రఖ్యాత నాట్యాచార్యుడు నటరాజ రామకృష్ణ దగ్గర కొన్ని శ్లోకాలకు, కీర్తనలకు అభినయం నేర్చుకున్నాను. అనంతరం సర్వారాయ వేద పాఠశాల ప్రిన్సిపాల్ బాలగంగాధర శర్మ, దివాకర్ల వేంకటావధాని తదితర పెద్దల ముందు వేర్వేరుగా ప్రదర్శనలిచ్చాను. వారంతా ఆమోదించిన తర్వాతనే కాళిదాస సమారోహంలో ప్రపంచ ప్రఖ్యాత సంస్కృత పండితుల సమక్షంలో సంస్కృత హరికథాగానం చేశాను. అది చూసి ముగ్ధులైన నిర్వాహకులు ప్రతి ఏటా ఉజ్జయినిలో ఒక ప్రదర్శన ఇవ్వాలి అని నన్ను కోరారు. తర్వాత దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి ఆహ్వానాలు వచ్చాయి. అలా అన్నీ యూనివర్సిటీలలో హరికథా ప్రదర్శనలిచ్చాను. వాల్మీకి 'రామాయణం', 'మాళవికాగ్నిమిత్రం' 'అభిజ్ఞాన శాకుంతలం', 'మేఘసందేశం', 'రఘువంశం', 'భక్త జయదేవ' ఇలా పది సంస్కృత గాథలను నేర్చుకొని నలభై ఏళ్లుగా హరికథాగానం చేస్తున్నాను. హరికథా పాఠశాలలో మాకు తెలుగు, సంగీతంతో పాటు సంస్కృతంలోని పంచకావ్యాలు, హితోపదేశ శ్లోకాలు బోధిస్తారు. మా గురువుల బోధనే సంస్కృత హరికథాగానంలో నన్ను మేటిగా నిలిపింది.

కులాంతర వివాహం...

కేవలం ప్రవచనంతో కథాగానం రక్తికట్టదు కనుక ఆంధ్ర నాట్యం కూడా నేర్చుకోవాలి అని నాట్యాచార్యులు నటరాజ రామకృష్ణ ఆదేశించడంతో మళ్లీ హైదరాబాద్ వచ్చాను. ఆయన దగ్గర శిక్షణ పొందుతున్న సమయంలోనే కళా కృష్ణతో పరిచయం ఏర్పడింది. ఒకరోజు ఆయన నా ముందు పెళ్లి ప్రతిపాదన పెట్టారు. మా ఇంట్లో వాళ్లతోనూ కృష్ణ మాట్లాడారు. కళాకారుడితో జీవితం పంచుకుంటే నీ విద్యకూడా శాశ్వతంగా నిలుస్తోంది అని రాజరాజేశ్వరమ్మ దీవించారు. మా పెద్దలు కూడా అంగీకరించడంతో వివాహం చేసుకున్నాం. ఆయనది కరీంనగర్ జిల్లా బెజ్జంకి. మాది కులాంతర వివాహం. మాకు ఇద్దరు పిల్లలు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఉద్యోగం వచ్చినా, నన్ను ఇంతలా తీర్చిదిద్దిన నా మాతృసంస్థకు సేవ చేయాలి అనే ఉద్దేశంతో ఆ అవకాశాన్ని వదిలేశాను. రెండు నెలలకు ఒకసారి సర్వారాయ పాఠశాలలో పదిరోజుల పాటు తరగతులు తీసుకుంటాను. కపిలేశ్వరపురం జమీందారీ దంపతులు నన్ను సొంత బిడ్డలా ఆదరించారు. నన్ను కూడా దివాణంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిగా చూసుకున్నారు. అలాంటి మహానుభావుల ఆర్థిక తోడ్పాటు వల్లే ఇంకా కళలు వర్ధిల్లుతున్నాయి.

అదీ హరికథకున్న జనాదరణ...

మచిలీపట్నం కళలకు నిలయం. నా చిన్నతనంలో అమ్మతో కలిసి ఎన్నోసార్లు హరికథా కాలక్షేపానికి వెళ్లాను. హరికథకులుగా ప్రఖ్యాతి గాంచిన కోట సచ్చిదానంద శాస్త్రి 'మహాభారతం', అమ్ముల విశ్వనాథం 'రామాయణం', పొడుగు పాండురంగదాసు 'బ్రహ్మంగారి జీవిత చరిత్ర'... ఇలా ఒక్కొక్క విద్వాంసుడు ఒక్కో వీధిలో నలభై రోజుల పాటు ఆనాడు హరికథలు చెబుతుంటే, సభా ప్రాంగణాలన్నీ వందలమంది జనంతో కిటకిటలాడేవి. సచ్చిదానంద శాస్త్రి హరికథ చెబుతున్నన్ని రోజులు బందరులోని సినిమా థియేటర్లు జనంలేక వెలవెలబోయేవి. దాంతో యాజమాన్యం షో సమయం మార్చిన రోజులున్నాయి. అదీ ఆనాడు హరికథకున్న జనాదరణ. అలాంటిది ఇప్పుడు టెలివిజన్, యూట్యూబ్ మాధ్యమాలు వచ్చిన తర్వాత జనం సంప్రదాయ కళలపట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అయితే, కొందరు వ్యక్తిగత చొరవతో పండుగలు, ప్రత్యేక సందర్భాలలో హరికథా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. మాలాంటి కళాకారులను ఆహ్వానిస్తున్నారు. అంతవరకు సంతోషం.

హరికథాకారిణులు...



సినీనటుడు రావుగోపాలరావు గారి సతీమణి రావు కమలకుమారి తెలుగులో చాలా మధురంగా హరికథ చెప్పేవారు. ఆమెను ఒడిశా కథారాణి అనేవారంతా.! ఇందిరా బాల, శార్వాణి భాగవతారిణి లాంటి కొందరు అద్భుతంగా హరికథాగానం చేసి ప్రేక్షకుల అభిమానం పొందారు. నా సమకాలీనుల్లోనూ ఆడవాళ్లు చాలామంది హరికథాగానం చేస్తున్నారు. అయితే, ఈ మధ్యకాలంలో ఈ విద్య నేర్చుకోవడానికి ఎక్కువమంది మక్కువ చూపడం లేదు. కరోనా తర్వాత కొత్తగా వస్తున్నవాళ్ల సంఖ్య మరీ తగ్గింది. శాస్త్రీయ నృత్యం, సంగీతం నేర్చుకోడానికి ఆసక్తి చూపినంతగా హరికథలాంటి సంప్రదాయ కళమీద పెద్దగా ఎవరూ శ్రద్ధ పెట్టడం లేదు.

అభినవ మాతంగి

ఒక ఆధ్యాత్మిక సదస్సులో నా హరికథాగానం విన్న కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి నాకు 'అభినవ మాతంగి' బిరుదును ప్రదానం చేశారు. పదేళ్ళ తర్వాత స్వామివారి దర్శనార్థం మళ్లీ కంచికి వెళ్లినప్పుడు పవిత్ర రాగి ఫలకాన్ని నా చేతుల్లో పెట్టి 'జీవితమంతా భక్తిమార్గంలో నడువు' అంటూ ఆశీర్వదించారు. మహాస్వామి దీవెనలు అందుకోవడం నా జీవితంలో మరిచిపోలేని ఒక మధురానుభూతి. నీలం సంజీవరెడ్డి, జ్ఞానిజైల్ సింగ్, శంకర్ దయాళ్ శర్మ.. రాష్ట్రపతిగా సేవలందించిన ఈ ముగ్గురు మహనీయుల సమక్షంలో హరికథ చెప్పడం నాకు లభించిన అరుదైన అవకాశం. వారి ప్రశంసలు అందుకోవడం నా అదృష్టం. 'ఏకైక సంస్కృత హరికథా కళాకారిణి' అవార్డుతో జ్ఞానిజైల్ సింగ్ నన్ను సత్కరించారు. బద్రీనాథ్‌లో 'ఆదిశంకరాచార్య జీవితం' హరికథను విన్న ఆనాటి ప్రధాని రాజీవ్‌గాంధీ 'అద్భుతం' అంటూ నన్ను ప్రత్యేకంగా అభినందించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును గతేడాది రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదగా అందుకోవడం నాకు దక్కిన మరొక గౌరవం. రామకృష్ణ పరమహంస, పొట్టిశ్రీరాములు, రమణమహర్షి లాంటి వైతాళికుల జీవిత చరిత్రలను హరికథగా కంపోజ్ చేసి ప్రదర్శించాను.

విదేశాల్లో హరికథా ప్రదర్శన

హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మైఖేల్ విజెల్ 1993 నాటి ఇంటర్నేషనల్ వేదిక్ కాన్ఫరెన్స్‌కు ముందు సర్వారాయ వేద పాఠశాల ప్రిన్సిపాల్ బాలగంగాధరశర్మను కలవడానికి కపిలేశ్వరపురం వచ్చారు. అప్పుడు ఆయన నా హరికథా ప్రదర్శన చూసి మెచ్చుకున్నారు. ఈ ప్రక్రియను తన దేశవాసులకు చూపించాలి అని నన్ను అమెరికాకు ఆహ్వానించారు. అలా న్యూయార్క్ లోని అంతర్జాతీయ వేదిక్ సదస్సులో 'అభిజ్ఞాన శాకుంతలం' ప్రదర్శించాను. అదే సమాయంలో హార్వర్డ్ యూనివర్సిటీలో 'కుమార సంభవం', తర్వాత లండన్‌లో 'సీతాకల్యాణం' హరికథాగానం చేశాను. దేశదేశాలలో ఇప్పటివరకు 600కుపైగా సంస్కృత హరికథలు, 800కుపైగా తెలుగు హరికథలు ప్రదర్శించాను.

అయోధ్య నుంచి ఆహ్వానం

చేత చిరతలు పట్టి, కాలికి గజ్జెలు కట్టి.. నోటితో వాచికం చెబుతూ, మృదుమధురమైన గానమాలపిస్తూ, ముఖంలో సాత్వికం, చేతులతో అభినయం పలికిస్తూ... లయబద్ధంగా కాలితో నాట్యమాడుతూ జనరంజకంగా కథాగానం చేయడం తెలుగువారి సంప్రదాయ హరికథా ప్రదర్శనలోని ప్రత్యేకత. ఇది సంగీత, సాహిత్య, అభినయాల మేలు కలయిక. వయొలిన్, మృదంగం తోడు వాయిద్యాలుంటాయి. అదే తమిళుల కథా కాలక్షేపం సంగీత ప్రధానంగా సాగితే, కన్నడ హరికథ ప్రవచనానికి, మరాఠీకథాగానం కీర్తనలు ప్రధానంగా ఉంటాయి. ఉత్తరాదివారు సైతం మన హరికథాగానాన్ని అమితంగా ఇష్టపడతారు. అయోధ్య రామాలయం ట్రస్ట్ నుంచి నాకు ఆహ్వానం వచ్చింది. త్వరలో బాలక్‌రామ్ సన్నిధిలో హరికథాప్రదర్శన ఇవ్వబోతున్నందుకు ఆనందంగా ఉంది. నా జీవితకథ హరికథ వేర్వేరు కాదు. నా జీవితమంతా కళాసేవ చేస్తూ గడిపేయాలని కోరిక. కళారాధకులు ముందుకొస్తే కొత్తతరం హరికథకులను తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

• సొంత్వన్, ఫొటోలు: జ్వాలా కోటేశ్

నవతరానికి స్ఫూర్తిమంత్రం

పదిహేనేళ్ల వయసులోనే పెళ్లి... భర్త... అత్తింటి బాధ్యతలు. ఇవేవీ ఆమె ఎదుగుదలకు అడ్డు కాలేదు. ఆత్మవిశ్వాసం అండగా... పట్టుదలే పెట్టుబడిగా... ఉన్నత ఆశయంతో అడుగులు వేసిన ఆమె... నేడు వేలమందికి ఉద్యోగాలిస్తున్నారు. మహిళల్లో చైతన్యం రగిలించి... వారిని ఉన్నత శిఖరాల వైపు నడిపిస్తున్నారు. వాణిజ్యం, పరిశ్రమల రంగాల్లో అలుపెరుగని కృషికి గుర్తింపుగా కేంద్రం ఆమెకు 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త... సామాజిక కార్యకర్త... **శశి సోనీ** కథ ఇది...

స్ఫూర్తి



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ' పురస్కారాల్లో నలుగురు పారిశ్రామికవేత్తలు ఉన్నారు. వారిలో ఒకరు శశి సోనీ. బెంగళూరులోని ప్రసిద్ధ సాఫ్ట్‌వేర్ కంపెనీ 'ఐజ్మో' వ్యవస్థాపకురాలు ఆమె. 1996లో నెలకొల్పిన ఈ కంపెనీకి అన్నీ తానై నడిపిస్తున్నారు శశి. నేడు ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ఆటోమొబైల్ సొల్యూషన్ ప్రొవైడర్‌గా దాన్ని తీర్చిదిద్దారు. వాణిజ్య, పారిశ్రామిక రంగాలను ప్రభావితం చేసిన మహిళగా ఆమె పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. 1971లో కేవలం పది వేల రూపాయలతో ముంబయిలో 'డీప్ ట్రాన్స్‌పోర్ట్' పేరిట వ్యాపార రంగంలోకి ప్రవేశించిన శశి.. ఆ తరువాత అంచెలంచెలుగా ఎదిగారు. ఆ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ఒకే ఒక్క కారుతో మొదలై... నాలుగేళ్లలో 10 కార్లు, 7 టెంపోలకు విస్తరించింది. పాకిస్తాన్‌లోని లాహోర్‌లో పుట్టిన శశి.. కెరీర్ ఆరంభంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. అయితే



ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ వదిలేసి 1981లో మైసూరులో 'డీప్ ఆక్సిజన్ ప్రైవేట్ లిమిటెడ్' స్థాపించారు. ఇక అక్కడి నుంచి ఆమె వెనుదిరిగి చూసుకోలేదు. కెరీర్ రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోయింది.

పెళ్లయినా...

సంప్రదాయ కుటుంబంలో పుట్టిన శశికి చిన్న వయసులోనే ఇంట్లోవాళ్లు పెళ్లి చేశారు. 'అప్పుడు నాకు పదిహేనేళ్లు. ఢిల్లీ స్కూల్లో చదువుకొంటున్నా. ఆ సమయంలో మా అమ్మ నాకు పెళ్లి చేసింది. కానీ పెళ్లి తరువాత నేను చదువు ఆపదలుచుకోలేదు. మా అత్తమామలది సంప్రదాయ కుటుంబం. ఇంట్లో ఎడతెరిపిలేని పని. అత్తమామల బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత నాదే. దేశం విడిపోయాక పాకిస్తాన్‌లోని వారి ఆస్తులన్నీ పోయాయి. దీంతో మావారి సంపాదన మీద కుటుంబమంతా ఆధారపడాల్సి వచ్చింది. ఆయన స్టీల్ ప్లాంట్‌లో పని చేసేవారు. వీటన్నిటి నేపథ్యంలో నాకంటూ ఒక లక్ష్యం లేకపోతే భవిష్యత్తులో ఒడుదొడుకులు తప్పవనిపించింది. ఏంచేయాలని ఆలోచిస్తుంటే... మా సోదరుడు గుర్తుకువచ్చాడు. తను ముంబయిలో వ్యాపారవేత్త. మమ్మల్ని అక్కడకు రమ్మన్నాడు. అయితే మావారిని ఉద్యోగం మాన్పించి, తీసుకువెళ్లాలని నేను అనుకోలేదు. ఆయన్ను ఒప్పించి, నా పిల్లల్ని తీసుకుని ముంబయికి వెళ్లాను. మా సోదరుడికి పెట్రోలు బంకు, చిన్న గ్యారేజీ ఉండేవి. మా మామయ్య ఒకరు ఆ పెట్రోలు బంకు నిర్వహించేవారు. అందులో లెక్కలు చూడమని ఆయన నన్ను అడిగారు. నేను రాసిన అక్కౌంట్ బుక్స్ చూసిన సీనియర్ అక్కౌంటెంట్... నా వర్క్ సీఏలా ఉందన్నారు. ఇలా అందరి ప్రోత్సాహంతో వర్క్‌షాప్ పర్యవేక్షణ కూడా మొదలుపెట్టాను. అక్కడ అనుభవం, పరిచయాలు ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ పెట్టడానికి ప్రేరణనిచ్చాయి. అలా ముప్పై ఏళ్ల వయసులో బిజినెస్ మొదలుపెట్టాను. తరువాత కొన్నేళ్లకు మావారు కూడా ముంబయిలోని ముకుంద్ స్టీల్‌కు మారారు' అంటూ నాటి రోజులు గుర్తు చేసుకున్నారు శశి.

లిస్టెడ్ కంపెనీగా...

భారత పారిశ్రామిక రంగానికి చేస్తున్న కృషికి గానూ 1990లో ప్రతిష్ఠాత్మక 'మహిళ గౌరవ్ పురస్కార్' అందుకున్నారు శశి. 'డీప్ ఆక్సిజన్' కంపెనీ విజయవంతం కావడంతో శశి మరింత దూకుడు పెంచారు. 1995 వరకు ఆ కంపెనీ చైర్‌పర్సన్‌గా ఉన్న ఆమె... ఆ మరుసటి ఏడాదే 'ఐజ్మో'కు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆసియా, అమెరికా, ఐరోపా ఖండాల్లో ఈ కంపెనీ విస్తరించింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టెడ్ కంపెనీగా అవతరించింది. దీని ద్వారా వేల మందికి ఆమె ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

మహిళా సాధికారతకు...

వ్యాపార కార్యకలాపాల్లో క్షణం తీరిక లేకుండా గడిపే శశి సోనీ... సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలని తపించారు. అందులో భాగంగానే మహిళా సాధికారత దిశగా అడుగులు వేశారు. వికలాంగులకు అండగా నిలబడ్డారు. 'డీప్ పబ్లిక్ సర్వీస్ కమిటీ' సభ్యురాలిగా మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి పూనుకున్నారు. వారి కోసం పింఛను పథకాలు తీసుకువచ్చారు. నిధులు సేకరించి, వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిరంతర కృషి చేస్తున్నారు. 'ఆలిండియా ఇండస్ట్రియల్ గ్యాస్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్', 'డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ డెవలప్‌మెంట్ మేనేజింగ్ కమిటీ'ల్లో సభ్యురాలిగా ఉన్నారు. తన సంస్థలో ఉద్యోగులను కుటుంబ సభ్యుల్లా భావించే శశి... వారి సంక్షేమం కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించారు.

ప్రతిష్ఠాత్మక పురస్కారం...

పారిశ్రామిక రంగంలో శశి సోనీ చేస్తున్న విశేష కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమెకు 'పద్మశ్రీ' పురస్కారాన్ని ప్రకటించింది. 'ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది. స్వయంశక్తితో ఎదిగిన ఒక మహిళగా ఎంతో గర్వంగా భావిస్తున్నా. నా ఈ సుదీర్ఘ ప్రయాణం కొందరికైనా ప్రేరణగా నిలుస్తుందని భావిస్తున్నా' అంటున్న శశి సోనీ వయసు డెబ్బై ఐదు. కానీ ఇప్పటికీ ఆమెలో అదే ఉత్సాహం... పని పట్ల అంకితభావం. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని ఆమె ఎదిగిన క్రమం... నవతరానికి స్ఫూర్తిమంత్రం.

మానవస్పర్శ భరించలేని అఘోరాగా..

విశ్వక్‌సేన్ కథానాయకునిగా విద్యాధర్ కాగిత దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'గామి'. కార్తీక్ శబరీశ్ నిర్మిస్తున్న ఈ అడ్వెంచరస్ డ్రామాకు చెందిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. అఘోరాలా ఉన్న విశ్వక్‌సేన్‌ని చుట్టూ ఉన్న చాలామంది అఘోరాలు తాకటానికి ప్రయత్నిస్తున్నట్లు ఈ పోస్టర్ ఉంది. పోస్టర్ లాగే పాత్ర కూడా కొత్తగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఇందులో విశ్వక్‌సేన్ శంకర్ అనే అఘోరాగా కనిపించనున్నారని, మానవస్పర్శను భరించలేని రేర్ కండీషన్ ఆ పాత్రకు ఉంటుందని, సంఘర్షణలతో కూడుకున్న పాత్ర ఇదని మేకర్స్ పేర్కొన్నారు. ఇంకా ఎన్నో ప్రత్యేకతలతో రూపొందుతోన్న చిత్రమిదని, ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలో రివీల్ చేస్తామని మేకర్స్ తెలిపారు. చాందిని చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఎం.జి.అభినయ, హారిక, మహ్మద్ సమద్ ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి కెమెరా విశ్వనాథరెడ్డి, రాంపీ నందిగాం, సంగీతం: నరేశ్ కుమరన్.





రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ నిర్మాతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను కలిసిన వారిలో దిల్‌రాజు, స్రవంతి రవికిశోర్, సునీల్ నారంగ్, యార్లగడ్డ సుప్రియ, వి.దామోదరప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది

కౌశిక్ భీమిడి



'ఒకరోజు మహాభారతం చదువుతుంటే అందులో ఉన్న చాలా శాపాల గురించి తెలిసింది. అటువంటి శాపాన్ని ఇప్పటి జనరేషన్ కుర్రాడు ఎదుర్కొంటే ఎలా ఉంటుందన్న కాన్సెప్ట్‌తో 'హ్యాపీ ఎండింగ్ కథ మొదలైంది' అన్నారు దర్శకుడు కౌశిక్ భీమిడి. యశ్ పూరి హీరోగా నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. యోగేశ్ కుమార్, సంజయ్‌రెడ్డి, అనిల్ పల్లాల నిర్మాతలు. విడుదల సందర్భంగా దర్శకుడు మీడియాతో ముచ్చటిస్తూ 'పురాణాల నుంచి తీసుకున్న అంశం కనుక ట్రీట్‌మెంట్ మోడరన్‌గా ఉండాలనుకున్నా. 'విక్కీ డోనర్' వంటి చిత్రాలు ఐడియా పరంగా అడల్ట్ ఓరియంటెడ్‌గా ఉన్నా, మా మూవీ ట్రీట్‌మెంట్ మాత్రం అందరూ చూసేలా కన్విన్సింగ్‌గా ఉంటుంది.' అని కౌశిక్ చెప్పారు. 'హ్యాపీ ఎండింగ్ స్క్రిప్ట్‌కు యశ్, అపూర్వ చక్కగా సూట్ అయ్యారు. వాళ్ల నటన కూడా ఫ్రెష్‌గా ఉంటుంది. దర్శకుడిగా నాకు ఇది తొలి సినిమా కనుక టెక్నీషియన్లు కూడా కొత్త వాళ్లు ఉంటే నాకు కంఫర్ట్‌గా ఉంటుందనుకున్నాను. మంచి టీమ్ సెట్ అయింది. సినిమా బిగినింగ్‌లోనే హీరోకు ఉన్న శాపం గురించి రివీల్ చేస్తాం. పతాక సన్నివేశాల్లో శాపవిముక్తితో హ్యాపీగా కథ ముగుస్తుంది. అసలు అతనికి శాపం ఉందా లేదా అన్నది చిన్న రీకాలింగ్ సీన్స్‌తో సైకలాజికల్ డ్రైవ్‌తో చూపించాం. ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కనుక థియేటర్లలోనే చూడాలని నా మనవి' అన్నారాయన.

నవ్య | చిత్రజ్యోతి

ఈ అద్భుత విజయం ప్రేక్షకులందరిదీ

తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ రూపొందించిన 'హను-మాన్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా ఇటీవల నిర్మాత కె.నిరంజన్‌రెడ్డి గ్రాటిట్యూట్ మీట్ నిర్వహించారు. ఇందులో దర్శకుడు మాట్లాడుతూ 'అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమాను తీసుకెళ్లడానికి సహకరించిన నిర్మాత నిరంజన్‌రెడ్డిగారికి కృతజ్ఞతలు. తేజ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. ఈ సినిమాతో అతను సూపర్ హీరో అయ్యాడు. అలాగే అమృత చక్కని నటన ప్రదర్శించింది. ఇక వరలక్ష్మిగారు సంక్రాంతికి లక్కీ ఛార్మ్. ఆమెతో వర్క్ చేయడం మంచి అనుభూతి. అలాగే రవితేజగారు మా సినిమాలో భాగం అవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. కోటి పాత్రకు ఆయన ఇచ్చిన వాయిస్‌నే ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారు. రవితేజగారు ఒప్పుకొంటే ఈ యూనివర్స్‌లో ఒక సినిమా చేయాలనుకుంటున్నాను' అంటూ చిత్రానికి పని చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా అభినందనలు తెలిపారు. 'జై హనుమాన్' చిత్రం 'హను-మాన్'కి వంద రెట్లు ఉండబోతుందని చెప్పారు. 'ప్రేక్షకులు మా వెనుక నిలబడ్డారు కనుకే మేం ఈ రోజున ఈ వేదికపై ఉన్నాం. మమ్మల్ని బలంగా నమ్మి అండగా నిలిచిన నిర్మాత నిరంజన్‌రెడ్డిగారికి ధన్యవాదాలు. ఇకపై చేసే చిత్రాలు కూడా ఇంతే కష్టపడి ప్రేక్షకులకు నచ్చేలా చేస్తాం.' అన్నారు హీరో తేజ. 'హను-మాన్'లో హనుమాన్, మ్యాన్ ఎలా ఉన్నారో ఇక్కడ తేజ, ప్రశాంత్ ఉన్నారని అభినందించారు వరలక్ష్మి శరత్‌కుమార్. ఇంత గొప్ప విజయం అందించిన ప్రేక్షకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. నిర్మాత నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ 'నేను, దర్శకుడు ప్రశాంత్ ఏదైతే నమ్మి మూడేళ్లు హార్డ్ వర్క్ చేశామో ప్రేక్షకుల ఆదరణతో అది సాధించాం. ఈ విజయం వారందరిది. తేజ లేకపోతే ఈ సినిమా లేదు. అలాగే ప్రశాంత్‌కు తన బలం తెలీదు. 'హను-మాన్'లో చూసింది కేవలం ఒక్క శాతమే.. ఇంకా 99 శాతం బయటకు రావాలి' అన్నారు.



గేమ్ ఆన్ రియలిస్టిక్‌గా ఉంటుంది

దయానంద్



'చనిపోదాం అనుకొనే వ్యక్తి జీవితంలోకి ఒక గేమ్ ప్రవేశించడం వల్ల అతడి జీవితంలో వచ్చిన మార్పు ఏంటి? అనే పాయింట్‌తో 'గేమ్ ఆన్' చిత్రాన్ని రూపొందించాం. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలా కాకుండా డిఫరెంట్‌గా ప్రయత్నించాం. యూత్‌ను ఎట్రాక్ట్ చేస్తూనే ఫ్యామిలీ ఎమోషన్స్ కలిగి ఉంటుందీ చిత్రం' అన్నారు దర్శకుడు దయానంద్. గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. రవి కస్తూరి నిర్మాత. సినిమా చాలా రియలిస్టిక్‌గా సాగుతుందనీ, ప్రతి ఒక్కరూ చూడాలనీ దయానంద్ కోరారు.

'అంబాజీ..'లో కొత్తదనం ఆకట్టుకుంటుంది

-ధీరజ్ మొగిలినేని



సుహాస్ హీరోగా నటించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. దుష్యంత్ కటికినేని దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని నిర్మించారు. ఆయన మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడిస్తూ 'ఈ సినిమా అనౌన్స్ చేసినప్పుడు అంతా కామెడీ మూవీ అనుకున్నారు. పాటలు విడుదలయ్యాక లవ్ స్టోరీ కావొచ్చు అనుకున్నారు. కానీ ట్రైలర్ చూశాక సీరియస్ సబ్జెక్ట్ అని అందరికీ అర్థమైంది. సినిమాలో కొత్తదనం ఆకట్టుకుంటుంది. అలాగే సుహాస్ పెర్ఫార్మెన్స్ ఎంత బాగుంటుందో ఈ సినిమాలో చూస్తారు' అని తెలిపారు. 'ఒక ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటనను అలాగే తెరకెక్కించాం. ఇందులో ప్రేమ ఒక అంశం మాత్రమే' అన్నారాయన. 'ప్రస్తుతం రష్మిక హీరోయిన్‌గా 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం చేస్తున్నాం. అది 40 శాతం పూర్తయింది. ఈ ఏడాదే విడుదల చేస్తాం. మరో మూడు ప్రాజెక్టులు సిద్ధం చేస్తున్నాం' అని ధీరజ్ వెల్లడించారు.

బడ్జెట్ తయారీ ఇలా



ప్రభుత్వం ప్రకటించే వార్షిక ఆర్థిక ప్రకటనను బడ్జెట్ అంటారు. కేంద్రప్రభుత్వం భారత రాజ్యాంగంలోని 112వ ఆర్టికల్ ప్రకారం తన వార్షిక, ఆర్థిక ప్రకటన(బడ్జెట్)ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి.

బడ్జెట్‌లో ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ వసూళ్లు, రుణాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది. రాబోయే సంవత్సరానికి ప్రకటించే బడ్జెట్‌లో ఆ ఏడాదికి సంబంధించిన అంచనాలు, గత సంవత్సరానికి సవరించిన మొత్తాలు, అంతకుముందు ఏడాదికి చెందిన అంతిమ సమాచారం ఉంటుంది. ఉదాహరణకు 2023-24 సంవత్సరం ముగుస్తున్నప్పుడు 2024-25 సంవత్సరం కోసం బడ్జెట్ ప్రకటిస్తే 2024-25 సంవత్సరానికి సంబంధించిన అంచనాలు ఉంటాయి. 2023-24 సంవత్సరానికి సంబంధించిన సవరించిన అంచనాలు ఉంటాయి. 2022-23 సంవత్సరానికి సంబంధించిన చివరి అంచనాలు ఉంటాయి.

బడ్జెట్ రకాలు

1) సంతులిత బడ్జెట్ 2) లోటు బడ్జెట్
3) మిగులు బడ్జెట్

1) సంతులిత బడ్జెట్: ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఆదాయం సమానంగా ఉన్నప్పుడు సంతులిత బడ్జెట్ అంటారు.

2) లోటు బడ్జెట్: ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఆదాయాన్ని మించినప్పుడు లోటు బడ్జెట్ అంటారు.

లోటు బడ్జెట్ భావనలు: ఎ) బడ్జెట్ లోటు(ద్రవ్యలోటు) బి) రెవెన్యూ లోటు సి) విత్తలోటు డి) ప్రాథమిక లోటు ఇ) ప్రభావిత రెవెన్యూ లోటు

ఎ) బడ్జెట్ లోటు: మొత్తం ప్రభుత్వ వసూళ్ల కంటే ప్రభుత్వ వ్యయం ఎక్కువగా ఉండటం. దీనినే ద్రవ్యలోటు అంటారు. ఎందుకంటే కేంద్రబ్యాంకు ముద్రించి ఇచ్చే ద్రవ్యంతో ఈ లోటును ప్రభుత్వం పూరించుకుంటుంది.

బి) రెవెన్యూ లోటు: మొత్తం రెవెన్యూ వసూళ్లు మొత్తం రెవెన్యూ వ్యయం కంటే తక్కువగా ఉండటం.

సి) విత్తలోలోటు: ప్రభుత్వ మొత్తం, ప్రభుత్వ రుణేతర వసూళ్లను మించిపోవడాన్ని విత్తలోటు అంటారు. బడ్జెట్ లోటుకు మార్కెట్ రుణాలను, ఇతర అప్పులను(ప్రావిడెంట్ ఫండ్, చిన్న పొదుపు మొత్తాలు)ను కలిపితే కూడా విత్తలోటు తెలుస్తుంది. ప్రభుత్వ వ్యయం నుంచి రెవెన్యూ వసూళ్లు, రుణాల వసూళ్లు, ఇతర వసూళ్లు(పెట్టుబడుల ఉపసంహరణ నిధులు) తీసివేస్తే వచ్చేది విత్తలోటు.

డి) ప్రాథమిక లోటు: విత్తలోటు నుంచి వడ్డీ చెల్లింపులను తీసివేయగా వచ్చేది ప్రాథమిక లోటు.

ఇ) ప్రభావిత రెవెన్యూ లోటు: రెవెన్యూ లోటు నుంచి కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు మూలధన ఆస్తుల నిర్మాణం కోసం ఇచ్చిన నిధుల(గ్రాంట్స్)ను తీసివేస్తే వచ్చేది ప్రభావిత రెవెన్యూ లోటు.

మిగులు బడ్జెట్

ప్రభుత్వ వ్యయం కంటే ప్రభుత్వ ఆదాయం ఎక్కువగా ఉండటాన్ని మిగులు బడ్జెట్ అంటారు. మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం దాదాపు జరగదు. సాధారణంగా లోటు బడ్జెట్‌నే ప్రభుత్వాలు ప్రవేశపెడుతుంటాయి.

బడ్జెట్ రూపకల్పన

బడ్జెట్‌లో రెండు స్థూల అంశాలుంటాయి.
1) ప్రభుత్వ వ్యయం
2) ప్రభుత్వ వసూళ్లు

1. ప్రభుత్వ వ్యయం: ప్రభుత్వ వ్యయాన్ని తిరిగి రెండు రకాలుగా వర్గీకరిస్తారు.
ఎ) రెవెన్యూ వ్యయం బి) మూలధన వ్యయం

ఎ) రెవెన్యూ వ్యయం: రెవెన్యూ వ్యయంలో వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు, రక్షణ వ్యయం, పాలన వ్యయం, రాష్ట్రాలకు ఇచ్చే కేంద్ర గ్రాంటులు ఉంటాయి.

బి) మూలధన వ్యయం: అభివృద్ధి సంబంధిత వ్యయం, రక్షణకు సంబంధించిన మూలధన వ్యయం, రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం ఇచ్చే రుణాలను మూలధన వ్యయంగా పరిగణిస్తారు.

2. ప్రభుత్వ వసూళ్లు: ప్రభుత్వ వసూళ్లను స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరిస్తారు.
1. రెవెన్యూ వసూళ్లు 2. మూలధన వసూళ్లు

1. రెవెన్యూ వసూళ్లు: ఇవి రెండు రకాలు
ఎ) పన్నుయేతర వసూళ్లు బి) పన్నుల వసూళ్లు

ఎ) పన్నుయేతర వసూళ్లు: ప్రభుత్వం ఇచ్చిన రుణాలపై వసూలు చేసుకొనే వడ్డీ, ప్రభుత్వరంగ సంస్థలు ఆర్జించిన లాభాల నుంచి ప్రభుత్వానికి వచ్చే డివిడెండ్లను పన్నుయేతర రెవెన్యూ వసూళ్లుగా పరిగణిస్తారు.

బి) పన్ను వసూళ్లు: పన్నులు స్థూలంగా రెండు రకాలు
1) ప్రత్యక్ష పన్నులు 2) పరోక్ష పన్నులు

ప్రత్యక్ష పన్నులు: ఆరంభ భారం, అంతిమ భారం ఒకరిపైనే ఉంటే వాటిని ప్రత్యక్ష పన్నులు అంటారు. ఆదాయపన్ను, కార్పొరేట్ పన్ను, వృత్తిపన్ను, సంపదపై పన్ను, వ్యయ పన్ను, బహుమతిపై పన్ను, భూమిశిస్తు మొదలైనవి ప్రత్యక్ష పన్నులు. ఈ పన్నులను ఎవరిపై విధిస్తారో వారే చెల్లించాలి. పన్నుభారాన్ని బదిలీ చేయడం వీలుకాదు. ఎవరిపైన పన్ను విధించారో దానిని ఆరంభ భారం అంటారు. ఎవరు పన్ను చెల్లించారో దానిని అంతిమ భారం అంటారు. అంటే ఆరంభ భారం, అంతిమ భారం ఒకరిపైననే పడినట్లు లెక్క.

పరోక్ష పన్నులు: ఆరంభ భారం ఒకరిపై అంతిమ భారం మరొకరిపై పడితే అలాంటి పన్నులను పరోక్ష పన్నులు అంటారు. వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ), వ్యాట్, కస్టమ్స్ సుంకాలు, ఎక్సైజ్ సుంకాలు, అమ్మకం పన్ను, సేవల పన్ను మొదలైనవి పరోక్ష పన్నులు. ఈ పన్నుల భారాన్ని బదిలీ చేయడానికి అవకాశం ఉంటుంది. అంటే ఆరంభ భారం ఒకరిపై అంతిమభారం మరొకరిపై పడే అవకాశం ఉంది. ఉదాహరణకు జీఎస్‌టీని ఉత్పత్తి విలువపై లేదా అమ్మకపు విలువపై లేదా సేవా విలువపై విధిస్తారు. అంటే ఉత్పత్తిదారునిపై లేదా అమ్మకందారునిపై లేదా సేవలు ఇచ్చిన వ్యక్తిపై పన్ను ఆరంభ భారం పడింది. కానీ ఆ పన్ను భారాన్ని ఉత్పత్తిదారుడు హోల్‌సేల్ వ్యాపారికి, హోల్‌సేల్ వ్యాపారి రిటైల్ వ్యాపారికి, రిటైల్ వ్యాపారి వినియోగదారునికి బదిలీ చేస్తారు. అంటే పన్ను అంతిమ భారం వినియోగదారునిపై పడిందన్నమాట. వీటినే పరోక్ష పన్నులు అంటారు.

ఇండియన్ ఎకానమీ

మూలధన వసూళ్లు

రుణాల వసూళ్లు, మార్కెట్ రుణాలు, ఇతర అప్పులు(ప్రావిడెంట్ ఫండ్, చిన్న పొదుపు మొత్తాలు), ఇతర వసూళ్లు(పెట్టుబడి ఉపసంహరణ నిధులు) మూలధన వసూళ్లలో ఉంటాయి. ఈవిధంగా బడ్జెట్‌లో ఎంత మూలధన వ్యయం, ఏయే రంగాలపై, ఎంత రెవెన్యూ వ్యయం ఏయే అంశాలపై చేస్తున్నారో స్పష్టంగా చూపుతారు. అదే విధంగా మూలధన వసూళ్లు, రెవెన్యూ వసూళ్లు ప్రత్యేకించి ఏ పన్ను ద్వారా ఎంత మొత్తం మొదలైన వివరాలు ఉంటాయి. అంతేకాకుండా లోటు బడ్జెట్ ఉన్నప్పుడు విత్తలోటు ఎంత? రెవెన్యూ లోటు ఎంత? ప్రాథమిక లోటు ఎంత? ప్రభావిత రెవెన్యూ లోటు ఎంత మొదలైన వివరాలు ఉంటాయి. సాధారణంగా ఒక రంగానికి లేదా ఒక శాఖకు కేటాయింపులు జరిపేటప్పుడు గతంలో ఎంత కేటాయించారనే దానిని ఆధారంగా తీసుకుంటారు. అలా కాకుండా ప్రతి అంశాన్ని నూతనంగా భావించి కేటాయింపులు జరిపినప్పుడు దానిని శూన్య ఆధారిత బడ్జెట్ అంటారు. శూన్య ఆధారిత బడ్జెట్ భావనను పీటర్ ఎ.ఫైర్ ప్రవచించారు.

ఓట్ ఆన్ అకౌంట్

పూర్తి సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేని సమయంలో తాత్కాలికంగా ప్రభుత్వ ఖర్చుల కోసం పార్లమెంటు అనుమతి తీసుకోవడాన్ని ఓట్ ఆన్ అకౌంట్ అంటారు. ఉదాహరణకు ఈ ఏడాది మార్చి 31 నాటికి 2023-24 బడ్జెట్ కాలం ముగుస్తుంది. ఆ తరవాత కాలానికి పార్లమెంటు అనుమతి లేకుండా ప్రభుత్వం ఖర్చు చేయడానికి వీలు ఉండదు. ఆ తరవాతి కాలం అంటే 2024-25 బడ్జెట్. 2024 ఏప్రిల్ 1న ఆరంభమై 2025 మార్చి 31 నాటికి ముగుస్తుంది. అయితే 2024 ఏప్రిల్ లేదా మే నెలలో ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు పాత సర్కారు ఉండొచ్చు. అదేసమయంలో రాబోయే ఆర్థిక సంవత్సర మొత్తానికి పూర్తికాలం బడ్జెట్‌ను ప్రవేశపెట్టే నైతిక హక్కు మాత్రం ఉండదు. ఆ కారణంగా కొత్త ప్రభుత్వం ఏర్పడే లోపు పెట్టాల్సిన ఖర్చుల కోసం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి పార్లటమెంటు అనుమతి తీసుకుంటారు. సాధారణంగా రెండు నెలల కోసం ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రవేశపెడతారు. ఈ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన తరవాత చర్చ జరిపి ఆమోదం తెలుపుతారు. ఓట్ ఆన్ అకౌంట్ పై నిజానికి ఎలాంటి చర్చ లేకుండానే పార్లమెంటు ఆమోదం తెలుపవచ్చు. ఓట్ ఆన్ అకౌంట్‌లో పన్నుల్లో మార్పు చేయరు. కేవలం రెండు నెలల ఖర్చుల వివరాలు తెలిపి పార్లమెంటు ఆమోదం తీసుకుంటారు.



డా.ఎం.ఎ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, హైదరాబాద్.

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

లెటర్ సిరీస్

పార్ట్-2

1. c c-c-a-b- - b - cb - c - acc
(ఎ) acaaabbc
(బి) aaaabbcc
(సి) aabbccaa (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: ఆప్షన్(ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన ప్రశ్న కింది విధంగా ఉంటుంది.

c c a c c / a a b a a / b b c b b / c c a c c

మొదటి సమూహంలో నాలుగు c లు, రెండో సమూహంలో నాలుగు aలు, మూడో సమూహంలో నాలుగు bలు ఉన్నాయి. మొదటి సమూహంలో నాలుగు 'c'లకు మధ్య a, రెండో సమూహంలో నాలుగు 'a'లకు మధ్య b, మూడో సమూహంలో నాలుగు 'b' లకు మధ్య 'c' ఉంది. ఈ విధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు acaaabbc.

2. a - bb - cb - cca - cc - ab -
(ఎ) aaabbc (బి) acbaab
(సి) aabbac (డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్(బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

a a b b c c / b b c c a a / c c a a b b

మొదటి సమూహంలో చివరి నాలుగు అక్షరాలు రెండో సమూహంలో మొదటి నాలుగు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. అదే విధంగా రెండో సమూహంలోని చివరి నాలుగు అక్షరాలు మూడో సమూహంలో మొదటి నాలుగు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు acbaab.

3. L - NMN - N - ML - N
(ఎ) MLLM (బి) LMLM
(సి) MLML (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: ఆప్షన్(ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

L M N / M N L / N L M / L M N

మొదటి సమూహంలోని చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలోని మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదేవిధంగా రెండో సమూహంలోని చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ఈవిధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు MLLM

4. a - c - d - abca - ba - cb
(ఎ) bcddd (బి) dbcdd
(సి) ddbcd (డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్(బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

a d c b / d c a b / c a d b / a d c b

మొదటి సమూహంలో మధ్య రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా మొదటి సమూహంలో మొదటి, చివరి అక్షరాలు రెండో సమూహంలో మూడో, నాలుగో అక్షరాలుగా ఏర్పడ్డాయి. అదే విధంగా రెండో సమూహంలోని మధ్య రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి, చివరి అక్షరాలు మూడో సమూహంలో మూడో, నాలుగో అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు dbcdd

5. P - QP - R - QR - SR - P - QP - PP
(ఎ) PQPSQRQ (బి) PPQQPRS
(సి) PQPQQRS (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: ఆప్షన్(ఎ)లోని అక్షరాలను ప్రశ్నలో ఇచ్చిన ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

P / P Q / P Q R / P Q R S / S R Q P / R Q P / Q P / P

మొదటి సమూహంలో ఒక అక్షరం, రెండో సమూహంలో రెండు అక్షరాలు, మూడో సమూహంలో మూడు అక్షరాలు, నాలుగో సమూహంలో నాలుగు అక్షరాలు ఉన్నాయి. అయిదో సమూహంలో నాలుగో సమూహంలో గల అక్షరాల రివర్స్, ఆరో సమూహంలో మూడో సమూహంలోగల అక్షరాల రివర్స్, ఏడో సమూహంలో రెండో సమూహంలో గల అక్షరాలు రివర్స్, ఎనిమిదో సమూహంగా మళ్లీ మొదటి అక్షరమే ఉంది. ఈ విధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు PQPSQRQ

a c d b / d a b c / b d c a / c b a d / a c d b

మొదటి సమూహంలో మూడో, ఒకటో అక్షరాలు రెండో సమూహంలో ఒకటో, రెండో అక్షరాలుగా, మొదటి సమూహంలో నాలుగో, రెండో అక్షరాలు రెండో సమూహంలో మూడో, నాలుగో అక్షరాలుగా ఏర్పడ్డాయి. అదే విధంగా రెండో సమూహంలో మూడో, నాలుగో అక్షరాలుగా ఏర్పడ్డాయి. అదేవిధంగా రెండో సమూహంలో, మూడో, ఒకటో అక్షరాలు మూడో సమూహంలో ఒకటో, రెండో అక్షరాలుగా, రెండో సమూహంలో నాలుగో రెండో అక్షరాలు మూడో సమూహంలో మూడో, నాలుగో అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు cacdab-dd

6. a - cabc - b - a - ca - ca
(ఎ) abbbc (బి) abbcb
(సి) bacbb (డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: ఆప్షన్(సి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

a b c a / b c a b / c a b c / a b c a

a b c a / b c a b / c a b c / a b c a

ప్రతి సమూహంలోను అండర్‌లైన్ చేసిన మొదటి మూడు అక్షరాలైన abc / bca / cab / abc. కింది పద్ధతిని అనుసరించి ఏర్పడ్డాయి.

మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు, మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ప్రతి సమూహంలో మొదటి అక్షరమే మళ్లీ చివరి అక్షరంగా రిపీట్ అయినది. ఈ విధంగా ఒక కచ్చితమైన క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bacbb

7. a - d - bca - - a - c - cd - b -
(ఎ) cacdbaac (బి) aaabcccd
(సి) acaccabd (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: ఆప్షన్(ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

a c d a b c / a c d a b c / a c d a b c

ఈ సిరీస్‌లో acdabc అను ఆరు అక్షరాల సమూహం మూడుసార్లు ఏర్పడింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు cacd-baac

8. a - dbd - b - b - c - c - a - ac - b
(ఎ) abadacdd (బి) cacdabdd
(సి) aabccddd (డి)ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్(బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

9. P - P - Q - Q - QP - Q Q Q
(ఎ) QQPQQ (బి) QQQPQ
(సి) QPQQQ (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: ఆప్షన్(ఎ)లోని అక్షరాలను ఇవ్వబడిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ ఈ క్రింది విధంగా ఉంటుంది.

P Q / P Q Q / P Q Q Q / P Q Q Q Q

మొదటి సమూహంలో రెండు అక్షరాలు, రెండో సమూహంలో మూడు అక్షరాలు, మూడో సమూహంలో నాలుగు అక్షరాలు నాలుగో సమూహంలో అయిదు అక్షరాలు ఉన్నాయి. అంతే కాక రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను ముందు సమూహంలోని అక్షరాలే ఉంటూ ఒక 'Q' అదనంగా చేరింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు QQPQQ

10. - abb - c - c - a - b
(ఎ) aabac (బి) abcaa
(సి) aaabc (డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్(బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

a a b / b b c / c c a / a a b

ప్రతి సమూహంలోను మొదటి రెండు అక్షరాలు ఒకటే.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు abcaa



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ



ఒకప్పుడు రాజు-పేద తదుపరి భూస్వామి-పేద రైతు, మరికొంత కాలానికి యజమాని-కార్మికుడు ఇలా ఆర్థిక అంతరాలు అనాదిగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ప్రజలంతా త్రాసుకు ఒకవైపు ఉంటారు. రెండో వైపు ఉండే కొద్దిమంది నిరంతరం సంపన్నులవుతూనే ఉంటున్నారు. గతంలో నెమ్మదిగా పెరిగిన ఆర్థిక అంతరాలు ఇప్పుడు రోజూ కొన్ని రెట్ల వేగంతో దూసుకుపోతున్నాయి. పేదలు మరింత పేదరికంలోకి జారిపోతుండగా వారివద్ద నుంచి కార్పొరేట్‌లు దోచుకొంటున్న సంపద వారిని మరింత సంపన్నులుగా చేస్తోంది. ఈ అంతరాల ధోరణులను అలాగే దేశాల మధ్య, దేశాలవారీ, వర్గాలవారీ ఏర్పడుతున్న ఆర్థిక అంతరాలను విపులీకరిస్తూ దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సు తొలి రోజున ఆక్స్‌ఫాం ఇంటర్నేషనల్ సంస్థ 'ఇనీక్వాలిటీ ఇంక్: హౌ కార్పొరేట్ పవర్ డివైడ్స్ అవర్ వరల్డ్ అండ్ ద నీడ్ ఫర్ ఏ న్యూ ఎరా ఆఫ్ పబ్లిక్ యాక్షన్' పేరిట ఒక నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో వేగంగా విస్తరిస్తున్న ఆర్థిక అంతరాలు, దానికి గల కారణాలు, పరిష్కార మార్గాలు చర్చించారు. అంతేకాక భారతదేశ పరిస్థితులకు అద్దంపడుతూ 'సర్వైవల్ ఆఫ్ ద రిచ్చెస్ట్:ద ఇండియా స్టోరీ' పేరుతో ప్రత్యేక నివేదికను సైతం ఆక్స్‌ఫామ్ ఇండియా సంస్థ విడుదల చేసింది.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

అసమానతలకు అద్దం పట్టిన ఆక్స్‌ఫామ్ నివేదిక

ఆక్స్‌ఫామ్ ప్రపంచ ఆర్థిక అంతరాల నివేదిక

ప్రపంచం-ఆర్థిక అంతరాల ధోరణులు

- 2020 నుంచి అంటే గడచిన మూడేళ్లలో ప్రపంచంలోనే అత్యంత ధనవంతులైన తొలి అయిదుగురి సంపద రెండింతలైంది. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా 500 కోట్లమంది అంటే ప్రపంచ జనాభాలో 60 శాతం మంది మరింత పేదరికంలోకి కూరుకుపోయారు.
- ప్రస్తుత ధరల్లో చూస్తే ప్రపంచంలోని పేదరికం అంతం కావడానికి 230 ఏళ్లు పట్టగా మరో పదేళ్లలో తొలి ట్రిలియనీర్ ఆవిర్భవించనున్నారు.
- గ్లోబల్ కార్పొరేట్‌లు ఏకస్వామ్య శక్తులుగా అవతరించి భారీ స్థాయిలో సంపదను పోగుచేయడం అనేది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అధిక అసమానతలకు కారణమైంది.
- ప్రపంచంలో పది అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఏడింటి సీఈఓలు/ప్రధాన షేర్‌హోల్డర్లు బిలియనీర్లుగా ఉన్నారు.
- ప్రపంచంలోని 96 ప్రధాన కంపెనీలు ఆర్జిస్తున్న ప్రతి వంద డాలర్ల లాభంలో 82 డాలర్లు యాజమాన్యానికే(సంపన్న షేర్ హోల్డర్స్‌కే) దక్కుతోంది.
- ప్రపంచంలోని బిలియనీర్లు 2020తో పోలిస్తే 3.3 ట్రిలియన్ డాలర్ల అదనపు సంపద పోగేసుకున్నారు. ఈ మూడేళ్లలో 34 శాతం మంది మరింత సంపన్నులుగా ఆవిర్భవించారు. ప్రపంచ తొలి అయిదుగురు సంపన్నులైన ఎలాన్‌మస్క్, బెర్నార్డ్ ఆర్నాల్డ్, జెఫ్‌బెజోస్, లారీ ఎలిసన్, మార్క్‌జుకర్‌బర్గ్‌ల సంపద గడచిన మూడేళ్లలో 464 బిలియన్ డాలర్లు పెరిగింది. ఇదే సమయంలో కరోనా, ఆర్థిక మాంద్య పరిస్థితుల పేరిట వీరి సంస్థలైన అమెజాన్, ఫేస్‌బుక్ వంటివాటిలో భారీగా ఉద్యోగులను తొలగించారు. గడచిన మూడేళ్లలో కరోనా, యుద్ధాలు, జీవన వ్యయాల సంక్షోభం, పర్యావరణ విఘాతం వంటి ఒడుదొడుకులకు సామాన్యులను గురిచేస్తూ 'డికేడ్ ఆఫ్ డివిజన్(అంతరాల దశాబ్దం)'కు నాంది పడింది. ఈ కాలంలో సంభవించిన ప్రతి సంక్షోభం జనాభాలో అధికంగా ఉన్న పేద వర్గాలను మరింత పేదరికంలోకి నెట్టి కొద్ది మంది చేతుల్లో ఉన్న సంపదను మరింత పెంచింది.
- ఈ ఆర్థిక అంతరాలు ప్రపంచ జనాభాలోనే కాదు ప్రపంచ దేశాల మధ్య కూడా విస్తరించాయి. గ్లోబల్ నార్త్ అంటే సంపన్న దేశాలుగా పిలిచే ఉత్తరార్థ గోళ పాశ్చాత్య దేశాల్లో సంపద మొత్తం కేంద్రీకృతమయింది. ప్రపంచ జనాభాలో కేవలం 21 శాతం మంది నివశించే ఈ ప్రాంతంలో 69 శాతం వ్యక్తిగత సంపద, 74 శాతం ప్రపంచ బిలియనీర్ల సంపద వచ్చి చేరింది. గడచిన 25 ఏళ్లలో తొలిసారి గ్లోబల్ నార్త్-గ్లోబల్ సౌత్ మధ్య అంతరాలు భారీగా పెరిగాయి.
- తక్కువ ఆదాయ, దిగువ మధ్య ఆదాయ దేశాలు ఎదుర్కొంటున్న ఇంధన, ఔషధ, ఆహార దిగుమతుల వ్యయాల కోసం చేస్తున్న రుణాలకు రాబోయే 2029 నాటికి రోజూ 50 కోట్ల డాలర్ల మేర వడ్డీ చెల్లింపులు చేయాల్సి ఉంటుందని అంచనా. ఇది ఆయా దేశాల బలహీన వర్గాలు, మహిళా సంక్షేమంపై మరింత ప్రతికూల ప్రభావం చూపనుందని అంచనా!
- ప్రపంచవ్యాప్తంగా మహిళల కంటే పురుషులు 105 ట్రిలియన్ డాలర్ల ఎక్కువ సంపదతో ఉన్నారు. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు నాలుగింతలు ఎక్కువ. ఆరోగ్య, సామాజిక రంగాల్లో పనిచేసే ఒక మహిళ మొత్తం సంపాదన, ఒక ఫార్చ్యూన్ 100 కంపెనీలోని సీఈఓ వార్షిక వేతనంతో సరితూగాలంటే 1200 ఏళ్లు పడుతుంది. వివిధ వర్గాల పరంగా తీసుకుంటే అమెరికాలో నివసించే సాధారణ నల్ల జాతి కుటుంబం సంపద, సాధారణ శ్వేత జాతి కుటుంబ సంపదలో 15.8 శాతం మాత్రమే ఉంటుంది. బ్రెజిల్‌లో నల్లజాతి ప్రజలతో పోలిస్తే శ్వేతజాతీయుల సంపాదన 70 శాతం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచవ్యాప్త ఆస్తుల్లో 43 శాతం వరకు కేవలం ఒక శాతం సంపన్నుల చేతిలో ఉంది. అదేవిధంగా మధ్య ప్రాచ్యంలో ఒక శాతం మంది సంపన్నులకు 48 శాతం ఆర్థిక సంపద ఉండగా ఆసియాలో ఒకశాతం మంది సంపన్నులకు 50 శాతం సంపద, యూరప్‌లో ఒక శాతం మంది సంపన్నులకు 47 శాతం సంపద ఉంది.

> తక్కువ ఆదాయ, దిగువ మధ్య ఆదాయ దేశాలు ఎదుర్కొంటున్న ఇంధన, ఔషధ, ఆహార దిగుమతుల వ్యయాల కోసం చేస్తున్న రుణాలకు రాబోయే 2029 నాటికి రోజూ 50 కోట్ల డాలర్ల మేర వడ్డీ చెల్లింపులు చేయాల్సి ఉంటుందని అంచనా.

ఏకస్వామ్యాల యుగం-కార్పొరేట్ శక్తుల విజృంభణ

- సంపద కేంద్రీకరణ-కార్పొరేట్ సామ్రాజ్యాలు-ఏకస్వామ్య ధోరణులు పరస్పర పూరకాలుగా పనిచేస్తూ ఒక వలయంగా ఏర్పడి ఆర్థిక అంతరాలు మరింత పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి. బడా కార్పొరేట్ సంస్థలు తమ ఆర్థిక విధానాలతో చిన్న సంస్థలను అణచివేస్తూ ఏకస్వామ్యాలను స్థాపిస్తున్నాయి. ప్రభుత్వ పాలసీలు సైతం సరళీకరించడంతో అన్ని రంగాల్లో ఏకీకృత ధోరణులు పెరిగి లాభాల ఆర్జనే పరమావధిగా మారింది. ఆ లాభాల్లో ఉద్యోగులకు, పన్నుల రూపంలో ప్రభుత్వాలకు అతి తక్కువ వాటా చేరుతోంది. అత్యధిక భాగం కార్పొరేట్ యాజమాన్యాలకు దక్కుతూ ఏకీకృత ధోరణులు బలపడడానికి దోహదమవుతోంది. పోటీ పెద్దగా లేకపోవడం, ప్రభుత్వపర నియంత్రణ లేకపోవడం వల్ల ధరల నియంత్రణ, మార్కెట్ నియంత్రణ లేక ఉత్పత్తి వ్యయం కన్నా అనేక రెట్లు ఎక్కువ ధర నిర్ణయమవుతోంది. సంపద మొత్తం కొందరి చేతుల్లోకే తరలిపోతుంది. ఉదాహరణకు 1995-2015 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా 60 ఫార్మాస్యూటికల్ కంపెనీలు విలీనమై పది అతిపెద్ద ఫార్మా ఫర్మ్‌గా అవతరించాయి. ప్రపంచ విత్తన మార్కెట్‌లో 40 శాతం పైనే రెండు కంపెనీలకు ఉంది. నాలుగింట మూడొంతుల ఆన్‌లైన్ ప్రకటనల ఆదాయం అంతా మెటా, అమెజాన్, ఆల్ఫాబెట్‌లకే చేరుతోంది. 90 శాతం ఆన్‌లైన్ సెర్చ్ గూగుల్ ద్వారానే సాగుతోంది. ఈ విధంగా భారీ టెక్ కంపెనీలు టెక్నాలజీ రంగంలో ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి.
- వ్యవసాయ రంగంలో అధిక భాగం బహుళ జాతి ఆహార ప్రాసెసింగ్ కంపెనీల చేతుల్లో; భారత పారిశ్రామిక రంగం అంతా అయిదు అతి పెద్ద సంస్థల చేతుల్లో కేంద్రీకృతమైంది. ఈ ధోరణి వల్ల శక్తి, ఆహారం, ఔషధ రంగాల్లో తీవ్రంగా ధరల దోపిడీ కొనసాగుతోంది. ఇతర చిన్నపాటి సంస్థలు ఎదిగి పోటీ ఇచ్చేందుకు అవకాశం లేకుండా ఆర్థిక నిధులు, రుణ వసతులను సైతం బడా కంపెనీలే చేజిక్కించుకుంటున్నాయి.

అసమానతలకు కారణమయ్యే కార్పొరేట్ ధోరణులు

శ్రామికులకు దక్కని ప్రతిఫలం

- బడా కార్పొరేటర్లు శ్రామికులకు/ఉద్యోగులకు కనీసం జీవన వ్యయాలను సైతం చెల్లించకుండా శ్రమదోపిడీ చేస్తూ లాభాలను అల్ట్రారిచ్ వ్యాపార భాగస్వాముల మధ్య పంచుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 1600 అతిపెద్ద కంపెనీల్లో కేవలం 0.4 శాతం మాత్రమే తమ ఉద్యోగులకు కనీసం జీవన వ్యయానికి అవసరమైన వేతనాలు అందిస్తున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా 80 కోట్లమంది శ్రామికులు ద్రవ్యోల్బణాన్ని అధిగమించే స్థాయి వేతనాన్ని పొందలేకపోతున్నారు. ఈ వేతన వ్యత్యాసం అనేది లింగ, జాతిపరంగా ఎక్కువగా ఉంది. 2019లో పురుష కార్మికులతో పోలిస్తే వారి ప్రతి డాలర్ ఆదాయానికి మహిళ కార్మికులు కేవలం 51 సెంట్లు మాత్రమే పొందారు. వ్యవసాయ రంగం, సప్లయ్ చెయిన్లలో ఈ వివక్ష మరీ ఎక్కువగా ఉంది. ప్రమాదకర పని పరిస్థితుల కారణంగా ఏటా 2.3 మిలియన్‌ల మంది కార్మికులు పని సంబంధిత వ్యాధులు, ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నారు.
- లేబర్ యూనియన్‌లను కార్పొరేట్ సంస్థలు ఉక్కుపాదంతో అణచి వేయడం; కార్మిక చట్టాలు, బాల కార్మిక చట్టాలను సరళం చేస్తూ ప్రభుత్వాలు సవరణలు తీసుకు రావడం వల్ల కూడా ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి.

మిగతా రేపటి పేజీలో..



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఇల్లు పెద్దగా..



హైదరాబాద్‌లోనే వైశాల్యం అధికం

11 శాతం పెరిగిన సగటు ఫ్లాట్ విస్తీర్ణం

కస్టమర్ల అభిరుచికే బిల్డర్ల ప్రాధాన్యం

న్యూఢిల్లీ: మారిన కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా దేశంలోని ప్రధాన నగరాల్లో బిల్డర్లు పెద్ద ఇళ్ల నిర్మాణానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కారణంగా దేశంలోని ఏడు అగ్రశ్రేణి నగరాల్లో నిర్మాణం అయిన, నిర్మాణంలో ఉన్న ఫ్లాట్ల సగటు విస్తీర్ణం 2023 సంవత్సరంలో 11 శాతం పెరిగిందని అనరాక్ అధ్యయనంలో తేలింది. ఏడు నగరాల్లోని ప్రాథమిక రెసిడెన్షియల్ మార్కెట్లలో ఇళ్ల సరఫరా గురించి రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ అనరాక్ అధ్యయనం చేసింది. గత ఏడాది లగ్జరీ ఇళ్ల సరఫరా గణనీయంగా పెరిగిందని ఆ అధ్యయనంలో తేలింది. కొత్త ప్రాజెక్టుల్లో 23 శాతం లగ్జరీ శ్రేణిలోనే ఉన్నాయి. ఏడు ప్రధాన నరాల్లో ఫ్లాట్ సగటు విస్తీర్ణం 2022తో పోలిస్తే 1175 చదరపు అడుగుల నుంచి 1300 చదరపు అడుగులకు (ఎస్ఎఫ్‌టీ) పెరిగిందని ఆ నివేదిక తెలిపింది. అయితే ముంబై మెట్రోపాలిటన్ రీజిన్ (ఎంఎంఆర్), కోల్కతా మాత్రం ఈ విషయంలో వెనుకబడి ఉన్నాయి. ఆ నగరాల్లో సగటు విస్తీర్ణం తగ్గింది. మిగతా నగరాలు ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు, హైదరాబాద్, పుణె, చెన్నైలలో మాత్రం విస్తీర్ణం పెరిగింది. అన్ని నగరాల్లోనూ ఫ్లాట్ల సగటు విస్తీర్ణం గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతూ వస్తోంది. ఇది 2019లో 1050 ఎస్ఎఫ్‌టీ ఉండగా 2020లో 1167 ఎస్ఎఫ్‌టీ, 2021లో 1170 ఎస్ఎఫ్‌టీకి చేరింది. ఈ 7 నగరాల్లోనూ పెరిగిన ఇళ్ల ధరల ప్రభావం డిమాండుపై ఏ మాత్రం లేదని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి అన్నారు. వాస్తవానికి మహమ్మారి కాలంలో సువిశాలమైన ఫ్లాట్లకు డిమాండు పెరగడం మొదలయింది. ఆ తర్వాత గత మూడు సంవత్సరాల కాలంలో డిమాండు ఏ మాత్రం తగ్గకపోగా పెద్ద ఫ్లాట్ల కొనుగోలు ఒక అలవాటుగా మారిందని చెప్పారు.

ఫ్లాట్ల వైశాల్యం విషయంలో హైదరాబాద్ అగ్ర స్థానంలో ఉంది. ఇక్కడ 2022లో ఫ్లాట్ల సగటు వైశాల్యం 1775 ఎస్ఎఫ్‌టీ ఉండగా 2023లో అది 2300 ఎస్ఎఫ్‌టీకి పెరిగింది. అంటే వైశాల్యంలో వృద్ధి 30 శాతం ఉంది. దేశం మొత్తం మీద ఇంత విశాలమైన ఫ్లాట్లను కోరుకుంటున్నది హైదరాబాద్ వాసులే. అయితే ఫ్లాట్ల సగటు విస్తీర్ణం వృద్ధిలో మాత్రం ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రథమ స్థానంలో ఉంది. అక్కడ సగటు విస్తీర్ణం 2022తో పోల్చితే 37 శాతం పెరిగి 1375 ఎస్ఎఫ్‌టీ నుంచి 2023లో 1890 ఎస్ఎఫ్‌టీకి చేరింది.

25 రోజులు, రూ.24,734 కోట్లు

జనవరిలో ఎఫ్‌పీఐల అమ్మకాల హోరు

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో ఎఫ్‌పీఐలు మళ్లీ అమ్మకాల జోరు పెంచారు. డిసెంబరు నెలలో వారు భారత మార్కెట్లో రూ.66,134 కోట్ల నికర పెట్టుబడులు పెట్టగా ఈ నెల 25 నాటికి రూ.24,734 కోట్ల విలువైన షేర్లను తెగనమ్మేశారు. వీరితో పాటు రిటైల్, హైనెట్‌వర్త్ మదుపరులూ మిడ్ అండ్ స్మాల్ క్యాప్ స్టాక్స్‌ను అమ్మేస్తూ, మార్కెట్‌ను మరింత అనిశ్చితిలోకి నెట్టేస్తున్నారు. దీంతో గత రెండు వారాలుగా దేశీయ స్టాక్ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. ఎఫ్‌పీఐలు ఈ వారంలోనూ అమ్మకాల హోరు కొనసాగించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

ఎందుకంటే...: పదేళ్ల కాల పరిమితి ఉండే అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలపై వడ్డీరేట్లు తగ్గినట్టే తగ్గి, మళ్లీ 4.18 శాతానికి చేరాయి. దీంతో ఈ ఏడాది జూలై తర్వాత గానీ అమెరికా కేంద్రబ్యాంకు వడ్డీరేట్లు తగ్గించదని స్పష్టమవుతోంది. భారత్ వంటి వర్ధమాన దేశాల ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే, ఎఫ్‌పీఐలకు ప్రస్తుతం అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలు సురక్షితంగా, ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. దీంతో వారు ఇక్కడ ఈక్విటీ షేర్లను అమ్మి, ఆ మొత్తాన్ని అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల్లో మదుపు చేస్తున్నారు. ఒకవేళ మన దేశంలో మదుపు చేయాల్సి వచ్చినా, కేంద్ర ప్రభుత్వ రుణ పత్రాల్లో మాత్రమే మదుపు చేస్తున్నారు. జనవరిలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి చేరడంతో లాభాలస్వీకరణ అమ్మకాలూ ఇందుకు తోడయ్యాయి.

కస్టమర్ రేటింగ్‌లో లవ జోరు

న్యూఢిల్లీ: కస్టమర్ రేటింగ్‌లో దేశీయ స్మార్ట్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు లవ, క్యూబో అంతర్జాతీయ బ్రాండ్లతో పోటీ పడుతున్నాయి. మార్కెట్ అనాల్సిస్ కంపెనీ టెక్‌ఆర్క్ బ్రాండ్ ఆమోదనీయత నివేదికను విడుదల చేసింది. ఇ-కామర్స్ వేదికలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లపై 25 బ్రాండ్లకు చెందిన 35 విభిన్న ఉత్పత్తులపై డిసెంబరులో కస్టమర్లు ఇచ్చిన రేటింగ్ తీరుతెన్నులను ఈ సంస్థ అధ్యయనం చేసింది. అంతర్జాతీయ బ్రాండ్లయిన రియల్ మీ, రెడ్ మీ వంటివి పొందిన సగటు వెయిటెజ్ రేటింగ్ 4.3 ఉండగా లవ 4.2 రేటింగ్ సాధించింది. అంటే ఆ బ్రాండ్లకు గట్టి పోటీదారుగా మారింది. లవకు అత్యున్నత రేటింగ్ (4, 5) 90.2 శాతం ఉండగా గ్లోబల్ బ్రాండ్లకు అది 75.8 శాతం ఉంది. ఇక ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగంలో హీరో గ్రూప్ కంపెనీ క్యూబోను పరిగణనలోకి తీసుకుంది. పరిశ్రమ సగటు రేటింగ్ 4 ఉండగా క్యూబో 4.1 రేటింగ్ పొందింది.

ప్రముఖ బ్యాంకర్ రాణా తల్వార్ కన్నుమూత



న్యూఢిల్లీ: ప్రముఖ బ్యాంర్ రాణా తల్వార్ కన్ను మూశారు. ఆయన వయసు 76 సంవత్సరాలు. ఆయన స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌కు సారథ్యం వహించడం ద్వారా ఒక అంతర్జాతీయ బ్యాంకుకు సారథ్యం వహించిన తొలి భారతీయుడుగా గుర్తింపు పొందారు. ఆయన డీఎల్ఎఫ్ గ్రూప్ చైర్మన్ కేపీ సింగ్ అల్లుడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. డీఎల్ఎఫ్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న తల్వార్ శనివారం మరణించారని కంపెనీ ఒక రెగ్యులేటరీ ప్రకటనలో తెలిపింది.

21660 పైన బుల్లిష్

(జనవరి 29-ఫిబ్రవరి 2 తేదీల మధ్య వారానికి)

టెక్ వ్యూ



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 21353 (-224)

నిఫ్టీ గత వారం 21750-21137 పాయింట్ల మధ్యన కదలాడి 224 పాయింట్ల నష్టంతో 21353 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 21660 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21545, 21010, 19997, 19555 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 21750 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 21050

నిరోధ స్థాయిలు: 21555, 21655, 21755 (21455 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 21155, 21055, 20955 (21255 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ		విజయవాడ	530
హైదరాబాద్	540	విశాఖపట్నం	565
29 జనవరి		వరంగల్	542
చిత్తూరు	573	డజను గుడ్లు రూ.72	
గోదావరి	530		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	గోదావరి	111
వరంగల్	107	విజయవాడ	111
కరీంనగర్	107	గుంటూరు	112
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	112
కర్నూలు	107	చిత్తూరు	120
విశాఖపట్నం	108		

ఈ వారంలోనూ ఆటుపోట్లే

దేశీయ స్టాక్ మార్కెట్ గత రెండు వారాలుగా నష్టాల బాట పట్టింది. ఈ వారంలో కూడా సూచీలు తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మార్కెట్‌లో కొనసాగుతున్న బేరిష్‌నెస్, దిద్దుబాటు ఇందుకు కారణాలుగా చెప్పవచ్చు. టెక్నికల్‌గా చూస్తే నిఫ్టీకి ఈ వారం 21,000 పాయింట్ల వద్ద గట్టి మద్దతు కనిపిస్తోంది. మదుపరులు ఆకర్షణీయ ధరలో దొరుకుతున్న బ్యాంకింగ్, ఫార్మా, ఐటీ కంపెనీల షేర్లపై దృష్టి పెట్టడం మంచిది.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు

అంబుజా సిమెంట్స్: మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుంటాయన్న అంచనాతో ఈ కౌంటర్లో మూమెంటమ్ పెరుగుతోంది. గత వారం ఈ షేరు ధర ఏకంగా 6.2 శాతం పెరిగి రూ.560 వద్ద క్లోజైంది. రూ.625/660 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.550 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.530ని కచ్చితంగా స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సంవర్ధన్ మదర్సన్ లిమిటెడ్ : ఈ కౌంటర్లో గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమైన అప్‌ట్రెండ్‌కు ఈ ఏడాది జూలైలో తెర పడింది. ఆ తర్వాత ఈ కౌంటర్లో మంచి కన్సాలిడేషన్ జరిగింది. మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుంటాయనే అంచనాతో ఈ కౌంటర్లో మళ్లీ అప్‌ట్రెండ్ కనిపిస్తోంది. గత వారం చివరి రెండు సెషన్స్‌లోనే ఈ కంపెనీ షేర్లు 12 శాతం పెరిగాయి. మదుపరులు రూ.140/165 టార్గెట్‌తో రూ.113-110 శ్రేణిలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.104ని గట్టి స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

బజాజ్ ఆటో: దిద్దుబాటుకు తావు లేకుండా ఈ కౌంటర్‌లో సుదీర్ఘ అప్‌ట్రెండ్ కొనసాగుతోంది. దీంతో మదుపరులు ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకునేందుకు ఎగబడుతున్నారు. గురువారం ఏకంగా 5.33 శాతం లాభంతో రూ.7,210 వద్ద క్లోజైంది. రూ.7,850/7,950 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.7,400/7,509 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.7,250ని స్ట్రిక్ట్ స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా పవర్: సుదీర్ఘ కాలం దిద్దుబాటు తర్వాత టాటా పవర్ కౌంటర్లో స్థిరత్వం కనిపిస్తోంది. నిరుడు జూన్‌లో ప్రారంభమైన అప్‌ట్రెండ్ ఇంకా కొనసాగుతోంది. బడ్జెట్‌లో పునరుత్పాదక ఇంధనానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందనే అంచనాలూ ఇందుకు తోడయ్యాయి. శుక్రవారం రూ.365 వద్ద క్లోజైన ఈ కౌంటర్లో మదుపరులు రూ.390/410 టార్గెట్‌తో రూ.360 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.345ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పీఎన్‌బీ: ప్రస్తుతం ఈ బ్యాంకు షేర్లు పరుగులు పెడుతున్నాయి. జెఫరీస్ సంస్థ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేయడం, మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండడం ఇందుకు ప్రధాన కారణాలు. గత వారం రూ.104 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.115/135 టార్గెట్‌తో రూ.103 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.95ని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పాటించాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ: మద్దతు స్థాయిలకు చేరువలో...



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం బలమైన కరెక్షన్‌లో ప్రారంభమై కనిష్ఠ స్థాయిలకు చేరువలో బలహీనంగా ముగిసింది. కేవలం మూడు రోజులే జరిగిన ట్రేడింగ్‌లో సుమారు 220 పాయింట్ల మేరకు నష్టపోయింది. అయితే 21150 వద్ద మైనర్ రికవరీ కనిపించింది. గత నాలుగు వారాల్లో కరెక్షన్ ట్రెండ్‌లో కదలాడిన మార్కెట్ టెక్నికల్ ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకుంటోంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 21000 కన్నా పైనే ఉన్నందు వల్ల స్థూల ట్రెండ్ మాత్రం ఇప్పటికీ సానుకూలంగానే ఉంది. టెక్నికల్‌గా సాధారణ స్వల్పకాలిక కరెక్షన్ పూర్తయినట్టు కనిపిస్తోంది. మరోసారి స్వల్పకాలిక అప్‌ట్రెండ్ సంకేతాలు ఇవ్వాలంటే రాబోయే కొద్ది రోజుల్లో ప్రస్తుత స్థాయిల్లో బలం ప్రదర్శించాల్సి ఉంది. ప్రస్తుతం మైనర్ రికవరీని మరింతగా కొనసాగిస్తూ స్వల్పకాలిక నిరోధం 21500 వద్ద పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం 21500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన ప్రధాన స్వల్పకాలిక నిరోధం 21800. ఆ పైన నిలదొక్కుకుంటే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశిస్తుంది. మరో ప్రధాన నిరోధం 22100.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించి 21200 వద్ద విఫలమైతే మైనర్ అప్రమత్తతను సూచిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 20900. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింత కొనసాగవచ్చు.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ ముందు వారంతో పోల్చితే గత వారం 1200 పాయింట్ల మేరకు, గత కొద్ది వారాల్లో 3800 పాయింట్ల మేరకు నష్టపోయింది. పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 45500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో నిరోధం 46200. బలహీనతలో పడి మద్దతు స్థాయి 44500 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా ఉంటుంది.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 25 డీఎంఏ కన్నా స్వల్పంగా దిగువన ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడ పునరుజ్జీవం సాధించాలి. అలాగే 50 డీఎంఏ కన్నా స్వల్పంగా పైన ఉంది. సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో ఇక్కడ కన్సాలిడేట్ కావాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	21440, 21500
మద్దతు	21340, 21270

www.sundartrends.in

స్పోర్ట్స్

అర్శిన్ అదిరే శతకం

అండర్ -19 వరల్డ్‌కప్

- నమన్‌కు 4 వికెట్లు
- యూఎస్‌పై భారత్ ఘన విజయం



బ్లూమ్‌ఫోంటీన్: అర్శిన్ కులకర్ణి (108) శతకంతోపాటు నమన్ తివారి (4/20) నాలుగు వికెట్లతో విజృంభించడంతో.. అండర్-19 వరల్డ్‌కప్ లీగ్ దశను భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. తొలి రెండు వన్డేల్లో నెగ్గి ఈపాటికే సూపర్-6 బెర్త్‌ను ఖరారు చేసుకొన్న భారత్.. వరుసగా మూడో విజయంతో గ్రూప్-ఎ టాపర్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మూడో, ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 201 పరుగుల తేడాతో అమెరికాను చిత్తు చేసింది. తొలుత భారత్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 326 పరుగుల భారీస్కోరు చేసింది. కులకర్ణి, ముషీర్ (73) రెండో వికెట్‌కు 155 పరుగులు జోడించారు. కెప్టెన్ ఉదయ్ సహరన్ (35), ప్రియాన్షు (27), సచిన్ దాస్ (20) దూకుడుగా ఆడారు. ఛేదనలో యూఎస్ ఓవర్లన్నీ ఆడి 125/8 స్కోరు మాత్రమే చేసింది. ఇదే గ్రూప్ నుంచి బంగ్లాదేశ్, ఐర్లాండ్ సూపర్-6కు అర్హత సాధించాయి.

దివ్యాన్ష్ రికార్డు పసిడి



కైరో (ఈజిప్టు): భారత స్టార్ షూటర్ దివ్యాన్ష్‌సింగ్ పవార్ ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో ప్రపంచ రికార్డు ప్రదర్శనతో స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. ఆదివారం ఇక్కడ జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో దివ్యాన్ష్ 253.7 పాయింట్లు స్కోరు చేసి.. గతేడాది ఆసియా క్రీడల్లో షెంగ్ లియావో (చైనా) 253.3 స్కోరుతో నమోదుచేసిన వరల్డ్ రికార్డును బద్దలుకొట్టాడు.

రన్నరప్.. గుకేష్

విజ్కాన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ గుకేష్ రన్నరప్‌తో సరిపెట్టుకొన్నాడు. 13వ రౌండ్ అనంతరం జరిగిన టైబ్రేక్ ఫైనల్లో గుకేష్‌ను ఓడించిన చైనా గ్రాండ్ మాస్టర్ వీ యి టోర్నీ విజేతగా నిలిచాడు. మరో భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద ఆరో స్థానంలో నిలిచాడు.

వ్రితి, తీర్థుకు స్వర్ణాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో హైదరాబాద్ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ మూడో స్వర్ణం సాధించింది. ఆదివారం చెన్నైలో జరిగిన 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో వ్రితి స్వర్ణం నెగ్గింది. మరో తెలంగాణ అమ్మాయి నిత్య 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్యం సాధించింది. విజయవాడ స్విమ్మర్ తీర్థు సామదేవ్ 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ కేటగిరీలో స్వర్ణం అందుకున్నాడు. బాలుర వాలీబాల్‌లో ఆంధ్రప్రదేశ్ కాంస్యం గెలిచింది. ఇక, ఆంధ్ర వెయిట్‌లిఫ్టర్లు రాము (89 కిలోలు) స్వర్ణం, ప్రేమ్‌సాగర్ (81 కిలోలు) కాంస్యం కొల్లగొట్టారు.

'హార్ట్' చేశాడు

ఏడు వికెట్లతో భారత్‌ను దెబ్బకొట్టిన హార్ట్‌లీ

ఉప్పల్ టెస్టులో 28 పరుగులతో ఇంగ్లండ్ విజయం



టామ్ హార్ట్‌లీ (7/62)





గిల్ (0)

భారత అభిమానులకిది ఊహించని షాకే.. తొలి రెండు రోజులు అటు బంతి, ఇటు బ్యాటుతో మనోళ్లదే పూర్తి స్థాయిలో ఆధిపత్యం. దీనికితోడు 190 పరుగుల ఆధిక్యం. కానీ తర్వాత రెండు రోజుల్లో అంతా తారుమారు. ఒల్లీ పోప్ అసమాన బ్యాటింగ్‌తో 231 పరుగుల లక్ష్యం ఎదురైనా.. పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ కలిగిన టీమిండియాపై అంచనాలేమీ తగ్గలేదు. అయితే అరంగేట్ర లెఫ్టామ్ స్పిన్నర్ టామ్ హార్ట్‌లీ ఏడు వికెట్ల మాయాజాలానికి జట్టులో ఒక్క బ్యాటర్ కూడా ఆకట్టుకోక పోవడంతో ఉప్పల్‌లో తొలిసారి భారత్ ఓడక తప్పలేదు. చివర్లో అశ్విన్, భరత్ పోరాడినా అది సరిపోలేదు.

హైదరాబాద్: ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్‌ను భారత్ ఓటమితో ఆరంభించింది. ఉప్పల్‌లో నాలుగో రోజైన ఆదివారమే ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ 28 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో 1-0తో సిరీస్‌లో ముందుకెళ్లింది. కెరీర్‌లో తొలి టెస్టు ఆడిన స్పిన్నర్ టామ్ హార్ట్‌లీ (7/62) భారత్ విజయానికి అడ్డుగోడలా నిలిచాడు. ఆరంభంలోనే టాపార్డర్‌ను కుదురుకోనీయకుండా దెబ్బతీశాడు. అయితే చివర్లో టెయిలెండర్లు పోరాటం చూపారు. కానీ కీలక సమయంలో వారిని సైతం పెవిలియన్‌కు చేర్చిన హార్ట్‌లీ జట్టుకు అద్భుత విజయాన్నందించాడు. ఫలితంగా 231 రన్స్ ఛేదన కోసం బరిలోకి దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 69.2 ఓవర్లలో 202 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ (39), భరత్ (28), అశ్విన్ (28), రాహుల్ (22) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. అంతకుముందు ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 420 రన్స్ చేసింది. ఒల్లీ పోప్ (196) తృటిలో డబుల్ సెంచరీ కోల్పోయాడు. హార్ట్‌లీ (34), రెహాన్ (28) రాణించారు. బుమ్రాకు 4, అశ్విన్‌కు 3, జడేజాకు 2 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 246, భారత్ 436 పరుగులు చేశాయి. పోప్‌నకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. రెండో టెస్టు వచ్చేనెల 2న విశాఖపట్నంలో మొదలవనుంది.

'డబుల్' మిస్: ఓవర్‌నైట్ స్కోరు 316/6తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్‌కు పోప్ చివరికంటా అండగా నిలిచాడు. అదేపనిగా రివర్స్ స్వీప్‌లతో స్పిన్నర్లు అశ్విన్, జడేజాలపై ఒత్తిడి పెంచిన అతడు.. ఏడో వికెట్‌కు రెహాన్‌తో కలిసి 64, ఎనిమిదో వికెట్‌కు హార్ట్‌లీతో కలిసి 80 పరుగులు జోడించాడు. 180 రన్స్ వద్ద పోప్ క్యాచ్‌ను రాహుల్ వదిలేశాడు. అయితే డబుల్ సెంచరీకి నాలుగు పరుగుల దూరంలో బుమ్రా అద్భుత బంతికి పోప్ ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు. కానీ అప్పటికే జట్టు స్కోరు 420 పరుగులకు.. ఆధిక్యం 230కి చేరింది.

హార్ట్‌లీ దెబ్బకు..: స్పిన్‌ను చక్కగా ఎదుర్కొనే భారత బ్యాటర్లు అరంగేట్ర స్పిన్నర్ హార్ట్‌లీకి దాసోహం కావాల్సి వచ్చింది. టాపార్డర్‌ను అతడు కుదురుకోనీయలేదు. యశస్వీ (15), గిల్ (0)లను ఒకే ఓవర్‌లో అవుట్ చేసిన అతడు.. ఆత్మవిశ్వాసంతో ఉన్న రోహిత్‌ను ఎల్బీగా పంపాడు. ఐదో నెంబర్‌లో ఆడిన అక్షర్ (17), రాహుల్ కలిసి నాలుగో వికెట్‌కు 32 రన్స్ జోడించారు. టీ బ్రేక్ తర్వాత అక్షర్‌ను కూడా హార్ట్‌లీ అవుట్ చేసి తొలి నాలుగు వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. ఈ దశలో రాహుల్, శ్రేయాస్ (13)పై ఆశలు పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. అటు జడేజా (2) అనవసర పరుగుకోసం వెళ్లి స్టోక్స్ సూపర్‌త్రోతో రనౌటయ్యాడు.

ఆ ఇద్దరు పోరాడినా..: 119/7 స్కోరుతో జట్టు కష్టాల్లో పడిన వేళ 150 రన్స్ కూడా కష్టమే అనిపించింది. కానీ భరత్, అశ్విన్ గెలుపుపై ఆశలు రేకెత్తించారు. ఈ ఇద్దరూ ఎనిమిదో వికెట్‌కు 57 పరుగులు జోడించారు. రిస్కీ షాట్లకు వెళ్లకుండా స్పిన్నర్లను 21 ఓవర్లపాటు ఎదుర్కొన్నారు. ఆటను చివరిరోజు వరకు తీసుకెళతారని అనుకున్నా.. మరో రెండు ఓవర్లలో ఆట ముగుస్తుందనగా హార్ట్‌లీ కళ్లుచెదిరే బంతితో భరత్‌ను బౌల్డ్ చేశాడు. అలాగే ఆటను మరో అరగంట పొడిగించగా.. హార్ట్‌లీ తర్వాతి ఓవర్‌లో అశ్విన్ ముందుకు వచ్చి ఆడాలని చూసి స్టంప్ కావడంతో భారత్ ఆశలు ఆవిరయ్యాయి. చివర్లో సిరాజ్ (12), బుమ్రా (6) పదో వికెట్‌కు 25 రన్స్ జోడించి ఓటమి తేడాను తగ్గించారు.



పోప్ (196)కు రోహిత్ అభినందన

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246;
భారత్ తొలి ఇన్నింగ్స్: 436;

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (సి) రోహిత్ (బి) అశ్విన్ 31; డకెట్ (బి) బుమ్రా 47; పోప్ (బి) బుమ్రా 196; రూట్ (ఎల్బీ) బుమ్రా 2; బెయిర్‌స్టో (బి) జడేజా 10; స్టోక్స్ (బి) అశ్విన్ 6; ఫోక్స్ (బి) అక్షర్ 34; రెహాన్ (సి) బుమ్రా 28; హార్ట్‌లీ (బి) అశ్విన్ 34; ఉడ్ (సి) భరత్ (బి) జడేజా 0; లీచ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 32; మొత్తం: 420 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-45, 2-113, 3-117, 4-140, 5-163, 6-275, 7-339, 8-419, 9-420, 10-420. **బౌలింగ్:** బుమ్రా 16.1-4-41-4; అశ్విన్ 29-4-126-3; అక్షర్ 16-2-74-1; జడేజా 34-1-131-2; సిరాజ్ 7-1-22-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) హార్ట్‌లీ 39; జైస్వాల్ (సి) పోప్ (బి) హార్ట్‌లీ 15; గిల్ (సి) పోప్ (బి) హార్ట్‌లీ 0; రాహుల్ (ఎల్బీ) రూట్ 22; అక్షర్ (సి అండ్ బి) హార్ట్‌లీ 17; శ్రేయాస్ (సి) రూట్ (బి) లీచ్ 13; జడేజా (రనౌట్) 2; భరత్ (బి) హార్ట్‌లీ 28; అశ్విన్ (స్టంప్) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 28; బుమ్రా (నాటౌట్) 6; సిరాజ్ (స్టంప్) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 12; **ఎక్స్‌ట్రాలు: 20; మొత్తం: 202 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-42, 2-42, 3-63, 4-95, 5-107, 6-119, 7-119, 8-176, 9-177, 10-202. **బౌలింగ్:** రూట్ 19-3-41-1; ఉడ్ 8-1-15-0; హార్ట్‌లీ 26.2-5-62-7; లీచ్ 10-1-33-1; రెహాన్ 6-0-33-0.

2 తొలి ఇన్నింగ్స్‌లో 190+ ఆధిక్యం సాధించినా భారత్ ఓడడం ఇది రెండోసారి.

4 2013 నుంచి స్వదేశంలో భారత్ ఆడిన 47 టెస్టుల్లో ఇది నాలుగో ఓటమి.

విండీస్ వండర్



27 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై టెస్టు విజయం

షమార్ జోసెఫ్‌కు ఏడు వికెట్లు

- ఆసీస్ గడ్డపై 1997 తర్వాత విండీస్ ఓ టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించింది.
- 2003 తర్వాత ఏ వేదికపై అయినా ఆసీస్‌పై నెగ్గడం విండీస్‌కిదే తొలిసారి.
- డే/నైట్ టెస్టులో ఆసీస్ ఓడడం ఇదే తొలిసారి. గతంలో 11 మ్యాచ్‌లను గెలిచింది.

బ్రిస్బేన్: ప్రతిష్ఠాత్మక గాబా మైదానంలో వెస్టిండీస్ చరిత్రాత్మక విజయాన్నందుకుంది. ఏకంగా 27 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై టెస్టు గెలుపుతో సంబరాలు చేసుకుంది. 216 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన ఆతిథ్య జట్టును యువ పేసర్ షమార్ జోసెఫ్ ఏడు వికెట్లతో వణికించాడు. దీంతో 207 రన్స్‌కే ఆసీస్ ఆలౌట్ కాగా.. మరో రోజు ఉండగానే కరీబియన్లు 8 పరుగుల తేడాతో నెగ్గి అద్భుతం చేశారు. అలాగే రెండు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేశారు. స్మిత్ (91 నాటౌట్), గ్రీన్ (42) రాణించారు. వాస్తవానికి శనివారం బ్యాటింగ్‌లో పేసర్ స్టార్క్ యార్కర్ నేరుగా జోసెఫ్ కాలి వేలుకు బలంగా తాకింది. వెంటనే మైదానం వీడిన అతను ఆదివారం బౌలింగ్‌కు దిగుతాడని ఎవరూ భావించలేదు. కానీ నొప్పిని భరిస్తూనే ప్రత్యర్థి స్వల్ప ఛేదనను సైతం కట్టడి చేశాడు. **గతేడాది వరకు సెక్యూరిటీ గార్డుగా పనిచేసిన 24 ఏళ్ల జోసెఫ్‌కిది రెండో టెస్టు మాత్రమే.** అలాగే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ కూడా అతడికే దక్కింది. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 311, రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులు చేసింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో అతి విశ్వాసానికి వెళ్లి 289/9 రన్స్ వద్ద డిక్లేర్ చేసింది. ఆ సమయంలో కమిన్స్ చక్కగా ఆడుతుండడంతో మరిన్ని పరుగులైనా జత చేరేవి.

లారా కంటతడి..: సుదీర్ఘకాలం తర్వాత ఆసీస్ గడ్డపై తమ జట్టు గెలవడంతో విండీస్ దిగ్గజం బ్రియాన్ లారా తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. ఇదే సిరీస్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న లారా విండీస్ గెలిచిన వెంటనే కంటతడి పెట్టుకున్నాడు. అక్కడే ఉన్న ఆసీస్ దిగ్గజం గిల్‌క్రిస్ట్.. లారాను ఆలింగనం చేసుకున్నాడు.

ఇటలీ కుర్రాడు ఇరగదీశాడు



సిన్నర్‌దే ఆస్ట్రేలియన్ ఓపెన్

ఫైనల్లో మెద్వెదెవ్ పరాజయం

మెల్‌బోర్న్: తొలి రెండు సెట్లు చేజారాయి. మరో యువ ఆటగాడైతే ఇక చేతులెత్తేసేవాడేమో. కానీ ఇటలీకి చెందిన 22 ఏళ్ల జానిక్ సిన్నర్ అద్భుతంగా పోరాడాడు. మిగిలిన మూడు సెట్లు గెలిచి ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను అందుకున్నాడు. తద్వారా తన కెరీర్‌లో మొదటిసారి గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని ముద్దాడాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో నాలుగో సీడ్ సిన్నర్ 3-6, 3-6, 6-4, 6-4, 6-3తో మూడో సీడ్ రష్యన్ డానిల్ మెద్వెదెవ్‌కు షాకిచ్చాడు. దాదాపు మూడున్నర గంటల పాటు సాగిన సమరంలో సిన్నర్ 14 ఏస్‌లు సంధిస్తే మెద్వెదెవ్ 11 కొట్టాడు. విన్నర్లలోనూ ఇటలీ ఆటగాడిదే పైచేయి. అతడు 50 కొడితే..మెద్వెదెవ్ 44 సంధించాడు. మెల్‌బోర్న్ పార్క్‌లో మూడుసార్లు టైటిల్ ఫైట్‌కు వచ్చినా..అన్నిసార్లూ మెద్వెదెవ్‌కు నిరాశే మిగలడం గమనార్హం.

38 ఏళ్ల వయస్సులో టైటిల్: తైవాన్‌కు చెందిన 38 ఏళ్ల హీ సూ వీ అత్యధిక వయస్సులో గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్ గెలిచిన రెండో క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. ఎలిస్ మెర్టెన్స్ (బెల్జియం) జతగా బరిలో దిగిన వీ ఫైనల్లో 6-1, 7-5తో ఒస్టాపెంకో (లాత్వియా)/కిచెనోక్ (ఉక్రెయిన్) జోడీపై నెగ్గింది. 2011లో లిసా రేమండ్(అమెరికా) 38 ఏళ్ల వయసులో యూఎస్ ఓపెన్ డబుల్స్ టైటిల్ గెలిచింది.



నేను టీడీపీని వీడడం లేదు

» రాజకీయాలకు విరామం మాత్రమే: గల్లా జయదేవ్



గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తాను రాజకీయాలకు దూరం అవుతున్నానే తప్ప తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయడం లేదని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ స్పష్టం చేశారు. పాండవులు, శ్రీరాముడు ఎలాగైతే అరణ్యవాసం చేసి తిరిగి బలంగా వెనక్కి వచ్చి పరిపాలించారో.. తాను కూడా అలాగే తిరిగొచ్చి రాజకీయాల్లో రాణిస్తానని చెప్పారు. దశాబ్ద కాలం తనను రాజకీయంగా ఆదరించిన గుంటూరు ప్రజలకు 'కృతజ్ఞతాభివందనం' పేరుతో జయదేవ్ ఆదివారం గుంటూరులో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకపక్క కేంద్రం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్ చేసినా నిలబడ్డానే తప్ప రాజీ పడలేదన్నారు. రెండేళ్ల క్రితమే నా తండ్రి అమర్‌రాజా గ్రూపు సంస్థల నుంచి రిటైరయ్యారు. నా పిల్లలు ఇంకా చిన్న వయసులోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో బిజినెస్‌లపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నాను. ఈసారి కచ్చితంగా సంపూర్ణమైన రాజకీయవేత్తగానే వస్తా' అని ప్రకటించారు. లోక్‌సభలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి ప్రధాని మోదీని నిలదీశానని గల్లా గుర్తుచేసుకున్నారు. దీనివల్ల రెండుసార్లు ఈడీ విచారణ ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. 'ఇప్పుడు కూడా నా వ్యాపారాలన్నిటిపై భూతద్దం పెట్టి స్కానింగ్ చేస్తున్నారు. ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారు. అయినా భయం లేదు. రాజకీయాలకు దూరంగా ఉండి కోర్టు కేసులు గెలిచి స్వచ్ఛంగా బయటకు రాగలమన్న నమ్మకం ఉంది' అని చెప్పారు. అమర్‌రాజా గ్రూపుల టర్నోవర్‌ను వచ్చే ఐదేళ్లలో రూ.58 వేల కోట్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.

నీపై ఎందుకు చర్యలు తీసుకోవద్దో చెప్పు?

» పరిగి మార్కెట్‌లో అక్రమాలపై ఆరా తీసిన రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్

» కార్యదర్శిపై ఆగ్రహం.. చర్యలు తప్పవని హెచ్చరిక

పరిగి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పరిగి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి సుదర్శన్‌రావుపై రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పు' అంటూ గట్టిగా నిలదీశారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదని, కార్యదర్శి సహా అధికారులు, వ్యాపారస్తులు కుమ్మక్కై దోపిడి చేస్తున్నారని వేరుశనగ రైతులు శనివారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం తీవ్ర దుమారాన్ని రేపింది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ లక్ష్మీబాయి పరిగి మార్కెట్‌యార్డును ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా.. కార్యదర్శిపై రైతులు పలు ఆరోపణలు చేశారు. ఐదుశాతం కమిషన్‌తోపాటు, క్వింటాలుకు ఐదు కిలోల తరుగు తీస్తున్నారని డైరెక్టర్‌కు వివరించారు. ఈ-నామ్ అమలవుతున్నా అమ్మకాల తీరుపై గోప్యంగా వ్యవహరించడంపై కార్యదర్శిపై లక్ష్మీబాయి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అనంతరం విలేకరులతో మాటాడుతూ రైతులు పండించిన ఏ పంటకైనా గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత తీసుకుంటామని, వ్యాపారులు కొనకపోతే ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దోమకొండ, జనవరి 28: అప్పులు అధికమై, తీర్చే మార్గం కనిపించక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం ముత్యంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు బొబ్బిలి దుర్గయ్య(53) తన మూడెకరాల పొలంలో వరి పండిస్తూ జీవనం గడుపుతున్నాడు. సాగునీటి కోసం ఇటీవల మూడు బోర్లను వేయగా చుక్క నీరు పడకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. బోర్ల కోసం, ఇతర అవసరాలకు చేసిన అప్పులు సుమారు రూ. 4లక్షల వరకు అయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్థాపానికి గురై ఆదివారం తన పొలంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

నీ పరిస్థితేం బాలేదు.. నీది మాత్రం బాగుందా?

» ఏపీ సీఎం జగన్ వర్సెస్ 'సొంత' జిల్లా ఎమ్మెల్యే




అమరావతి జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి!.. మరోవైపు.. ఆయనకు సన్నిహితుడు, అపాయింట్‌మెంట్ లేకుండానే తాడేపల్లి ప్యాలెస్‌లోకి అడుగుపెట్టగల ఎమ్మెల్యే! ఇద్దరి మధ్య 'ఢీ అంటే ఢీ'! విశ్వసనీయ సమాచారం ప్రకారం... అభ్యర్థుల మార్పుచేర్పులపై కసరత్తు చేస్తున్న జగన్... కడప జిల్లాకు చెందిన ఆ శాసనసభ్యుడిని రెండు రోజుల క్రితం తాడేపల్లికి పిలిపించారు. "నియోజకవర్గంలో నీ పరిస్థితి ఏం బాలేదు" అని ఆయన ముఖాన్నే చెప్పారు. అయితే... ఇతర ఎమ్మెల్యేల్లాగా ఆ ఎమ్మెల్యే మౌనముద్ర దాల్చలేదు.. అప్పటికప్పుడే జగన్‌కు కౌంటర్ ఇచ్చారు. "రాష్ట్రంలో నీ పరిస్థితి మాత్రం బాగుందా?" అని సూటిగా ప్రశ్నించారు. 'ఎవరి పరిస్థితి ఏమిటో ఓటర్లే తేలుస్తారులే' అని వ్యాఖ్యానించారు. 'సర్వేలో బాగా వ్యతిరేకత వచ్చిందని చెబుతున్నా' అని సీఎం అనగానే, 'నేనేం మర్డర్లు చెయ్యలా! చేయించినోడిని వెనకేసుకు రాలా!' అంటూ ఆ ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. దీంతో జగన్ ఒక్కసారిగా సహనం కోల్పోయి... ఆగ్రహంతో ఊగిపోయారు. 'నేనేం చెబుతున్నా.. నువ్వేం మాట్లాడుతున్నావ్..' అంటూ సీరియస్ అయ్యారు. అక్కడే ఉన్న వైసీపీ ముఖ్యనేత వైవీ సుబ్బారెడ్డి 'సమయస్ఫూర్తి' ప్రదర్శించారు. వివాదం పెద్దది కాకుండా ఎమ్మెల్యే చేయి పట్టుకుని బయటికి తీసుకెళ్లారు.

ఇచ్చిన ప్రతి మాటా తప్పారు!

» జగన్ వైఎస్ వారసుడెలా అవుతారు: షర్మిల



తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'వైఎస్.. మాట మీద నిలబడే నాయకుడు.. జగన్ మాత్రం మాట తప్పే నాయకుడు.. ఇచ్చిన ప్రతి మాటా తప్పిన జగన్, మాటకు కట్టుబడే వైఎస్‌కు వారసుడెలా అవుతారు..' అని ఆయన చెల్లెలు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సూటిగా ప్రశ్నించారు. ఆదివారం తిరుపతిలో, అనంతపురంలో ఆయా ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ శ్రేణులతో ఆమె సమావేశమయ్యారు. ఒకప్పుడు వైసీపీని తన భుజాలపై మోశానని, జగనన్న రాజకీయ భవిష్యత్ కోసం 3,200 కి.మీ. పాదయాత్ర చేశానని.. రాష్ట్రంలో వైసీపీని గెలిపించానని.. అయినా కనీసం కృతజ్ఞత లేదని దుయ్యబట్టారు. అధికారం చేపట్టగానే జగనన్న మారిపోయారన్నారు. ఇవాళ తన మీద, తన వ్యక్తిగత జీవితం మీద దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని 2014లో తిరుపతిలో నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని.. కాంగ్రెస్ ఇచ్చే ఐదేళ్ల వ్యవధి సరిపోదని, పదేళ్ల పాటు హోదా కావాలన్నారని.. పదిహేనేళ్లు కావాలని ఇదేచోట చంద్రబాబు కూడా అడిగారని.. బీజేపీ అధికారంలోకి వస్తే హోదా ఇస్తామని చెప్పిన మాట ఏమైందని మోదీని ప్రశ్నిస్తున్నానని షర్మిల అన్నారు. అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా తెస్తామని జగన్ అన్నాడు. పోలవరం పూర్తి చేస్తామన్నారు. రాజధాని కడతామన్నాడు. అవేమీ సాధించలేదు. నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు పరిశ్రమలు తీసుకొస్తానన్నాడు. ఏటా జాబ్ కేలెండర్ అన్నాడు. రాష్ట్రానికి మేలు చేయకపోగా.. బీజేపీకి బానిసగా మారాడు. ఏమీ సాధించని జగన్‌కు ఎందుకు ఓటేయాలో ఆయనే చెప్పాలి.



(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఏ'ఛీ'పీలు..!

భూ దందాల్లో బిజీబిజీ.. సెటిల్‌మెంట్లు చేస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

» ప్రభుత్వాలు మారినా వారిదే 'హవా'

» శివార్లలో ఇద్దరు ఏసీపీల వ్యవహారంపై జోరుగా చర్చ

హైదరాబాద్ నగర శివార్లలోని కొందరు పోలీసు ఉన్నతాధికారులు పరిధులు దాటుతున్నారు. భూవివాదాల్లో తలదూర్చి, తమదైన శైలిలో సెటిల్‌మెంట్లు చేసేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, కొందరు అధికారుల తీరు మాత్రం మారలేదు. ఇటీవలే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో భూవివాదాల్లో జోక్యం చేసుకుంటున్న మొయినాబాద్, మోకిలా ఇన్‌స్పెక్టర్లపై కమిషనర్ బదిలీ వేటు వేసిన సంగతి తెలిసిందే. అయినా శివార్లలో కొందరు పోలీసు అధికారులు మాత్రం భూదందాలు చేస్తూనే ఉన్నారు. పలుచోట్ల ఏసీపీ, ఆ పైస్థాయి అధికారులు ఇన్‌స్పెక్టర్లను డమ్మీలు చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నగర శివార్లలో ఇలాంటి దందాలు చేస్తున్న ఇద్దరు ఏసీపీల వ్యవహారశైలిపై విస్తృత చర్చ సాగుతోంది.

ఆ ఏసీపీ దందా స్టైలే వేరు..!

ఓఆర్‌ఆర్‌కు ఆనుకొని ఉన్న ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఏసీపీ.. రెవెన్యూ వ్యవస్థను కూడా శాసిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో కీలకమైన మంత్రి ఆశీస్సులతో ఇక్కడ పోస్టింగ్ పొందిన సదరు ఏసీపీ.. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా చక్రం తిప్పుతుండడం గమనార్హం. ఆయన ఔటర్ రింగ్‌రోడ్డుకు సమీపంలోని రెండు మండలాల్లో భూవివాదాల్లో విపరీతంగా జోక్యం చేసుకుంటున్నారు. ఈ విషయంపై పోలీసు పెద్దలకు సమాచారం ఉన్నా, ఆయనపై చర్యలకు సాహసించడం లేదు. పోలీసు కీలక ఉన్నతాధికారి తనకు గాడ్ ఫాదర్ అని ప్రచారం చేసుకుంటుడడంతో ఆయన జోలికి ఎవరూ వెళ్లడం లేదు. అంతేకాదు భూవివాదాల్లో ఓ రౌడీషీటర్‌ను తెరవెనక వాడుకుంటున్నట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వంలో పోస్టింగ్ పొందిన ఆయన, ఇక్కడ స్థిరపడేందుకు తన సామాజికవర్గం పేరును బాగానే వాడేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు నెలల ముందు జరిగిన ఓ ఉపఎన్నికలో అప్పటి అధికార పార్టీ తరఫున బరిలో దిగేందుకు తహతహలాడారు. ఆ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అప్పటి అధికార పార్టీ రాజకీయ నేతకే టికెట్ ఇచ్చింది. ఆయన స్వామి భక్తికి నజరానాగా నగర శివార్లలో కీలకమైన ప్రాంతంలో పోస్టింగ్ ఇచ్చింది. అలా అప్పటి పెద్దల ఆశీస్సులతో పోస్టింగ్ తీసుకున్న ఆయన తన పరిధిలో పెదరాయుడిగా చెలామణీ అవుతున్నారు. ప్రభుత్వం మారినా.. ఆయన హవా మాత్రం తగ్గలేదు. తన పరిధిలో విచ్చలవిడిగా భూదందాలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కోర్టులో ఉన్న ఓ సివిల్ కేసు విషయంలో తలదూర్చి ఓ వర్గానికి అనుకూలంగా సెక్షన్ 145 కింద కేసు నమోదు చేయించారు. సాధారణంగా కోర్టులో ఉన్న భూవివాదానికి సంబంధించి ఏదైనా సమస్య తలెత్తితే ఈ సెక్షన్ కింద కేసు నమోదు చేయరు. కానీ, ఆయన రెవెన్యూ అధికారులపై వత్తిడి తెచ్చి లా అండ్ ఆర్డర్ పేరుతో రెండేళ్లుగా కోర్టులో కొనసాగుతున్న భూవివాదంలో సెక్షన్ 145 కింద కేసు పెట్టించారు. ఇందులో ఆయన భారీగా ముడుపులు అందుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఇటీవల ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన భూవివాదంలో కూడా ఇలానే తలదూర్చి ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరించడమే కాక, పొజిషన్‌లో ఉన్న వ్యక్తిని అక్కడి నుంచి బలవంతంగా బయటకు పంపే ప్రయత్నం చేశారు. నగర సమీపంలోని ఓ గ్రామంలో కొన్ని దశాబ్దాల కిందట రోడ్డు కోసం ప్రభుత్వం భూమి సేకరించింది. ధరణిలోని లోపాలు అడ్డుపెట్టుకుని గ్రామసర్పంచి ఈ భూమికి పాస్‌బుక్ సంపాదించారు. ఆ పాస్‌బుక్‌ను ఆసరాగా చేసుకున్న ఆ సర్పంచి, పక్కనే ఉన్న మరొకరి భూమిని కబ్జాపెట్టారు. రైతు అయిన ఆ భూమి అసలు యజమాని పోలీసులను ఆశ్రయిస్తే.. 'సివిల్ కేసు. కోర్టుకు వెళ్లాలి' అంటూ వెనక్కి పంపించేశారు. పోలీసులు జోక్యం చేసుకోకపోవడంతో సదరు సర్పంచి విలువైన మూడెకరాల భూమిని తన అధీనంలోకి తెచ్చుకున్నారు. ఏసీపీ అండదండలతోనే ఇదంతా జరిగినట్లు స్థానికంగా ప్రచారం సాగుతోంది. పక్కనే ఉన్న మరో గ్రామంలో కూడా ప్లాట్ల యజమానులకు, వెంచర్ వేసిన రియల్ వ్యాపారి మధ్య 11 కేసులు కోర్టులో నడుస్తున్నాయి. అయితే ఇప్పుడు రియల్ వ్యాపారికి అనుకూలంగా సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సెటిల్ చేసుకోకుంటే క్రిమినల్ కేసులు పెడతామని ప్లాట్ల యజమానులను బెదిరిస్తున్నట్లు తెలిసింది.

ఈయన రూటే సెపరేటు!

జీహెచ్ఎంసీ, మునిసిపాలిటీల పరిధిలోని మరో ఏసీపీ కూడా తానేమీ తక్కువ కానట్లు వ్యవహరిస్తున్నారు. ఆయన ఆగడాలు మితిమీరుతున్నాయి. ఓ రిటైర్డ్ ఎస్పీ భూమిపై కన్నేయడంతోపాటు ఆయన కట్టుకున్న ఇంటిని కూడా ఇతరుల కబ్జాలోకి తెచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఈ ప్రాంతంలో 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న రిటైర్డ్ అధికారిని అక్కడి నుంచి పంపించేశారు. ఆయన దగ్గర ఉండి మరీ ఇతరులకు పొజిషన్ ఇప్పించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు దీనిపై జరుగుతున్న విచారణలో ఆయన తన తప్పేమీ లేదని, ఉన్నతాధికారులు చెప్పడంతోనే జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అలాగే ఆయన సమీపంలోని ఓ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న 2 వేల గజాల స్థలం విషయంలో జోక్యం చేసుకుని తనకు అనుకూలమైన వ్యక్తుల పరం చేశారన్న ఆరోపణలూ ఉన్నాయి.

వీరిని కాపాడుతున్నదెవరు?

కొత్త ప్రభుత్వంలో కీలక ఐఏఎస్, ఐపీఎస్ పోస్టింగ్‌లు జరుగుతున్న తీరు చూసి అన్ని వర్గాల వారు సర్కార్‌ను మెచ్చుకుంటున్నారు. అనేక కీలక శాఖల్లో సమర్థ అధికారులను నియమించడంతో రేవంత్ సర్కార్ పాలనను మళ్లీ గాడిలో పెడుతున్నారని భావిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఇంకా ఇలాంటి అవినీతిపరులు అరాచకాలకు పాల్పడుతున్నారు. గత ప్రభుత్వంలో పెద్దల ఆశీస్సులతో పోస్టింగ్‌లు పొందిన అనేక మంది ఇంకా తమ హవాను కొనసాగిస్తున్నారు. అప్పటి ప్రభుత్వంలో అరాచకాలు చేసిన వీరంతా ఇపుడు కూడా చక్రం తిప్పుతుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. సదరు పోలీసు అధికారులను కాపాడుతున్న వారెవరు? వారి అవినీతి అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఎందుకు ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్యలకు వెనుకంజ వేస్తున్నారు. వీరి వెనుక ఉన్న బలమైన అదృశ్య శక్తులు ఎవరు? అని ఉమ్మడి జిల్లాలో చర్చసాగుతోంది.

రాడార్ స్టేషన్.. వద్దే వద్దు

» 12 వేల టవర్లతో అంతులేని రేడియేషన్

» ప్రభుత్వాలు ప్రత్యామ్నాయం చూడాలి

» ప్రధాని, కేటీఆర్‌ను కలిసి విన్నవిస్తాం

» వికారాబాద్ చర్చా వేదికలో వక్తలు



మాట్లాడుతున్న దామగుండం పరిరక్షణ కమిటీ సభ్యులు

వికారాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): "అడవులకు ఆలవాలం.. నదులకు నెలవు.. ఆహ్లాదకర వాతావరణానికి ఆవాసం.. అలాంటి వికారాబాద్ జిల్లాలో వేల చెట్లను నరికి నేవీ రాడార్ స్టేషన్‌ను తీసుకొస్తారా..? అభివృద్ధి పేరుతో అడవిని పూర్తిగా నాశనం చేస్తారా..? ప్రాణాలైనా ఇస్తాం కానీ.. ఈ విధ్వంసాన్ని అడ్డుకుని తీరతాం" అని దామగుండం పరిరక్షణ సమితి సభ్యులు తేల్చిచెప్పారు. దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటును నిరసిస్తూ వికారాబాద్‌లో ఆదివారం చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ ఫారెస్ట్‌ను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించడంపై మండిపడ్డారు. రాడార్ స్టేషన్‌ను ఏర్పాటుతో ఈ ప్రాంతంలో సుమారు 12వేల టవర్లు వస్తాయని.. దీని ద్వారా స్థానికులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ఈ ప్రాంతంలో పంటలు పండే పరిస్థితి ఉండదని, పిల్లలు పుట్టే అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. 1989లో అమెరికాలో నేవీ రాడర్ కోసం ఏర్పాట్లు చేశారని.. దాంతో అక్కడి ప్రజలు అష్టకష్టాలు పడ్డారని గుర్తుచేశారు. చాలా మందికి క్యాన్సర్ వచ్చిందని తెలిపారు. ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని.. అవసరమైతే శాటిలైట్ ద్వారా సిగ్నళ్లను తెప్పించుకోవాలన్నారు. ఇక్కడ ఉన్న చెట్లు ఎలాంటివో అధ్యయనం చేయకుండా నరికివేతకు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. అడవిలోని వనమూలికల చెట్లకు పేటెంట్ హక్కు కల్పిస్తే.. అవే రూ.లక్షల కోట్ల ఆదాయం సమకూరుస్తాయని అన్నారు. 2015-16 సమయంలో నేవీ అధికారులు ఇక్కడ 36 లక్షల మొక్కలు నాటి పెంచుతున్నట్లు చెబుతున్నారని.. ఇప్పటి వరకు ఒక్క మొక్క కూడా నాటలేదని వెల్లడించారు.

అడ్డుకుని తీరుతాం..

అందరి సహకారంతో రాడార్ కేంద్రం రాకుండా ఆపుతామని వక్తలు స్పష్టం చేశారు. సోమవారం పరిగికి వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతిపత్రం ఇవ్వడంతో పాటు త్వరలో వికారాబాద్ రాబోతున్న ప్రధాని మోదీని కలిసి సమస్యలను విన్నవించాలని తీర్మానించారు. దీనిపై హైకోర్టులో కేసు నడుస్తోందని.. సమస్య పరిష్కారం కాకపోతే సుప్రీంకోర్టుకు వెళతామని స్పష్టం చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి రాడార్ కేంద్రంపై ఎందుకు అంత శ్రద్ధ ఉందో అర్థం కావడంలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తీరును ఖండించారు. అవసరమైతే జిల్లాలో రోడ్లను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. త్వరలోనే జిల్లాలో ఒక రోజు బంద్‌కు పిలుపునిస్తామని చెప్పారు.

24 మంది ఎమ్మెల్యేల ఎన్నికపై సవాల్!

» కేటీఆర్, హరీశ్‌రావుపైనా ఎలక్షన్ పిటిషన్లు

» అక్రమంగా గెలిచారు.. వారిపై అనర్హత వేటు వేయాలంటూ ప్రత్యర్థుల విజ్ఞప్తి

» రిజిస్ట్రీ పరిశీలనలో దాదాపు 30 పిటిషన్లు

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేల్లో 24 మందిపై వారి సమీప ప్రత్యర్థులు ఎలక్షన్ పిటిషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కూడా ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. కొందరు ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా రెండేసి దాఖలయ్యాయి. దాంతో వాటి సంఖ్య 30కి చేరింది. ఆ ఎమ్మెల్యేల ఎన్నిక అక్రమమని, తమను విజేతలుగా ప్రకటించాలని పిటిషనర్లు కోరారు. పలు పిటిషన్లు రిజిస్ట్రీ పరిశీలనలో ఉండగా.. ఇప్పటివరకు ఇంకా దేనికీ రిజిస్ట్రీ రెగ్యులర్ నెంబర్ కేటాయించలేదు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికల ఫలితాలు వచ్చిన 45 రోజుల్లో ఎలక్షన్ పిటిషన్ (ఈపీ) దాఖలు చేయాలి. ఈ గడువు ఇటీవల ముగిసింది. ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారం, ఈవీఎంలు, వీవీప్యాట్లలో లోపాలు తదితర కారణాలు పేర్కొంటూ ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. సిరిసిల్ల నుంచి ఎన్నికైన కేటీఆర్‌పై ఆయన ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి ఈపీ దాఖలు చేశారు. కేటీఆర్ తన కుమారుడు హిమాన్షును డిపెండెంట్‌గా చూపలేదని, అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు సమర్పించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. హిమాన్షు పేరిట 32 ఎకరాల భూమి ఉందని, దీన్ని కొనేందుకు ఆదాయం ఎక్కడి నుంచి వచ్చిందో కేటీఆర్ వెల్లడించలేదన్నారు. ఈ భూమి సేల్ డీడ్‌ను సైతం మహేందర్ రెడ్డి సమర్పించారు. అమెరికా యూనివర్సిటీలో చదువుతున్న కుమారుడికి కేటీఆరే ఫీజు కడుతున్నా డిపెండెంట్‌గా చూపలేదన్నారు. కేటీఆర్ తన కొడుకు ఆస్తులను చూపలేదని మరో పిటిషన్ దాఖలైంది. ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎన్నికపై బీఎస్పీ అభ్యర్థి చక్రధర్‌గౌడ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు (బీఆర్ఎస్)పై కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేశ్ ఎలక్షన్ పిటిషన్లు దాఖలు చేశారు. కృష్ణారావు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి తోపుడు బండ్లు పంచారని, ఆయనపై అనర్హత వేటు వేయాలని పిటిషనర్ కోరారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి (బీఆర్ఎస్) ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించారని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎన్నికను సవాల్ చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్, వీ నవీన్‌యాదవ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని, ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి సరిత పిటిషన్ వేశారు. 2018 ఎన్నికలకు సంబంధించిన ఈపీలో ఆయన అనర్హతకు గురయ్యారని, సుప్రీంకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారని, ఈ కేసు గురించి వెల్లడించలేదని ఆరోపించారు. ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్, పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్ గౌడ్ పిటిషన్ వేశారు. ఆదిలాబాద్, కామారెడ్డి, కొత్తగూడెం, షాద్‌నగర్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలపై సైతం ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ఎలక్షన్ పిటిషన్లు దాఖలు చేశారు.

ఇంకా పెండింగ్‌లోనే 2018 ఎన్నికల పిటిషన్లు

2018 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పిటిషన్లే ఇప్పటికీ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. నాటి ఎన్నికలకు సంబంధించి కొత్తగూడెం, గద్వాల్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తూ హైకోర్టు తీర్పులు ఇచ్చింది. వీటిపై సదరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టులో స్టే తెచ్చుకోవడం గమనార్హం.

సచివాలయంలో సామాన్యుల సందడి

» నిత్యం వందల సంఖ్యలో అర్జీదారులు

» నాడు వెల వెల.. నేడు కళ కళ

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు వచ్చాక సచివాలయంలో సామాన్యుల సందడి పెరిగిపోయింది. కొత్త సచివాలయం ప్రారంభమైనప్పటి నుంచి గతేడాది డిసెంబరు 7 వరకు పెద్దగా జన సంచారం ఉండేది కాదు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయానికి సందర్శకులు పెద్దగా వచ్చేవారు కాదు. లోపలికి వెళ్లేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. తీరా ఎలాగోలా లోపలికి వెళితే.. సీఎం నుంచి మంత్రుల వరకు ఎవరూ అందుబాటులో ఉండేవారు కాదు. దాంతో సమస్యలు ఉన్నప్పటికీ జనం సెక్రటేరియట్ ముఖం చూడటమే మానేశారు. ఒకానొక దశలో ప్రస్తుత మంత్రి, అప్పటి ములుగు ఎమ్మెల్యేగా ఉన్న సీతక్కను కూడా లోపలికి అనుమతించలేదు. కానీ, ఇప్పుడు సీన్ మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడినప్పటి నుంచి సచివాలయంలోకి నిత్యం వందల సంఖ్యలో అర్జీదారులు వస్తున్నారు. ముఖ్యమంత్రి సచివాలయంలో అందుబాటులో లేకపోయినా.. మంత్రులు ఉంటారని ప్రజల్లో విశ్వాసం ఏర్పడింది. సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా జనం వస్తున్నారు. రోజుకు సుమారు 1,500-2,000 మందికిపైగా వస్తున్నట్లు సమాచారం. సెక్రటేరియట్‌లోకి వెళ్లేందుకు ఇస్తున్న పాస్‌లు దాదాపు 800-1,000 వరకు ఉంటుండగా, నేరుగా వెళ్లేవారు మరికొంత మంది. గత ప్రభుత్వంలో సెక్రటేరియట్‌లోకి వెళ్లేందుకు రోజుకు 400-600 వరకు మాత్రమే పాస్‌లను ఇచ్చినట్టు సమాచారం. వివిధ సమస్యలపై సచివాలయానికి వస్తున్న జనాన్ని మంత్రులు కలుస్తున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశిస్తున్నారు. దీంతో నాడు వెలవెలబోయిన సెక్రటేరియట్.. నేడు కళకళలాడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మాల్దీవుల పార్లమెంటులో కొట్లాట

» చైనాకు మద్దతిచ్చే ప్రభుత్వం, భారత్ అనుకూల విపక్షాల మధ్య ఘర్షణ

మాలే, జనవరి 28: మాల్దీవుల పార్లమెంటులో ఆదివారం చైనాకు అనుకూలంగా ఉండే మహమ్మద్ ముయిజ్జు ప్రభుత్వం, భారత్‌తో స్నేహపూర్వకంగా వ్యవహరించే విపక్షాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరుపక్షాల ఎంపీలు ఒకర్నొకరు కొట్టుకున్నారు. ముష్టిఘాతాలకు దిగారు. అధ్యక్షుడు నియమించిన మంత్రుల పేర్లకు ఆమోదం తెలిపేందుకు ఈ ప్రత్యేక సమావేశం జరిగింది. విపక్షాలు నలుగురు పేర్లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆమోదం తెలపలేదు. దాంతో అధికార పక్షమైన ప్రోగ్రసివ్ పార్టీ ఆఫ్ మాల్దీవ్స్, పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. స్పీకర్ ఛాంబర్‌లోకి దూసుకెళ్లారు. ఇందుకు విపక్షమైన మాల్దీవియన్ డెమొక్రాటిక్ పార్టీ, డెమొక్రాటిక్ పార్టీ సభ్యులు అభ్యంతరం చెప్పారు. ఈ సందర్భంగానే ఇరు పక్షాల ఎంపీలు కొట్టుకున్నారు. గాయపడ్డ ఒక సభ్యుణ్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అనంతరం సభ్యుల రక్షణలో విఫలమయ్యారంటూ అధికార పక్ష కూటమే స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది.

అ'క్రమబద్ధీకరణ'పై కొరడా!

(మొదటి పేజీ తరువాయి)

గడువులోపు ఫీజులన్నీ చెల్లించడంతో.. వాటి క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తిచేసి రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్‌లూ జారీ చేశారు. అంటే ఆ స్థలాలను దరఖాస్తుదారుల పేరుతో రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. ఇలాంటివి పెద్దసంఖ్యలోనే ఉన్నాయి. వీటిని మళ్లీ పరిశీలించాలని, అక్రమాలుంటే నిగ్గుతేల్చి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రిజిస్ట్రేషన్ కాని దరఖాస్తుల నిలిపివేత..

క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుని, జీవోలో నిర్దేశించిన మేరకు ఫీజులు చెల్లించినా.. కొన్ని స్థలాలకు ఇంకా రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్ ఇవ్వడం పూర్తికాలేదు. ఇలాంటి ఫైళ్లను ఎక్కడికక్కడే నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలాంటి ఫైళ్లు సుమారు 1000 వరకు ఉన్నట్లు సమాచారం. వీటి విలువ రూ.వేల కోట్లలోనే ఉంటుందని అంచనా. కాగా, జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేసిన ఫైళ్లలో విలువైన భూములు రాజధాని హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లోనే ఉన్నాయి. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోనే పెద్దఎత్తున దరఖాస్తులు రాగా.. వాటిని పరిష్కరించారు. అయితే క్రమబద్ధీకరణ ముసుగులో వీటిలో పలుచోట్ల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఆయా జిల్లాల పరిధిలో మొత్తం ఫైళ్లను రీ వెరిఫికేషన్ చేయాలని నిర్ణయించారు. మరోవైపు జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేసుకున్న స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఇవ్వొద్దని కూడా ఆయా జిల్లాల కలెక్టర్లను, జీహెచ్ఎంసీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. 2023 ఆగస్టు 17 నుంచి జీవో 59 కింద క్రమబద్ధీకరణ జరిగిన స్థలాల ఫైళ్లన్నింటికీ ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని పేర్కొంది. ఆ తేదీ నుంచి క్రమబద్ధీకరించిన అన్ని ఫైళ్లను మళ్లీ పరిశీలించే పనిని త్వరలోనే ప్రారంభిస్తామని చెబుతోంది. అవసరమైతే ప్రత్యేక అధికారుల బృందాలను కూడా నియమించి రీవెరిఫికేషన్ చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది.



నిర్మాణం లేకుండానే ఉన్నట్లు సృష్టించి..

జీవో 59 కింద ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణలో ప్రధానంగా చోటుచేసుకున్న అక్రమాలేంటన్న దానిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ మేరకు అధికారుల నుంచి సమాచారం కోరింది. అయితే ఈ జీవో కింద స్థలాల క్రమబద్ధీకరణకు కావాల్సిన ప్రధాన అర్హత.. సదరు స్థలంలో ఏదో నిర్మాణం చేసి ఉండడం, కొన్నేళ్ల నుంచి అందులో నివసిస్తూ ఉండడం. అయితే ఇక్కడే అక్రమార్కులు నిర్మాణం లేకున్నా ఉన్నట్లుగా చూపించారు. కొందరు అధికారులు ప్రలోభాలకు, ఒత్తిళ్లకు తలొగ్గి వాటిని క్రమబద్ధీకరించారు. రంగారెడ్డి జిల్లా నానక్‌రాంగూడలో ఎలాంటి నిర్మాణాలు లేకున్నా ఐదెకరాల భూములను అక్రమంగా క్రమబద్ధీకరించారని, దాని విలువ సుమారు రూ.750 కోట్లు ఉంటుందని 'ఆంధ్రజ్యోతి' కూడా ఇటీవల వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీంతోపాటు రంగారెడ్డి జిల్లాలోని గోపనపల్లిలోను వందల కోట్ల విలువైన భూములను ఇలాగే క్రమబద్ధీకరించడం, అది కూడా సరిగ్గా ఎన్నికల ఫలితాలు రావడానికి ఒక్క రోజు ముందే చేయడంపైనా ఆధారాలతో సహా కథనాన్ని ప్రచురించింది. మరీ ముఖ్యంగా ఎన్నికల షెడ్యూలు వెలువడ్డాక.. పోలింగ్‌కు ఒక రోజు ముందు, చివరకు పోలింగ్ రోజు కూడా ఈ ఫైళ్లను క్లియర్ చేసిన విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. అక్రమాలను నిగ్గు తేల్చేందుకు శాటిలైట్ మ్యాప్‌ల సాయం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. క్రమబద్ధీకరణ చేసేనాటికి ఆ స్థలాల్లో నిజంగా ఏముంది? ఖాళీగా ఉందా? ఏదైనా ఇల్లు, నిర్మాణం ఉందా? అన్న విషయాలను శాటిలైట్ మ్యాప్ సాయంతో పరిశీలిస్తారు. దీంతో అక్రమార్కులు ఒకవేళ ఇప్పటికిప్పుడు ఆగమేఘాల మీద ఏదైనా నిర్మాణం చేసేసి తప్పును కప్పిపుచ్చుకోవాలని చూసినా.. అది చెల్లదు. శాటిలైట్ మ్యాప్ సహాయంతో క్రమబద్ధీకరణ చేసిన తేదీకి ఆ స్థలంలో వాస్తవంగా ఏముందన్నది తెలుసుకోవచ్చు.

న్యాయ వివాదాలు తలెత్తే అవకాశమున్నా..

ఫైళ్లను మళ్లీ పరిశీలించి.. అక్రమాలున్నట్లు తేలితే వాటిని రద్దు చేయడం న్యాయపరమైన వివాదాలకు దారితీసే అవకాశాలున్నాయి. క్రమబద్ధీకరణ చేశాక రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే కన్వేయన్స్ డీడ్‌లోనే.. దీనిపై ప్రభుత్వం భవిష్యత్తులో ఎలాంటి వివాదాన్ని తీసుకురాదన్న షరతు ఉంటుంది. దీంతో ఇప్పుడు రీ వెరిఫికేషన్‌లో ఎక్కడైనా అక్రమాలు జరిగినట్లు తేలి, వాటిని రద్దు చేయాలని నిర్ణయిస్తే.. లబ్ధిదారులు న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశాలూ ఉన్నాయంటున్నారు. అయితే ఇక్కడే ప్రభుత్వానికీ ఓ గట్టి అవకాశం ఉంది. దరఖాస్తుదారు సమర్పించిన సమాచారంలో ఏవైనా తప్పులు, అక్రమాలు ఉంటే వీటి ప్రాతిపదికపై క్రమబద్ధీకరణను తిరస్కరించే అవకాశం ప్రభుత్వానికి ఎప్పుడూ ఉంటుంది. ఇచ్చిన సమాచారంతా సరైనదేనన్న డిక్లరేషన్‌ను కూడా ప్రభుత్వం ముందే తీసుకుంటుంది. నిర్మాణాలు లేని చోట్ల ఉన్నట్లు చూపించడం అక్రమమైనందున.. ఈ అంశం ప్రాతిపదికగానే రద్దు చేస్తున్నట్లు న్యాయస్థానాల్లోనూ చెప్పొచ్చు. తప్పుడు దరఖాస్తులు పెట్టిన వారిపైనా కేసులు కూడా పెట్టే అవకాశాలుంటాయి. ప్రలోభాలకు లొంగి అక్రమంగా క్రమబద్ధీకరించిన అధికారులపై ఎలాగూ చర్యలు తప్పవు.

హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేక పోరాటం

» విరసం రాష్ట్ర మహాసభల్లో ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపు



విజయవాడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రస్తుతం హిందుత్వ ఫాసిజం ఆవహించి ఉందని, ఈ పరిస్థితికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు. విరసం రాష్ట్ర మహాసభలు విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందుత్వ ఫాసిజం ప్రజల మధ్య ద్వేషాలను పెంచుతూ మానవీయతను కోల్పోయేలా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని నివారించడానికి వర్గ పోరాట రాజకీయాలు, ప్రజల మధ్య విస్తృతంగా పనిచేస్తూ చైతన్యం కలిగించాలని, ఈ పనిని విరసం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విరసం సీనియర్ సభ్యుడు కల్యాణరావు మాట్లాడుతూ బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులు నేడు దేశంలో పోరాడుతున్న ప్రజలను, మేధావులను అణిచివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని ప్రశ్నిస్తున్న వారిని అర్బన్ నక్సల్స్ పేరుతో అక్రమంగా అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారని పేర్కొన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్య పెట్టుబడి సంక్షోభంలో కూరుకుపోయిందని, దీనినుంచి బయటపడటానికి కార్పొరేట్ వర్గాలు ఫాసిస్టు ప్రభుత్వాలను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. వాటిలో భాగంగానే ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులు మోదీని మూడోసారి ప్రధాని చేయడానికి తమ శక్తులను వినియోగిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికలు దేశ ప్రజల లౌకికవాద, ప్రాథమిక హక్కుల రక్షణకు సంబంధించిన అంశంగా చూడాలని, మోదీ అధికారంలోకి రాకుండా ప్రజలను సమీకృతం చేయాలని కల్యాణరావు పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విరసం అధ్యక్షుడిగా అరసవల్లి కృష్ణ, కార్యదర్శిగా రివేరా, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

తెలంగాణను లూటీ చేసిన బీఆర్ఎస్: సీతక్క

ములుగు, జనవరి 28: పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణను లూటీ చేసిందని మంత్రి సీతక్క ఆరోపించారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వలేదు గానీ కేటీఆర్ పెంచుకున్న కుక్కల కోసం ప్రగతి భవన్‌లో రూ.12 లక్షలతో ఇల్లు కట్టారని ధ్వజమెత్తారు. ములుగు జిల్లాలో ఆమె ఆదివారం పర్యటించారు. గ్రామపంచాయతీ నూతన భవనాలు, మేడారం జాతర భక్తుల సౌకర్యార్థం నిర్మించిన విడిది షెడ్లను ప్రారంభించారు. రాయినిగూడెంలో లక్నవరం లోతట్టు ప్రాంతాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. ములుగు మండలం గుర్తూరుతండాలో జీపీ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లక్షల కోట్ల ప్రజాధనాన్ని గత ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను పునర్నిర్మిస్తోందని, ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని తెలిపారు.

స్పెయిన్‌లో ముగిసిన జూపల్లి పర్యటన

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక, అబ్కారీశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పెయిన్ పర్యటన ముగించుకుని ఆదివారం హైదరాబాద్ చేరుకున్నారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో ఎఫ్ఐటీయూఆర్- 2024 పేరుతో అంతర్జాతీయ టూరిజం ట్రేడ్ ఫెయిర్ జరిగింది. ఇందులో పాల్గొనేందుకు ఈ నెల 23న మంత్రి జూపల్లి మాడ్రిడ్ బయలుదేరి వెళ్లారు. అంతర్జాతీయ టూరిజం ట్రేడ్ ఫెయిర్‌లో తెలంగాణ పర్యాటకశాఖ తరపున అధికారులతో కలిసి మంత్రి పాల్గొని పర్యాటకుల కోసం రాష్ట్రంలో నూతనంగా కల్పించిన సౌకర్యాల గురించి వివరించారు. ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకున్న మంత్రి జూపల్లికి పలువురు పర్యాటకశాఖ అధికారులు, కాంగ్రెస్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు.

31న ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త: పొన్నం

» 45 మందికి కారుణ్య నియామక పత్రాల అందజేత

భగత్‌నగర్, జనవరి 28: ఆర్టీసీ ఉద్యోగులకు ఈ నెల 31న శుభవార్త చెప్తామని, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్-2 డిపోలో ఆదివారం కరీంనగర్, ఖమ్మం రీజియన్లకు చెందిన 45 మందికి కారుణ్య నియమాక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలోని 43 వేల మంది ఉద్యోగులు నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తూ లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని అభినందించారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి పూర్వవైభవం వచ్చిందన్నారు. పథకాన్ని సమర్థంగా నిర్వహించడానికి బస్సులు, ఉద్యోగుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మరో వెయ్యి బస్సులను కొనుగోలు చేస్తామని, మూడు వేల మంది ఉద్యోగులను నియమిస్తామని తెలిపారు.

తక్షణమే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలి

» ప్రత్యేక అధికారుల విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం: తమ్మినేని

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచుల కాలపరిమితి ఈ నెల 31తో ముగుస్తున్న నేపథ్యంలో తక్షణమే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. ఈ విషయమై ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. పాలక వర్గాలను రద్దుచేసి ప్రత్యేక అధికారులను నియమించాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలిచ్చినట్లు సమాచారం ఉందని, స్పెషల్ ఆఫీసర్ల పాలనను సీపీఎం రాష్ట్ర కమిటీ వ్యతిరేకిస్తోందని తమ్మినేని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు కృషి చేశారని, బిల్లులు రాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక 28మంది సర్పంచ్‌లు ఆత్మహత్యకు చేసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీల నిధులను వెంటనే విడుదల చేయడంతో పాటు, పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని తమ్మినేని లేఖలో పేర్కొన్నారు.

సీఎం కాలేదనే కేటీఆర్ ఇబ్బంది పడుతున్నారు

» సర్కార్‌పై శాపనార్థాలు..కుళ్లు బుద్ధికి నిదర్శనం: నారాయణ

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పదవి రానందుకే కల్వకుంట్ల తారకరామారావు ఇబ్బంది పడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు అసంబద్ధంగా మా ట్లాడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై శాపనార్థాలు పెట్టడంతో వారి కుళ్ళు బుద్ధి బయటపడిందని అన్నారు. గవర్నర్ కోటాలో కోదండరామ్ ఎమ్మెల్సీగా నియమితులు కావడం పట్ల నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో సీపీఐ జాతీయ సమితి సమావేశాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బిహార్ సీఎం నితీశ్ వ్యవహారంపై స్పందిస్తూ.. ఓటమి భయంతో నే 'ఇండియా కూటమి'ని బీజేపీ ప్రభుత్వం బలహీనపర్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

వీధి లైట్లు తీసేసి.. రాళ్లు రువ్వి..!

పల్నాడు జిల్లాలో వైసీపీ మూకల బరితెగింపు

మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణపై పథకం ప్రకారం దాడి

ముప్పాళ్ల, జనవరి 28: పల్నాడు జిల్లాలో వైసీపీ శ్రేణులు మరింత బరితెగించాయి. వీధి దీపాలు ఆర్పేసి.. చీకట్లో ఇళ్లపై నుంచి మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణపై రాళ్లు రువ్వారు. అయితే ఆయన త్రుటిలో తప్పించుకున్నారు. దాడిలో అయన వ్యక్తిగత సహాయకుడు సహా ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటనతో ముప్పాళ్ల మండలం తొండపిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సత్తెనపల్లె టీడీపీ అభ్యర్థి అయిన కన్నా.. ఆదివారం రాత్రి ఈ గ్రామంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ' కార్యక్రమం చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా వెళ్తుండగా షాదీఖానా బజార్లో వీధిలైట్లు ఆపేసి వైసీపీ కార్యకర్తలు డాబాలపై నుంచి రాళ్ల దాడి చేశారు. కన్నా పీఆర్‌వో స్వామి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అయన పీఏ శ్రీధర్, ముప్పాళ్ల మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు కూడా గాయపడ్డారు. పోలీసులు గ్రామంలో ఉండగానే ఈ ఘటన జరిగింది. దాడి చేసిన అనంతరం గ్రామంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు. గ్రామంలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరుతున్న నేపథ్యంలో సభ ఏర్పాటు చేశారు. దీనిని జీర్ణించుకోలేని వైసీపీ మూకలు ఈరాళ్ల దాడికి తెగబడ్డాయి. డీఎస్పీ ఆదినారాయణ తొండపి చేరుకుని సభను నిలిపివేయాలని కోరడంతో టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. డీఎస్పీపై కన్నా మండిపడ్డారు. అనంతరం జరిగిన సభలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు.

సీఎంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ భేటీ!

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆయనతో గంటకు పైగా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి వచ్చి ప్రకాశ్‌గౌడ్‌కు కాంగ్రెస్ కండువాను పోలిన కండువాను కప్పారు. దీంతో ఆయన కాంగ్రెస్‌లో చేరారంటూ విస్తృత ప్రచారం జరిగింది. ఇటీవలే మంత్రి పొన్నం ప్రభాకర్, స్వామిగౌడ్.. ప్రకాశ్‌గౌడ్ నివాసానికి వెళ్లి ఆయనతో భేటీయై చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలోనే ఆయన రేవంత్‌ను స్వయంగా వచ్చి కలవడం ఆసక్తికరంగా మారింది. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ కాంగ్రెస్ నేతలు మధు యాష్కీ, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు వ్యాఖ్యానించడం.. తాజాగా చోటుచేసుకుంటున్న పరిణామాలు బీఆర్ఎస్‌ను టెన్షన్ పెడుతున్నట్లు సమాచారం. ఇటీవల నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేవంత్ కలవడంతో ఊహాగానాలు ఊపందుకోగా.. ఆ నలుగురు ప్రెస్‌మీట్ పెట్టి మరీ.. తాము కేవలం అభివృద్ధిపై చర్చించేందుకే సీఎంను కలిశామని క్లారిటీ ఇచ్చారు. రెండ్రోజుల కిందట సీఎంను మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కూడా కలిశారు. అయితే బీఆర్ఎస్ నేతలు వరుసపెట్టి రేవంత్‌ను కలుస్తున్న నేపథ్యంలో రానున్న లోక్‌సభ ఎన్నికల నాటికి ఏం జరుగుతుందోనన్నది ఆసక్తికరంగా మారింది.

నియోజకవర్గ సమస్యలపైనే కలిశా: ప్రకాశ్ గౌడ్

తాను కాంగ్రెస్ పార్టీ చేరినట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. తన నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసమే సీఎంను మర్యాదపూర్వకంగా కలిశానని చెప్పారు. కొత్వాల్ గూడ, బహదూర్‌గూడ, ఘన్‌సీమియాగూడ గ్రామాల్లోని భూసమస్యలకు పరిష్కారం చూపాలని, అలాగే అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరినట్లు వెల్లడించారు. దీని వెనుక రాజకీయ ఉద్దేశం ఏమీ లేదని వివరణ ఇచ్చారు.

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి రేవంత్ సంసిద్ధం

» ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లిలో..5న కొడంగల్‌లో పర్యటన



హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందే ప్రజలకు మధ్యకు వెళ్లి.. కాంగ్రెస్ తరఫున ప్రచారానికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. ఓవైపు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూనే.. మరోవైపు పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభలు ఏర్పాటు చేసి.. జనానికి చేరువయ్యేలా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. అందులో భాగంగానే సీఎం ఇంద్రవెల్లి, కొడంగల్ పర్యటనలు ఖరారయ్యాయి. ఫిబ్రవరి 2న ఉదయం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో ఉన్న నాగోబా దేవాలయాన్ని ఆయన సందర్శిస్తారు. అదేవిధంగా అమరుల స్మారక స్థూపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కాంగ్రెస్ నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. అదేవిధంగా 5వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో పర్యటించనున్నారు. అక్కడ నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం అక్కడ ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

బడ్జెట్ సమావేశాల్లోనే కులగణన తీర్మానం

(మొదటిపేజీ తరువాయి)



చివరిసారిగా 1931లో జరిగింది. అంటే దాదాపు 93ఏళ్ల క్రితం. నాటి నుంచి కులాలవారీ లెక్కలకు ఆ గణాంకాలు, వివరాలే ఆధారంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలు రాష్ట్రాల ప్రభుత్వాలు గత ఏడాది నుంచీ కులగణనకు నడుంబిగించాయి. బిహార్‌లో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తికాగా.. కర్ణాటకలో కులగణన పూర్తయినా నివేదిక విడుదల చేయడానికి అక్కడి కాంగ్రెస్ సర్కారు వెనుకాడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ సర్కారు సర్వే చేస్తోంది.

అధ్యయనానికి బృందాలు..

తెలంగాణలో కులగణనకు సిద్ధమైన సర్కారు.. అందుకు అవలంబించాల్సిన విధానాలు, తీసుకోవాల్సిన చర్యల గురించి తెలుసుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం దేశంలో ఇప్పటికే కులగణన చేపట్టిన, లేదా చేస్తున్న రాష్ట్రాలకు వెళ్లి అధ్యయనం చేసి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బిహార్‌లో నితీశ్ సర్కారు కులగణన ప్రక్రియను రెండు దఫాలుగా నిర్వహించింది. ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయినప్పటికీ.. సేకరించిన వివరాల్లో కొన్నింటిని ప్రభుత్వం తనకు అనుకూలంగా మలుచుకున్నదనే ఆరోపణలు వినిపించాయి. దీంతో బీహార్ కులగణన అంశం సుప్రీంకోర్టుకు చేరింది. ఇక కర్ణాటక ప్రభుత్వం కూడా సోషియో ఎకనమిక్ అండ్ ఎడ్యుకేషన్ సర్వే పేరుతో కులగణనను నిర్వహించింది. మరోవైపు ఏపీ ప్రభుత్వం కూడా ఇటీవలే ఈ ప్రక్రియను ప్రారంభించింది. ఆయా రాష్ట్రాల్లో కులగణనకు అవలంబించిన, అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కొంతమంది అధికారులు, మేధావులతో కూడిన బృందాలను ఏర్పాటుచేయనున్నట్టు సమాచారం. కులగణనకు సంబంధించి బిహార్ ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణలు, అందుకు గల కారణాలపైనా పూర్తి వివరాలను తెలుసుకోని.. అలాంటి పరిస్థితులు తెలంగాణలో తలెత్తకుండా ఈ ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

తేలనున్న లెక్కలు!

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించదల్చిన కులగణన పూర్తయితే.. రాష్ట్రంలో ఎన్ని కులాలున్నాయి? వాటికి అనుబంధంగా ఉన్న ఉపకులాలవారీగా జనాభా ఎంత? వంటి లెక్కలు మొత్తం తేలనున్నాయి. ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న 1931నాటి గణాంకాలు మినహా మళ్లీ ఇప్పటివరకూ ఆ రకమైన లెక్కలు లేవు. 2014లో అప్పటి ప్రభుత్వం ఒక్కరోజులో సమగ్ర కుటంబ సర్వే నిర్వహించగా.. రాష్ట్రంలో ఎస్సీలు 18శాతం, ఎస్టీలు 10శాతం, ఓసీలు 21శాతం, బీసీలు 51శాతం ఉన్నట్టు వెల్లడైంది. ఆ లెక్కల ప్రకారం ఆయా కులాలను వర్గీకరించి, కులాల వారీగా రిజర్వేషన్లు ఇవ్వాలనే డిమాండ్లున్నాయి.

వర్గీకరణకు మార్గం సుగమం..

1994 నుంచి ఎస్సీ వర్గీకరణ డిమాండ్ ఉన్న సంగతి తెలిసిందే. కులగణన నిర్వహించి, ఉపకులాల లెక్క తేల్చి కులాల వారీగా ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించి, దాని ప్రకారం రిజర్వేషన్‌ను అమలుచేయాలన్నది దాని ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. ఎస్సీల జనాభా పెరగడం, సమగ్ర కుటుంబ సర్వేలోనూ వారు అధికంగా ఉన్నట్టు తేలడంతో తమ రిజర్వేషన్‌ను 19 శాతానికి పెంచాలని ఆయా వర్గాలు కోరుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'అణగారిన వర్గాల విశ్వరూప మహాసభ'కు ముఖ్య అతిథిగా వచ్చిన ప్రధాని మోడీ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. ఇటీవల అందుకోసం ఒక కమిటీని కూడా ఏర్పాటుచేశారు. కాగా.. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు హయంలో మాత్రమే ఎస్సీలకు ఏ, బీ, సీ, డీ విధానంలో కొంతకాలం రిజర్వేషన్లు అమలయ్యాయి. ఇక.. ఎస్టీలకు ప్రస్తుతం 10శాతం రిజర్వేషన్‌లు అమలవుతుండగా దానినీ పెంచాలనే డిమాండ్ ఉంది. బీసీల నుంచి కూడా ఇలాంటి డిమాండ్లే ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీల్లో 128 కులాలున్నాయి. తెలంగాణ ఏర్పడే నాటికి బీసీల్లో 112 కులాలుండగా.. ఆ తర్వాత మరో 16 కులాలను చేర్చారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం, 1931లో నిర్వహించిన కులగణన ప్రకారం కూడా.. బీసీలే అధికంగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వాటి ప్రకారం తమకు రిజర్వేషన్‌ను కల్పించడంతో పాటు, రాజకీయంగానూ అదే స్థాయిలో ప్రాధాన్యమివ్వాలని బీసీలు కోరుతున్నారు. ఈనేపథ్యంలో.. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజుల్లోనే కులగణన డిమాండ్‌పై ఒక నిర్ణయం తీసుకుని, ఆ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలంటూ సీఎం రేవంత్ అధికారులను ఆదేశించడంపై ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. సర్కారు ఈ ప్రక్రియను పూర్తిచేస్తే వర్గీకరణకు మార్గం సుగమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

న్యాయం దిశగా తొలి అడుగు

» రాష్ట్రంలో కులగణనకు ఏర్పాట్లపై రేవంత్ రెడ్డికి రాహుల్ అభినందన



న్యూఢిల్లీ, జనవరి 28: తెలంగాణలో కులగణన చేపడతామని ప్రకటించడం ద్వారా 'న్యాయం దిశగా తొలి అడుగు' వేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఆయన ప్రభుత్వాన్ని అభినందించారు. దేశ సంపద సమాజంలోని ప్రతి వర్గానికి న్యాయబద్ధంగా దక్కాలంటే కులగణన ఒక్కటే మార్గమని రాహుల్ పేర్కొన్నారు. 'న్యాయానికి తొలి అడుగు.. కులగణన. ఏ సమాజంలోనైనా దాని సామాజిక, ఆర్థిక స్థితిగతులు తెలియకుండా సరైన ప్రణాళికలు రూపొందించడం అసాధ్య'మని 'ఎక్స్'లో హిందీలో ఓ పోస్టు చేశారు. కాగా,ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ శనివారం నిర్వహించిన సమావేశంలో అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే.

సీఎం నిర్ణయం భేష్: కృష్ణయ్య

రాంనగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన చేయాలని, బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, స్కాలర్‌షిప్‌లు పెంచాలని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి బీసీ స్టడీ సర్కిల్స్ మంజూరు చేయాలని, ఫీజు బకాయిలు చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకొని సంబంధిత శాఖలకు ఆదేశాలివ్వడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన బీసీ సంఘాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కులు, నిధులు, ఉద్యోగాలు పొందాలంటే కులగణన చాలా అవసరమని, సీఎం ఆ దిశగా నిర్ణయాలు తీసుకోవడం బీసీలకు హర్షణీయమని అన్నారు.

'పాలమూరు-రంగారెడ్డి' జాతీయ హోదాకు కృషి

» ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి

» తెలంగాణభవన్‌లో బాధ్యతల స్వీకరణ

» కేసీఆర్ దోపిడీలో మోదీకి భాగం: యాష్కీ

న్యూఢిల్లీ/బర్కత్‌పుర/హైదరాబాద్/తార్నాక, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం కృషి చేస్తానని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి అన్నారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ సమక్షంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, అనిరుధ్ రెడ్డి, వంశీకృష్ణ, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, సీనియర్ నేత మధు యాష్కీ గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ.. గతంలో రాజశేఖర్‌రెడ్డి హయాంలో నాలుగేళ్లు ప్రత్యేక ప్రతినిధిగా పనిచేసిన అనుభవం తనకుందన్నారు. కేంద్రంలోని మంత్రులు, అధికారులతో మాట్లాడి తెలంగాణకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తనను ప్రత్యేక ప్రతినిధిగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి బరిలో దిగుతానని, ఎంపీగా గెలిచిన ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా రెండు బాధ్యతలు సమర్థంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. మధు యాష్కీ మాట్లాడుతూ.. తెలంగాణలో దోచుకుని దాచుకున్న దాంట్లో నుంచి కోట్లాది రూపాయలను మాజీ సీఎం కేసీఆర్ బీజేపీకి కప్పం కింద చెల్లించారని ఆరోపించారు. లిక్కర్ స్కాంలో కవితను మోదీ ప్రభుత్వం అరెస్టు చేయకపోవడం.. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య బంధాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ ఫాంహౌస్‌పై త్వరలో దాడి చేసి వందల కోట్ల అవినీతి సొమ్మును బయటకు కక్కిస్తామని చెప్పారు. కాగా, గాంధీభవన్‌లో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్ల అడుగులకు మడుగులొత్తుతూ తెలంగాణను అభాసుపాలు చేశారని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటు బయటపడి 3 నెలలు దాటినా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోకుండా దాటవేసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఓయూ పూర్వ విద్యార్థి అయిన కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి పేరుతో వర్సిటీలో పరిశోధక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ విజ్ఞప్తి చేశారు.

సీఎం రేవంత్ నిర్ణయం చరిత్రాత్మకం: వీహెచ్

రాష్ట్రంలో కులగణనతో బీసీల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, సీఎం రేవంత్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైందని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. సేవారంగంలో మున్నూరు కాపులు ముందున్నారని, రాజకీయ రంగంలోనూ వారు తమ వంతు పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లోని కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేసిన అనంతరం వీహెచ్ మాట్లాడారు.

పీహెచ్‌సీలు ఇకపై.. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు

పల్లె/బస్తీ దవాఖానాలు.. అర్బన్ హెల్త్‌సెంటర్లు కూడా.. ఉపశీర్షికగా 'ఆరోగ్యం పరమం ధనం'

» వెంటనే బ్రాండింగ్ చేయండి

» ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం



హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో వైద్య సేవలందించే ఆరోగ్య కేంద్రాలన్నీ 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్'లుగా మారనున్నాయి. వాటికి ఉప శీర్షికగా 'ఆరోగ్యం పరమం ధనం' కొనసాగనుంది. ఈ మేరకు కేంద్ర వైద్యఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదేశాలను జారీ చేసింది. రాష్ట్రంలోని 4,636 కేంద్రాలకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా బ్రాండింగ్ జరుగుతోంది. దేశవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలన్నింటినీ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లుగా పిలుస్తున్నారు. తెలంగాణలో మాత్రం గత ప్రభుత్వం వాటిని పల్లె దవాఖానాలుగా మార్చింది. నిజానికి పల్లె దవాఖానాలన్నింటికీ కేంద్రమే నిధులిచ్చింది. అయితే.. వాటిని రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేసినట్లుగా గత ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. ఆ కేంద్రాలకు ఆయుష్మాన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలుగా బ్రాండింగ్ చేయాలని గతంలో కేంద్ర వైద్యశాఖ ఆదేశాలిస్తూ.. అలా చేస్తేనే నిధులను మంజూరు చేస్తామని స్పష్టం చేసింది. గత ప్రభుత్వం వాటిని పల్లె దవాఖానాలుగానే కొనసాగించడంతో.. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఇచ్చే నిధులను కేంద్రం నిలిపివేసింది. ఆ తర్వాత పల్లెదవాఖాన.. హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలుగా వాటికి ఎన్‌హెచ్‌ఎమ్ అధికారులు బ్రాండింగ్ చేశారు. దాంతో ఎన్‌హెచ్‌ఎమ్ నిధులను కేంద్రం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 4,636 క్షేత్రస్థాయి ఆస్పత్రులను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా బ్రాండింగ్ చేస్తున్నారు. రెండ్రోజులుగా ఆ పనులు చకచకా సాగుతున్నాయి. ఈ నెలాఖరులోగా వీటిని ఆరోగ్య మందిర్‌గా మార్చి, వాటి ఫొటోలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ కేంద్రాల్లో 3,292 పల్లెదవాఖానాలు, 645 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 251 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీదవాఖానాలు, 393 ఆయుష్ ఆరోగ్య కేంద్రాలున్నాయి.

ఆరు లోగోలు..

వైద్య సేవలందించే కేంద్రాలన్నీ ఒకే రకంగా ఉండాలని, దాంతో అవి వైద్య కేంద్రాలనే భావన ప్రజల్లో కలుగుతుందనే ఉద్దేశంతో కేంద్రం ఈ బ్రాండింగ్‌ను అమలు చేస్తోంది. వీటన్నింటికీ రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎమ్ అధికారులు బ్రాండింగ్ చేయిస్తున్నారు. అన్ని కేంద్రాలకు యెల్లోమెటల్ పెయింటింగ్ వేయిస్తున్నారు. దానిపై ఆరు రకాల లోగోలుంటాయి. ఒక్కో లోగో ఒక్కో రకమైన వైద్య సేవలందిస్తుందని దాని అర్థం. గర్భిణులకు పరీక్ష చేయడం, ధ్యానం చేసే లోగో, చిన్నారులకు టీకా, వైద్య పరీక్షలు చేయడం, కౌన్సెలింగ్, పెద్దలకు వైద్య సేవలు, ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా లోగోలను ఏర్పాటు చేస్తున్నారు.

సిబ్బంది ఇలా..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,292 పల్లెదవాఖానాల్లో ప్రస్తుతం 368 మంది ఎంబీబీఎస్, 1080 మంది ఆయుష్ వైద్యు లు, 1453 మంది స్టాఫ్‌నర్సులు, 117 మంది ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. 188 ఖాళీలున్నాయి. గతం లో ఈ సబ్‌సెంటర్లలో ఆశాలు, ఎఎన్ఎంలు మాత్ర మే అందుబాటులో ఉండేవారు. వీటిని పల్లె దవాఖానాలుగా మార్చాక.. ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులోకి వచ్చారు. కొన్నిచోట్ల ఎంబీబీఎస్ వైద్యులు ఆసక్తి చూపకపోవడంతో ఆయుష్ వైద్యులను నియమించారు. వారు కూడా ఆసక్తి కనబర్చనిచోట.. స్టాఫ్ నర్సులను నియమించారు. ఉదయం 9 నుంచి సాయం త్రం 4 గంటల వరకు పనిచేసే ఈ దవాఖానాల్లో 14 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందజేస్తున్నారు. ర్యాపిడ్ కిట్లతో జరిపే పరీక్షల ఫలితాలను వెంటనే అందజేస్తున్నారు. దాంతో.. వెనువెంటనే వ్యాధి నిర్ధారణ జరిగి, తక్షణ చికిత్సకు ఆస్కారమేర్పడుతోంది. ఇక్కడ 105 రకాల ఔషధాలు అందుబాటులో ఉంటాయి.

గ్రామానికో రెవెన్యూ ఉద్యోగి

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రెవెన్యూ వ్యవస్థను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఆయన తెలిపారు. గతంలో ఏ చిన్న గ్రామంలో చూసినా గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) లేదా గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) ఎవరో ఒకరు ఉండేవారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు చేస్తున్న తప్పులను బయటపెడతారని వీఆర్వో వ్యవస్థను భ్రష్టుపట్టించి గాలిలో పెట్టి.. చివరకు అసలు లేకుండా చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వానికి అలాంటి ఉద్దేశం లేదన్నారు. వందల ఏళ్ల నుంచి భూములను కాపాడుతూ.. ప్రభుత్వం, ప్రజలకు వారధిగా ఉన్న వ్యవస్థ రద్దుతో గ్రామ స్థాయిలో ప్రజలు చెప్పేది వినే యంత్రాంగం లేకుండా పోయిందని పేర్కొన్నారు. తాతలు, తండ్రులు కష్టపడి ఆస్తులను కూడబెడితే.. బీఆర్ఎస్ ప్రభుత్వం వారి తొత్తులకు కట్టపెట్టిందని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు. రెవెన్యూ ఉద్యోగుల సహకారంతో ఇలాంటివాటిని పేదలకు పంపిణీ చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నట్లు తెలిపారు.

ప్రజలకు మేలు చేసేలా సంస్కరణలు

ధరణిని తీసుకొచ్చి ప్రజలను కొత్త ఇబ్బందులకు గురిచేశారని పొంగులేటి అన్నారు. సామాన్యులు, గ్రామీణ ప్రాంత వ్యక్తులకు ప్రభుత్వ సంస్కరణలు, చట్టాలు ఉపయోగపడాలని.. కానీ కేసీఆర్ ప్రభుత్వం వక్రమార్గంలో ధరణిని తెచ్చిందని వ్యాఖ్యానించారు. దీని కారణంగా పేదలు పడిన ఇబ్బందుల ఫలితమే.. ప్రభుత్వం మారాలనే బలమైన కాంక్ష ఏర్పడేందుకు కారణమైందన్నారు. ధరణి ప్రక్షాళనతో సామాన్యులకు మేలు చేసే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టామని చెప్పారు. ధరణిని అడ్డం పెట్టుకుని గత ప్రభుత్వంలో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు మాయం చేశారని పొంగులేటి అన్నారు. ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని.. వీటన్నిటిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్యాయంగా భూములు పోగొట్టుకున్నవారికి న్యాయం చేస్తామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో స్వేచ్ఛ

బీఆర్ఎస్ సర్కారులో 10-25 తేదీల వరకు జీతాలు ఇచ్చేవారని. కానీ, ప్రతి ఉద్యోగికి 5వ తేదీ లోపే జీతం పడేలా చూడడం తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పాలనలో వ్యక్తి స్వేచ్ఛను హరించారని.. సామాన్యుడే కాదు ఏ ఉద్యోగి కూడా మాట్లాడే పరిస్థితి లేకుండా పోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సర్కారు రాకతో అందరికీ గాలి పీల్చుకునే అవకాశం వచ్చిందన్నారు. ఉద్యోగులంతా దీవించడంతోనే ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు జరిగిందని వివరించారు. ఇదివరకు ఒకరిద్దరు తప్పు చేస్తే అందరినీ ఇబ్బందిపెట్టారని.. ఇప్పుడు ఎవరికీ నష్టం జరగకుండా మంచి చేసేలా ఉద్యోగులందరూ సహకరించాలని కోరారు. పేదల కష్టాల్లో అందరం భాగస్వాములు కావాలన్నారు. ఉద్యోగుల కష్టాలలో తామ భాగం అవుతానన్నారు. పూర్తి విశ్వాసంతో కష్టపడి మంచి జరిగేలా పనిచేయాలని కోరారు. బంజారాహిల్స్‌లో జరిగిన కార్యక్రమానికి డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి అధ్యక్షత వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శులు కె.రామకృష్ణ, రమేష్‌రాథోడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, పద్మప్రియ, తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడు రాములు, ప్రధానకార్యదర్శులు రమేష్ పాక, ఫూల్‌సింగ్ చౌహన్, ఆరేటి రాజేశ్వర్, శ్రీనివాస్‌శంకర్, పుష్పమి, ఎస్పీఆర్ మల్లేష్ పాల్గొన్నారు.



లష్కర్ భక్తులతో పోటెత్తిన కొమురవెల్లి

చేర్యాల, జనవరి 28: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లిఖార్జునస్వామి ఆలయం వేలాదిమంది లష్కర్‌భక్తులతో పోటెత్తింది. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో వారమైన లష్కర్‌వారాన్ని పురస్కరించుకుని ఆదివారం సికింద్రాబాద్‌కు చెందిన వేలాదిమంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. మల్లన్న, ఎల్లమ్మ దేవతల నామ స్మరణతో ఆధ్యాత్మిక తన్మయత్వం చెందారు. తలనీలాలు సమర్పించుకుని కోనేటిలో పుణ్యస్నానమాచరించి మల్లన్నకు బోనం నివేదించి పట్నాలు వేశారు. తమ కోరికలు నెరవేర్చాలని ఆలయ ప్రాంగణంలోని గంగరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. అలాగే ఎల్లమ్మ దేవతకు బోనం చేసి డప్పుచప్పుళ్ల హోరుతో, పూనకంతో శివమెత్తి దేవతల నామ స్మరణతో గుట్టపైకి ఎక్కి బోనాన్ని సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో స్వామివారి దర్శనానికి 3గంటల సమయం పట్టింది.




మేడారంలో భక్తుల కోలాహలం

ములుగు, జనవరి 28: ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు సమయం దగ్గరపడుతున్న తరుణంలో భక్తుల రాక అధికమైంది. ఆదివారం లక్షలాది మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. గద్దెల పరిసరాలు జనంతో నిండిపోయాయి. పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులతో జంపన్నవాగులో సందడి నెలకొంది. వేలాది వాహనాలు బారులు తీరడంతో నార్లాపూర్ నుంచి మేడారం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రధాన జాతరను తలపించేలా భక్తుల కోలాహలం కనిపించింది. వనదేవతలను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వర్‌రావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ సవిత దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎమ్మెల్సీగా నాకు కొత్త బాధ్యత

» ఉద్యమకారుడిగా కాంగ్రెస్ నన్ను గుర్తించింది: కోదండ



హుజూరాబాద్, జనవరి 28: ఉద్యమకారుడిగా తనను కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిందని, ఇది తనకు కొత్త బాధ్యత అని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రజాస్వామ్య స్ఫూర్తితో పని చేస్తానని ఆయన స్పష్టం చేశారు. హుజూరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన పీవీ జిల్లా సాధన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయి ప్రసంగించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంఘాలను చీల్చి ఘర్షణ వాతావరణం నెలకొల్పిందని విమర్శించారు. డబ్బులతో ఏమైనా చేయవచ్చనే అహంభావం బీఆర్ఎస్ నాయకుల్లో ఉందని, వారి ధోరణిని ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజాస్వామిక పాలన అందించడమే కాంగ్రెస్ లక్ష్యమని, తెలంగాణ అభివృద్ధి కోసం వారితో కలిసి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ జన సమితి (టీజేఎస్) పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయబోమని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కోసం సహకరిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలను అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిందని, హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా ఏర్పాటు చేయడం కోసం తన వంతుగా కృషి చేస్తానని కోదండరాం హామీ ఇచ్చారు.

తెలంగాణలో పది సీట్లు గెలుస్తాం

» బీఆర్ఎస్‌కు మూడో స్థానమే: బండి సంజయ్



కమలాపూర్, జనవరి 28: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో పది సీట్లు గెలుస్తామని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మూడో స్థానానికే పరిమితమవుతుందని చెప్పారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలోని రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను ఆదివారం సాయంత్రం రైల్వే అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. గడువులోగా బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. అనంతరం సంజయ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని అన్నారు. ఆయన తండ్రి పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి వచ్చాడని.. తాను పోరాటాలు చేసి పైకి వచ్చానని పేర్కొన్నారు. తాను హిందు ధర్మం కోసం మాట్లాడితే తనను మఠం పెట్టుకోవాలని కేటీఆర్ అంటున్నాడని.. పదే పదే ముస్లింల గురించి మాట్లాడుతున్న కేటీఆర్ మసీదు కట్టుకొని నమాజ్ చేయాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో లేకుండా ఫాంహౌజ్‌లో ఉన్న కేసీఆర్‌కు సీఎం పదవి అవసరం లేదని.. ఆయన బార్ కట్టుకోవాలని విమర్శించారు.

ఇండియా కూటమి చెల్లాచెదురు

» కేటీఆర్‌కు మతిభ్రమించి బీజేపీపై విమర్శలు: లక్ష్మణ్



హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమి చెల్లాచెదురవుతోందని ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ అంటేనే అవినీతి.. అవినీతి అంటేనే కాంగ్రెస్ అని విమర్శించారు. తమ దొంగతనాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే.. తెలంగాణలో త్వరలో ఈడీ దాడులు జరుగుతాయని చెప్పారని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై జ్యుడీషియల్ విచారణ అంటూ కాలయాపన చేయడం.. బీఆర్ఎస్‌ను లొంగదీసుకోవడానికేనా? లేక ప్రలోభాలకు లోనవుతున్నారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు ముసుగులో గ్యారెంటీల అమలును వాయిదావేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ ఒకటే అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్య చూస్తే ఆయనకు మతిభ్రమించినట్లుగా ఉందని లక్ష్మణ్ విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ దేశంలో ఎక్కడా నిలదొక్కుకునే పరిస్థితి లేదని.. తెలంగాణలో కూడా నిలబడుతుందని ఎవరూ ఆశించాల్సిన అవసరం లేదని లక్ష్మణ్ అన్నారు.

కేసీఆర్ కాలిగోటికీ
రేవంత్‌రెడ్డి సరిపోడు

(మొదటిపేజీ తరువాయి)

వాళ్లు వస్తారు.. పోతారన్నారు. వాళ్లకు కాలం కలిసొచ్చి తంతే గారెల బుట్టలో పడ్డారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి కాదని, ఢిల్లీ ద్వారా మేనేజ్‌మెంట్ కోటాలో మాణిక్కమ్ ఠాగూర్‌ను మేనేజ్ చేసి రూ. 50 కోట్లు ఇచ్చి, నలుగురిని పోగేసుకుని పదవి తెచ్చుకున్నాడని ఆరోపించారు. కొత్త ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని, వంద రోజులు ఓపిక పట్టాలని కేసీఆర్ చెప్పారని తెలిపారు. తాము నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఉంటామని, ప్రభుత్వానికి సహకరిస్తామని, తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రజలపక్షాన నిలబడుతామని చెప్పామన్నారు. రెండుసార్లు అధికారం ఇచ్చిన ప్రజలకు సర్వదా రుణపడి ఉంటామన్నారు. కొత్తగా ప్రతిపక్ష పాత్ర ఇచ్చారని, దానిలో రాణిస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో కంటే ప్రతిపక్షంలోనే డేంజర్ అని, ప్రజలపక్షాన చీల్చిచెండాడడంలో, ప్రశ్నించడంలో కేసీఆర్ కంటే పదునైన గొంతు భారతదేశంలో ఎక్కడా లేదని కేటీఆర్ చెప్పారు.

పోయింది అధికారం మాత్రమే.. పోరాట పటిమకాదు

రాష్ట్రంలో రైతు భరోసా ప్రారంభించామని దావోస్‌లో ఉన్నప్పుడు రేవంత్ చెప్పారని, విదేశాల్లో పచ్చి బోగస్ మాటలు మాట్లాడాడని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధుకే ఇప్పటివరకు దిక్కులేదన్నారు. కేసీఆర్‌ను నాలుగు తిట్లు తిట్టి ప్రజల దృష్టిని మళ్లించి తప్పించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. సిరిసిల్లలో నేతన్నలను కాపాడుకుంటామని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరూ లేని నాడే తెలంగాణ తెచ్చామని, గులాబీ జెండా పెద్ద వాళ్లను తట్టుకొని నిలబడిందని పేర్కొన్నారు. పోయింది అధికారం మాత్రమేనని.. పోరాట పటిమ కాదని, సత్తా తగ్గలేదని కేటీఆర్ అన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ విఫలమయ్యారని ఆరోపించారు. లోక్‌సభలో ఒక్క చర్చలో కూడా పాల్గొనలేదని, ఒక్క బిల్లు పెట్టలేదని విమర్శించారు. దేవుడి పేరిట ఓట్లు అడగడమే ఆయనకు తెలుసన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో అంటే దేశమంతా 'కాంగ్రెస్ ఛోడో' అంటోందని, బీజేపీని నిలువరించడం కాంగ్రెస్‌తో సాధ్యం కాదని చెప్పారు. బీజేపీని ఆపే సత్తా బలమైన ప్రాంతీయ నాయకులు కేసీఆర్, మమతా బెనర్జీ లాంటి వాళ్లకే ఉందన్నారు. సిరిసిల్ల నుంచి కేటీఆర్ పోతున్నాడని వదంతులు పుడుతున్నాయని, ఎవరూ నమ్మవద్దని, తనకు రాజకీయ జన్మనిచ్చింది సిరిసిల్ల అని.. రాజకీయాల్లో ఉన్నన్నాళ్లు ఇక్కడే ఉంటానని, ఎక్కడికీ వెళ్లనని ఆయన స్పష్టం చేశారు.





సిరిసిల్లలో సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కేటీఆర్

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని వాళ్లు కూడా అనుకోలేదని కేటీఆర్ అన్నారు. మార్పు కావాలని ఓటు వేసిన వారందరూ నెత్తి, నోరు కొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఉందని ఆటో ఎక్కితే డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడని, గతంలో రోజు వెయ్యి నుంచి రూ. 1500 వచ్చేవన్నారు. ఇప్పుడు అంత డబ్బు రావడం లేదని, ఈఎంఐలు, పిల్లల ఫీజులు ఎలా కట్టుకోవాలని ఆ డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడని చెప్పారు. ప్రభుత్వం నెలకు వెయ్యి ఇస్తామంటోందని, పది వేలు ఇచ్చేవిధంగా ప్రభుత్వంతో మాట్లాడాలని ఆటో డ్రైవర్లు తనను కోరారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, రెక్కాడితే కానీ డొక్కాడని ఆటో డ్రైవర్లను ఆదుకోవాలన్నారు.

సిరిసిల్ల బల్దియాలో అవిశ్వాసం?

» కేటీఆర్ సమావేశానికి హాజరుకాని కౌన్సిలర్లు

సిరిసిల్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మున్సిపాలిటీలో అవిశ్వాసం దిశగా కదలికలు మొదలయినట్లు తెలుస్తోంది. సిరిసిల్లలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కె.తారకరామారావు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి సిరిసిల్ల కౌన్సిలర్లు కొందరు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. 12మంది కౌన్సిలర్ల వరకు క్యాంపునకు వెళ్లారనే ప్రచారం జరుగుతోంది. ఛైర్‌పర్సన్ తీరును నిరసిస్తూ అవిశ్వాసం దిశగా యోచిస్తున్నట్లు సమాచారం.

హుందాతనం లేని రేవంత్

» పాలనలో అసహనం, ఆర్భాటం: హరీశ్

మెదక్, జనవరి 28 : సీఎం రేవంత్‌రెడ్డి హుందాతనాన్ని కోల్పోయి ప్రవర్తిస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఆదివారం మెదక్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి పాలనలో అసహనం ప్రదర్శిస్తూ, ఆర్భాటంలో ముందుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయమని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు ఎదురు దాడులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుబంధుకు నిధులు సమకూర్చుకోవాలని సూచిస్తే సెక్రటేరియేట్‌లో లంకె బిందెలేవీ లేవుగా? అని దబాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మార్చి 17 నాటికి కాంగ్రెస్ వందరోజుల పాలన పూర్తి చేసుకుంటుందని, ఆ లోగా ఆరు గ్యారెంటీలు నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు. ఎన్నికల్లో ఈసారి గెలిస్తే కేసీఆర్ ప్రజలకు సన్నబియ్యం ఇద్దామనుకున్నారని, ఈ ప్రభుత్వం ఉన్న రేషన్ బియ్యాన్నే బంద్ చేసేలా ఉందని హరీశ్‌రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం చేతులెత్తేస్తారేమోనని ఆయన సందేహం వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 6 గెలుపొందామని, లోక్‌సభ ఎన్నికల్లో ఈ స్థానాన్ని చేజిక్కించుకుంటామని ధీమా వ్యక్తంచేశారు.

పేదల కోసమే కానూరి ట్రస్ట్

» విద్యార్థులు, రైతులకు నిరంతరం సేవలందిస్తాం

» ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీరామచంద్రరావు వెల్లడి

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని పేదలను ఆదుకుని వారికి తోడుగా నిలిచేందుకే కానూరి ఆనందకుమారి మెమోరియల్, చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీరామచంద్రరావు యలమంచిలి అన్నారు. విద్యార్థులు, రైతులకు నిరంతరాయంగా సేవలందిస్తామని పేర్కొన్నారు. కానూరి ఆనందకుమారి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అమీర్‌పేట్ ధరంకరణ్ రోడ్డులోని మునిసిపల్ గ్రౌండ్‌లో ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన 30 మంది నిరుపేద రైతులకు ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున చెక్కులను అందజేశారు. శ్రీభగవాన్ మహవీర్ వికలాంగ్ సహాయత సమితి సహకారంతో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది దివ్యాంగులకు ట్రస్టు తరపున కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీరామచంద్రరావు మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో భాగస్వాములమయ్యేందుకే ట్రస్టును ఏర్పాటు చేశామని చెప్పారు. పేదలకు సాయం చేయాలనే అమ్మ ఆశయాన్ని నెరవేర్చేందుకు కుటుంబసభ్యులమంతా కృషిచేస్తున్నామని ట్రస్టీ డాక్టర్ అపర్ణ అన్నారు. తాను లండన్‌లో వైద్యురాలిగా, హైదరాబాద్‌లో చెల్లి రాగిణి ఐటీ సెక్టార్‌లో పనిచేస్తున్నామని.. తాము సంపాదించిన దానిలో 90% పేదలకు సాయం చేసేందుకు వెచ్చిస్తున్నామన్నారు. తెలంగాణ, ఏపీలో ఆత్మహత్యలు చేసుకున్న 89 మంది రైతుల కుటుంబాలకు, నిరుపేద అన్నదాతలకు 2016లో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో రూ.50వేల చొప్పున ఆర్థిక సాయం చేసి, అండగా నిలిచామన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 174మంది పిల్లలను చదివిస్తున్నామని, హైదర్‌షాకోట లోని కస్తూర్బా విద్యాలయంలో ఏటా రెండు సార్లు నిత్యావసర వస్తువులు, దుస్తులను అందజేస్తున్నామని తెలిపారు. కూకట్‌పల్లిలోని ఆలంబన స్కూల్‌లో 92 మంది పిల్లలకు స్టేషనరీ, ఇతర వస్తువులను పంపిణీ చేశామన్నారు. భవిష్యత్‌లోనూ ట్రస్టు తరపున మరింత మందికి సాయం చేస్తామని పేర్కొన్నారు. కాగా, తమ సమితి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లోని 60 వేల మంది వికలాంగులకు జైపూర్ కృత్రిమ అవయవాలను అందజేశామని శ్రీభగవాన్ మహవీర్ వికలాంగ్ సహాయత సమితి ప్రెసిడెంట్ శర్మ అన్నారు. కానూరి ట్రస్టు తరఫున ఆదివారం 100 మందికి కృత్రిమ అవయవాలను అందజేశామన్నారు. కాగా.. కానూరి ట్రస్ట్ నుంచి సాయం పొందిన నల్లగుట్ట భాగ్యలక్ష్మి తన పిల్లలను బాగా చదివిస్తానని చెప్పారు. పెద్దకుమారుడు బీటెక్ థర్డ్ ఇయర్, మూడో కుమారుడు బీటెక్ ఫస్టియర్ చేస్తుండగా.. రెండో కుమారుడు పొలంలో కూలీగా పనిచేస్తున్నట్లు ఆమె వివరించారు. జంపాని కోటేశ్వరరావు అనే రైతు మాట్లాడుతూ.. గత ఏడాది మినుము పంటలో తీవ్ర నష్టం వచ్చిందని, బీటెక్ చదువుతున్న తమ కుమారుడు, కుమార్తెకు కానూరి ట్రస్ట్ సాయం ఉపకరిస్తోందని చెప్పారు.



రైతుకు చెక్కు అందజేస్తున్న కానూరి ఆనందకుమారి ట్రస్ట్ ప్రతినిధులు

పిల్లల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించాలి

» హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్‌లో కాంగ్రెస్ నేత శశిథరూర్



హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు పుస్తక పఠనాన్ని ఓ అలవాటుగా మార్చడానికి ప్రయత్నించాలని కాంగ్రెస్ నేత, రచయిత శశిథరూర్ సూచించారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ముగింపు సమావేశానికి విచ్చేసిన ఆయన.. పిల్లల్లో పుస్తక పఠన ఆసక్తి తగ్గడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమికంగా కామిక్స్ ద్వారా వాళ్లకి పుస్తకాలని పరిచయం చేయాలని చెప్పారు. ఊహాశక్తిని పెంపొందించేవి పుస్తకాలేనని తెలిపారు. నెట్‌ఫ్లిక్స్ లాంటి ఓటీటీల్లో వచ్చే వెబ్‌సిరీస్‌లు కూడా ఎక్కువగా పుస్తకాలే ప్రేరణ అని, పిల్లల సృజనాత్మక శక్తిని క్షీణింపజేసే దృశ్యమాధ్యమాల కంటే పుస్తకాలే మేలని హితవు పలికారు. టీవీ చూడటం వల్ల మెదడు పెట్టి ఆలోచించడం మానేస్తారన్నారు. పుస్తకాల వల్ల అన్వేషణా జ్ఞానం పెరుగుతుందని, వినోదం కూడా లభిస్తుందన్నారు. తన రచనలకు, తాను ఉపయోగించే పదప్రయోగాలకు తనకున్న రీడింగ్ అలవాటే కారణమన్నారు. హిస్టరీ, పాలిటిక్స్ ఎక్కువగా చదువుతానన్న శశిథరూర్, తాను ఇటీవల చదివిన విక్టరీసిటీ పుస్తకాన్ని చదవాల్సిందిగా అందరిని కోరారు.

పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన!

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపాదించిన ప్రత్యేకాధికారుల జాబితాను పరిశీలించి.. నేడో, రేపో అధికారిక ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారి ఆదివారం జిల్లా పరిషత్ సీఈవోలు, జిల్లా పంచాయతీ అధికారులకు సూచించినట్లు సమాచారం. ఇప్పటికే సిద్ధం చేసిన జాబితా ప్రకారం పంచాయతీల వారీగా నియామకం, నిబంధనలకు తగిన విధంగా లేనివారి స్థానంలో మరొకరిని నియమించడం వంటి వాటిపై చర్చించినట్లు తెలిసింది. ప్రత్యేకాధికారులంతా మండల స్థాయి వారే. బాధ్యతలు చేపట్టిన వెంటనే.. అన్ని ఫైళ్లను వీరు స్వాధీనం చేసుకోనున్నారు. మరోవైపు ప్రత్యేక పాలన సమయంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఆదేశాలు వచ్చాక.. సంబంధిత అధికారులు గ్రామాల పర్యవేక్షణపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టేలా చర్యలు తీసుకోవాలని డీపీవోలు, సీఈవోలను రాష్ట్ర ఉన్నతాధికారి ఆదేశించినట్లు సమాచారం. కాగా, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆయా శాఖల అధికారుల్లో ఎవరైనా దీర్ఘకాలిక సెలవులో ఉంటే.. వెంటనే విధుల్లోకి రావాలని కోరుతున్నారు.

ప్రత్యేకాధికారులు వీరే..

ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మండల విద్యాధికారులు, వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యానవన శాఖ అధికారులు, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల పరిషత్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, టైపిస్టులు, గెజిటెడ్ హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ టీచర్లను ప్రత్యేకాధికారులుగా నియమించే ప్రక్రియలో ఉన్నారు. కొన్ని మండలాలు చిన్నవి కావడంతో.. పంచాయతీల సంఖ్యను బట్టి ఇతర శాఖల అధికారులసేవలను వినియోగించుకోనున్నారు. కాగా, తమ పదవీకాలం ముగుస్తుండటం, ప్రత్యేకాధికారుల పాలన రానుండడంతో సర్పంచుల్లో ఆందోళన నెలకొంది. గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం అప్పులు చేశామని, రూ.లక్షల్లో బిల్లులు అందాల్సి ఉందని పలువురు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో.. చాలామందికి రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బిల్లులు పేరుకుపోయాయని వాపోతున్నారు.

సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించాలి

» తెలంగాణ సర్పంచుల సంఘం

బర్కత్‌పుర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగుస్తుందని, వారి పదవీ కాలాన్ని జూన్ వరకు పొడిగించాలని తెలంగాణ సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. ప్రత్యేక అధికారులను నియమించకుండా గ్రామ సర్పంచులకే పూర్తి అధికారాలు ఇవ్వాలని, ఫిబ్రవరి 2లోగా పంచాయతీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.1,200 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు 30 నెలలుగా నిలిపివేశారని వారన్నారు. బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేకపోతే పంచాయతీలకు తాళాలు వేసి రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేశారని, నిధులు విడుదల కాకపోవడం వల్ల కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తే వచ్చే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అండగా ఉంటామని వారు వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రభుత్వం సర్పంచ్‌లను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైన సర్పంచ్‌లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కొలను శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీలో ఇతర రాష్ట్రాల విద్యార్థులకు 15% సీట్ల కేటాయింపు

» ఈ ఏడాది నుంచే అన్ని వర్సిటీలకు వర్తింపు

» రాష్ట్ర విద్యార్థులకు నష్టం లేకుండా అదనపు సీట్లు సృష్టించేందుకు నిర్ణయం

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) కోర్సుల్లో 15 శాతం సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలు, కాలేజీల్లో అమలు చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే రాష్ట్ర విద్యార్థులకు నష్టం లేకుండా ఇతర రాష్ట్రాల విద్యార్థులకు అదనపు సీట్లు సృష్టించనున్నారు. డిమాండ్‌ను బట్టి ఎప్పటికప్పుడు ఈ సీట్లు పెంచాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది (గత ప్రభుత్వ హయాంలో) ప్రయోగాత్మకంగా ఉస్మానియా యూనివర్సిటీ వంటి వాటిలో అమలుచేసిన ఈ నిర్ణయాన్ని ఈ ఏడాది నుంచి పూర్తిస్థాయిలో అమలు పరచనున్నారు. ఈ నిర్ణయంతో హైదరాబాద్, దాని చుట్టూ ఉన్న కాలేజీల్లో ఇతర రాష్ట్రాల విద్యార్థుల అడ్మిషన్లు పెరగవచ్చని భావిస్తున్నారు. ఈ 15 శాతం సీట్లలో ఎలాంటి రిజర్వేషన్లు ఉండవు. క్యాంపస్ ఉన్న కాలేజీలు, వర్సిటీల్లో ఈ కోటా సీట్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. డిగ్రీ, పీజీ కోర్సుల్లో పలు కొత్త విధానాలు అమలు చేస్తున్న ప్రభుత్వం మరో ముందడుగు వేసి.. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు 15శాతం కోటా కల్పించింది. ఇప్పటికే రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ కోర్సుల నిర్వహణలో తీసుకొచ్చిన మార్పులను చూస్తే.. ముఖ్యంగా డిగ్రీ కోర్సుల్లో బకెట్ పద్ధతి ప్రవేశపెట్టారు. డిగ్రీలో ఒక కోర్సు చదువుతూనే మరో కోర్సులో కొన్ని సబ్జెక్టులు కూడా చదువుకునేలా ఈ పద్ధతి అమలు చేస్తున్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. అలాగే ఒక కాలేజీలో అడ్మిషన్ తీసుకుని, మరో కాలేజీలో క్లాసులకు హాజరయ్యేందుకు వీలు ఉంది. ఈ మేరకు ఆయా కాలేజీల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిర్చారు. వీటితో పాటు దేశ, విదేశాలకు చెందిన వర్సిటీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఇక్కడి విద్యార్థులు కొన్ని రోజుల పాటు ఇతర దేశాలకు వెళ్లి అక్కడ చదువుకుని రావడానికి అవకాశం ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట డిగ్రీ స్థాయిలో ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టారు. ఈ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించేలా ముందుగానే ఆయా సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. పైగా సదరు విద్యార్థులకు ఆయా సంస్థలు స్టయిపండ్ చెల్లించాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ చేసిన అభ్యర్థులు పీజీ చేయడానికి వీలుగా ఆయా కోర్సుల్లో కొంతమేర మార్పులు తీసుకొచ్చారు. అలాగే డిగ్రీలో ఒక కోర్సు చదివి.. పీజీలో మరో కోర్సు చేసేందుకు కూడా అవసరమైన మార్పులు చేశారు. ఇలాంటి నిర్ణయాల ద్వారా డిగ్రీ, పీజీ కోర్సులకు డిమాండ్ పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.